అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 28-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 61 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు వెల : 5.00

కడసారి..

దుబాయ్ నుంచి ముంబయికి చేరిన శ్రీదేవి పార్థివదేహం

- ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో మునిగి మృతి : దుబాయ్ పోలీసులు
- నేడు మధ్యాహ్నం అంత్యక్రియలు
- శ్రీదేవి ఇంటికి భారీగా తరలివస్తున్న అభిమానులు, నటులు
- శోక సంద్రంలో కుటుంబసభ్యులు

ముంబయి: దుబాయ్‌లో కన్ను మూసిన అందాల నటి శ్రీదేవి పార్థివ దేహం మంగళవారం రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ముంబయిలోని విమానాశ్రయానికి చేరుకున్నది. శ్రీదేవి మృతి కేసులో విచారణ ముగిసిందని,ఈ కేసును ఇక మూసివేస్తున్నట్టు దుబాయ్ ప్రభుత్వం మంగళవారం మధ్యాహ్నం ప్రకటించడంతో ఆమె పార్థివదేహం తరలింపునకు అడ్డంకులు తొలగిపోయాయి. శ్రీదేవి స్పృహ కోల్పోవడంతో ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో మునిగి చనిపోయినట్టు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధ్రువీకరించారు. పోలీసుల దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలను పరిశీలించిన అనంతరం ప్రాసిక్యూటర్ ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. విచారణ పూర్తి కాగానే ఆమె భౌతికకాయాన్ని భారత్‌కు తరలించేందుకు వీలుగా క్లియరెన్స్ పత్రాలను కుటుంబసభ్యులకు దుబాయ్ అధికారులు అందించారు. శ్రీదేవి మరణం వెనుక ఎలాంటి అనుమానాలు



లేవని దుబాయ్ పోలీసులు తేల్చడంతో ఆమె భర్త బోని కపూర్, ఆయన మొదటి భార్య బంధువులపై వ్యక్తమైన

..9లో

ప్రాణం పోయినా.. ప్రయివేటుకివ్వం

కేంద్రం వాటా చెల్లించైనా సింగరేణిని సొంతం చేసుకుంటాం

- కారుణ్య నియామకాలతోనే ఉద్యోగాలు : సీఎం కేసీఆర్
- మంచిర్యాల జిల్లాలో ఆరు బొగ్గు గనులకు శంకుస్థాపన
- రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ
- పెద్దపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో సుడిగాలి పర్యటన
- ఆదిలాబాద్‌లో పూలకుండీ కలకలం

కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రయివేటీకరించేందుకు సిద్ధమైందని, తన ప్రాణం పోయినా సింగరేణిని ప్రయివేటీకరణ కానివ్వబోనని సీఎం కేసీఆర్ అన్నారు. కేంద్రం వాటా చెల్లించైనా సంస్థను సొంతం చేసుకుంటామని చెప్పారు. కారుణ్య నియామకాలకు తనదే హామీనని భరోసానిచ్చారు. పెద్దపల్లి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో రెండ్రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లాలో సింగరేణి ప్రాంతాలను మంగళవారం ముఖ్యమంత్రి సందర్శించారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్మికుల ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడారు.

వివరాలు 9లో

సీఎం హెలికాప్టర్‌లో పొగలు



వివరాలు 9లో



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అరెస్టులు 9

మతతత్వమే మహా అడ్డంకి

- దేశంలో విస్తరిస్తున్న మత రాజకీయాలు
- ప్రమాదంలో లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలు : ఏచూరి



కోల్‌కతా : దేశంలో సోషలిజం, ప్రజాస్వామ్య విలువలకు మతతత్వం పెద్ద అడ్డంకిగా మారిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ఎండీ.అమిన్ సంస్మరణ సభ కార్యక్రమం మంగళవారం కోల్‌కతాలో జరిగింది. ఈ సభలో ఏచూరి మాట్లాడుతూ..."మతతత్వ సిద్ధాంతంతో నడుస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు, కమ్యూనిస్టులు, మైనార్టీలు, దళితులు పెద్ద శత్రువులుగా ఉన్నారు. ఇందుకు ఉదాహరణ పంజాబ్ రాష్ట్రం. స్వాతంత్ర్యం వచ్చాక, పంజాబ్‌లో మత రాజకీయాలు బలపడటం, అక్కడ కమ్యూనిస్టులకు ఎనలేని నష్టాన్ని తెచ్చిపెట్టింది. నేడు అన్ని రాష్ట్రాల్నీ మతతత్వ రాజకీయాలు ఆవరించాయి, దీంతో దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థలకు పెను ప్రమాదం పొంచి ఉంది. దేశంలో వివిధ వర్గాలపై అణచివేతను మతతత్వ రాజకీయాలు బలోపేతం చేస్తున్నాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బిమన్ బసు, ప.బెంగాల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత మిశ్రా తదితరులు మాట్లాడారు. రోజు కూలిగా

..9లో

ఇంటర్నెట్ సేవల్లో భారత్‌కు 47వ స్థానం

- నాణ్యత సరే... తక్కువ డాటాతో సరి : ఫేస్‌బుక్ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ : ప్రస్తుతం మానవుడు సాంకేతిక యుగంలో జీవిస్తున్నాడు. మరి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలంటే...నాణ్యమైన 'ఇంటర్నెట్' సేవలు తప్పనిసరి. దీనికంటే ముందు ఇంటర్నెట్ అన్నది అందుబాటులోకి రావాలి, అందుబాటు ధరల్లో ఈ సేవలు దక్కాలి. మరి ఇలాంటిదంతా..భారతీయులకు అందు బాటులో ఉందా? అంటే, 'ఫేస్‌బుక్' జరిపిన అధ్యయనం అలా లేదని తేల్చింది. ఇంటర్నెట్ సేవల్లో

..9లో

ముహూర్తం మార్చి 14 లేదా15 ?

బడ్జెట్‌పై సీఎం నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే ఆర్థిక సంవత్సరా (2018-19)కి ప్రతిపాదించబోయే రాష్ట్ర బడ్జెట్‌కు ముహూర్తం ఖరారైందా అంటే అవుననే అంటున్నాయి ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు. మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహిం చేందుకు ప్రభుత్వం యోచిస్తున్న నేపథ్యంలో.. అదేనెల 14 లేదా 15తేదీల్లో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారని తెలిసింది. ముహూర్తాల ఆధారంగా వివిధ కార్యక్రమాలను చేపట్టే సీఎం కేసీఆర్ నిర్ణయాలకు అనుగుణంగానే ఈ రెండు తేదీల్లో ఏదో ఒక రోజున బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. అన్ని రకాలుగా ఆలోచించిన తర్వాతే సీఎం.. 14 లేదా 15 తారీఖులను ఫైనల్ చేసినట్టు సమాచారం. ఈ యేడాదీ చేదు గుళికే.. మరోవైపు మార్చితో ముగియబోతున్న ఆర్థిక సంవత్సరం (2017-18) కూడా టీఆర్ఎస్ సర్కారుకు చేదు గుళికలనే మిగల్చబోతున్నదని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ యేడాది జనవరి చివరి నాటికి రూ.లక్షా 13 వేల కోట్ల రెవెన్యూ ఆదాయం వస్తుందంటూ ప్రభుత్వం అంచనా వేసుకోగా.. ఇందులో కేవలం రూ.66 వేల కోట్లే వచ్చాయి. దీంతోపాటు రుణాలు, అడ్వా న్సులు, ఇతర రశీదులు, అప్పులు, ఇతర వెసులుబాట్ల ద్వారా రూ.31 వేల కోట్లఆదాయం సమకూరు తుందంటూ సర్కారు అంచనా

...9లో

కొత్తగా 150 నగరాల్లో నీట్ నిర్వహణ

ఖమ్మం, రంగారెడ్డిలో పరీక్షా కేంద్రాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నీట్ పరీక్ష నిర్వహణ నగరాల సంఖ్యను పెంచింది. అభ్యర్థులు సులభంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా నూతనంగా 43 నగరాల్లో ప్రవేశపరీక్షను నిర్వహించాలని నిర్ణయించింది. గత సంవత్సరం 107 నగరాల్లో నీట్ పరీక్ష నిర్వహించగా.. ఈ ఏడాది ఆ సంఖ్యను 150కి పెంచింది. తెలంగాణలోనూ కొత్తగా ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో నీట్-2018 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్‌జవదేకర్ చెప్పారు. మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. నూతన నగరాల్లో నాలుగు వేల సంఖ్యకు పైగా అభ్యర్థులు నీట్‌కు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి చెప్పారు. నీట్-2018 పరీక్ష కేంద్రాలు కొత్తగా ఏపీలో ఐదు, అసోం(2), గుజరాత్(3), మహారాష్ట్ర(6), ఒడిషా(4), తమిళనాడు(2), కేరళ(5), పశ్చిమబెంగాల్(3), యూపీ(3) ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్‌లో, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, కర్నాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అదనంగా ఒక్కో నగరాన్ని చేర్చారు. ఈ ఏడాది మే 6వ తేదీన నీట్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏపీ విషయానికొస్తే కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, విజయనగరంలో నీట్ పరీక్షా కేంద్రాలు నెలకొల్పనున్నారు.

కేంద్రం ఏంచేస్తోంది

- ఇంకా నయం...వాళ్లు ఫ్యాన్‌ను వదిలేశారు! :

పీఎన్‌బీ కుంభకోణంపై బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా



న్యూఢిల్లీ : దేశాన్ని కుదిపేసిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం విషయంలో బీజేపీ అసమ్మతి ఎంపీ శత్రుఘ్నసిన్హా మరోసారి నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ పీఎన్‌బీలో నాలుగేండ్లుగా కుంభకోణం యథేచ్ఛగా సాగుతున్నా.. కేంద్రం ఏమీ తెలియనట్టు ఎందుకు ఉండిపోయింది ? ఆడిటర్లను, బ్యాంక్‌ను తప్పుబట్టడం సరే...నిజమైన యజమాని కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత లేదా ? అని పరోక్షంగా ప్రశ్నించారు. ప్రముఖ డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ బ్యాంకును రూ.12వేల కోట్ల మేర ముంచేసి.. విదేశాలకు చెక్కేసిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణానికి పీఎన్‌బీ ఆడిటర్లే కారణమని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొనడాన్ని తప్పుబట్టారు. సంస్థ ఆడిటర్లను తప్పుబడుతూ.. బ్యాంకులోని చిన్న చిన్న ఉద్యోగులను సైతం ఈ స్కాంలో

...9లో

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- 9,63,546 మంది విద్యార్థులు
- 1294 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం 9 దాటితే అనుమతి లేదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 14 వరకు ప్రధాన పరీక్షలు, 19వ తేదీ వరకు మొత్తం పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంటర్ పరీక్షలు ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. విద్యార్థులు ఉదయం 9 గంటలు దాటి నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు

...9లో



ప్రసవ వేదన

- గర్భిణిని 3 కిలోమీటర్లు జోలెలో తీసుకెళ్లిన భర్త, తండ్రి
- ఏజెన్సీ గ్రామానికి రోడ్డులేని దైన్యస్థితి
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

రోడ్డులేక అంబులెన్స్ రాక.. పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను జోలెలో మూడు కిలోమీటర్ల దూరం పాటు భర్త, మహిళ తండ్రి గుట్టలను దాటుకుంటూ మోసుకెళ్లిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టెవాడ పంచాయతీ పరిధిలోని నేలవంచలో మంగళవారం జరిగింది. ఏజెన్సీలోని ఆడబిడ్డలకు ప్రసవ వేదన తప్పట్లేదనటానికి ఈ ఉదాహరణే ప్రత్యక్ష తార్కాణం. 'అది చేశాం..ఇది చేశాం' అని గొప్పలు చెప్పుకోవడాన్ని ఆపి తమ గ్రామానికి రోడ్డు వేయించాలని ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు.



వివరాలు 9లో

సీబీఐ కార్యాలయం ఎదుట..
జేఎన్‌యూ విద్యార్థుల ఆందోళన



న్యూఢిల్లీ: జేఎన్‌యూ విద్యార్థి నజీబ్ అహ్మద్ మిస్సింగ్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో.. జేఎన్‌యూ విద్యార్థులు ఢిల్లీలోని సీబీఐ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఎన్‌యూ, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) విద్యార్థులు కలిసి ఈ ధర్నా నిర్వహించారు. నజీబ్ ఆచూకీ కనుగొనాలని డిమాండ్ చేశారు. సీబీఐకీ, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నజీబ్ ఆచూకీ కోసం అతడి తల్లీ, సోదరులు, జేఎన్‌యూ విద్యార్థులు అనేక నెలలుగా ఆందోళనలుచేస్తున్నారు. జేఎన్‌యూలో ఏబీవీపీ విద్యార్థులు అతనితో ఘర్షణ తర్వాత... 2016, అక్టోబర్ 15 నుంచి నజీబ్ అదృశ్యమైన విషయం తెలిసిందే. ఢిల్లీ పోలీసులు ఈ మిస్టరీ మిస్సింగ్‌ను ఛేదించకపోవడంతో సుప్రీంకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. అయినా ఇంతవరకు నజీబ్ ఆచూకీ దొరకలేదు.

హోలి పేరుతో వేధింపులు

- ఎస్ఎఫ్ఐ ఖండన

న్యూఢిల్లీ : హోలి పేరుతో వీధుల్లో విద్యార్థినులపై వేధింపులకు పాల్పడే అసహ్యకర సంఘటనలను భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటి తీవ్రంగా ఖండించింది. లేడి శ్రీరామ్ కాలేజికి చెందిన విద్యార్థినులపై గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న విధానంగానే ఈ సంవత్సరం కూడా నీటితో నింపిన కండోమ్‌లను మహిళలపైకి రువ్వే సంఘటనలు జరుగుతున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. నాగరిక సమాజంలో ఇది సహించరాని విషయమని పేర్కొంది. ఇటువంటి చర్యలను విద్యార్థినులపై జరిగే నేరపూరిత హింసలుగా ఎస్ఎఫ్ఐ పరిగణిస్తుందని ఆ కమిటీ తెలిపింది. ఇది మన సమాజంలో వేళ్ళూనుకుపోయిన పితృస్వామ్య వ్యవస్థను ప్రతిబింబిస్తున్నదని పేర్కొంది. ఈ సంఘటనలను సాధారణ చర్యలుగా చూడరాదని తెలిపింది.

తెలంగాణ ప్రభుత్వము రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

నెం.ఇ2/4765/2017 తేది:12-02-2018
గెజిట్ ఆర్.ఓ.నెం.19 తేది:21-02-2018

ఫారం-VII

డిక్లరేషన్

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం, మోకిల గ్రామంలో ... ఎకరాల భూమి భూసేకరణ నిమిత్తం డిక్లరేషన్ ... [illegible]

షెడ్యూలు

జిల్లా: రంగారెడ్డి మండలం: శంకర్‌పల్లి గ్రామము: మోకిల

క్ర.సం	సర్వే నెం.	భూమి స్వభావం	విస్తీర్ణం	అనుభవదారుని పేరు	...	...	...	...
1	65	పట్టా మెట్ట	0.18	కోళ్ళ భద్ర సోమయ్య	65	65	65	
2	65	పట్టా మెట్ట	0.02	[illegible]	65	65	65	
3	65	పట్టా మెట్ట	0.07	[illegible]	65	65	65	
4	65	పట్టా మెట్ట	0.02	[illegible]	65	65	65	
5	61	పట్టా మెట్ట	0.03	[illegible]	61	61	61	
6	61	పట్టా మెట్ట	0.01	[illegible]	61	61	61	
7	61	పట్టా మెట్ట	0.03	[illegible]	61	61	61	
8	61	పట్టా మెట్ట	0.03	[illegible]	61	61	61	
9	61	పట్టా మెట్ట	0.13	[illegible]	61	61	60	
10	60	పట్టా మెట్ట	0.04	[illegible]	60	60	60	
11	60	పట్టా మెట్ట	0.05	[illegible]	60	60	60	
12	52	పట్టా మెట్ట	[illegible]	[illegible]	60	60	60	
13	52	పట్టా మెట్ట	0.06	[illegible]	52	52	52	
14	52	పట్టా మెట్ట	0.04	[illegible]	52	60	59	
15	52	పట్టా మెట్ట	0.12	[illegible]	59	54	53	
16	53	పట్టా మెట్ట	0.16	[illegible]	59	53	53	
17	53	పట్టా మెట్ట	0.09	[illegible]	53	53	53	
18	53	పట్టా మెట్ట	0.09	[illegible]	53	53	53	
19	53	పట్టా మెట్ట	0.23	[illegible]	53	47	47	
20	53	పట్టా మెట్ట	0.14	[illegible]	53	47	47	
21	47	పట్టా మెట్ట	0.09	[illegible]	53	47	47	
22	52	పట్టా మెట్ట	0.08	[illegible]	52	52	52	
23	52	పట్టా మెట్ట	0.06	[illegible]	52	52	52	
24	52	పట్టా మెట్ట	0.03	[illegible]	52	52	52	
25	52	పట్టా మెట్ట	0.08	[illegible]	52	52	52	
26	52	పట్టా మెట్ట	0.04	[illegible]	52	52	52	
27	67	పట్టా మెట్ట	0.04	[illegible]	67	67	67	
28	67	పట్టా మెట్ట	0.06	[illegible]	67	67	67	
29	67	పట్టా మెట్ట	0.05	[illegible]	67	67	67	
30	67	పట్టా మెట్ట	0.04	[illegible]	67	67	67	
31	67	పట్టా మెట్ట	0.04	[illegible]	67	67	67	
32	67	పట్టా మెట్ట	0.04	[illegible]	67	67	67	
33	67	పట్టా మెట్ట	0.03	[illegible]	67	67	66	
34	66	పట్టా మెట్ట	0.10	[illegible]	66	66	66	
35	66	పట్టా మెట్ట	0.32	[illegible]	66	66	66	
36	69	పట్టా మెట్ట	0.02	[illegible]	69	69	69	
37	69	పట్టా మెట్ట	0.04	[illegible]	69	69	69	
38	69	పట్టా మెట్ట	0.13	[illegible]	69	69	69	
39	70	పట్టా మెట్ట	0.01	[illegible]	70	70	70	
40	70	పట్టా మెట్ట	0.05	[illegible]	70	70	70	
41	70	పట్టా మెట్ట	0.01	[illegible]	70	70	70	
42	70	పట్టా మెట్ట	0.28	[illegible]	70	70	70	
43	70	పట్టా మెట్ట	0.02	[illegible]	71	70	70	
44	71	పట్టా మెట్ట	0.11	[illegible]	70	70	71	
45	31/11	పట్టా మెట్ట	0.01	[illegible]	31	31/2		
46	31/12	పట్టా మెట్ట	0.20	[illegible]	31/1	31/12		
47	31/19	పట్టా మెట్ట	0.23	[illegible]	31/20	31/23	31/19	
48	31/20	పట్టా మెట్ట	0.28	[illegible]	31/20	31/20	31/23	31/19
49	31/21	పట్టా మెట్ట	0.02	[illegible]	31/19	31/21	31/21	31/19
50	31/22	పట్టా మెట్ట	0.16	[illegible]	31/22	31/23	47	31/22
51	31/23	పట్టా మెట్ట	1.13	[illegible]	31/20	47	31/23	31/24
52	31/24	పట్టా మెట్ట	0.08	[illegible]	31/23	31/31	31/23	31/20
53	31/26	పట్టా మెట్ట	0.07	[illegible]				
	మొత్తం		ఎ.13.10 గుం.					

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 ప్రకారం ... [illegible]

భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, చేవెళ్ల డివిజన్, రంగారెడ్డి జిల్లా
జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి జిల్లా
జిల్లా కలెక్టర్ రంగారెడ్డి

34 ఏండ్లు.. 70 బదిలీలు..
శాఖలేదు.. శాలరీ లేదు

బీజేపీపాలిత హర్యానా సర్కారులో ఐఏఎస్ అధికారి నేడు పదవీవిరమణ



చండీగఢ్ : హర్యానా చరిత్రలోనే కాదు.. దేశంలో తొలిసారిగా ఓ ఐఏఎస్ అధికారి ఆరు నెలలుగా జీతం, అలవెన్సులు, ఇతర సౌకర్యాలేవీ లేకుండా 28న(బుధవారం) పదవీ విమరణ చేయనున్నారు. ఆయనే సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ కసాని. 34 ఏండ్ల తన సర్వీసులో 70 సార్లు బదిలీలను ఎదుర్కొన్నారు. ల్యాండ్ యూజ్ బోర్డ్ సీఈఓగా ఆయనను హర్యానా ప్రభుత్వం నియమించినప్పటికీ.. ప్రభుత్వ అధికారిగా ఐఏఎస్ జాబితాలో ఆయన పేరులేదు.అంతటితో ఆపకుండా జీతంతోపాటు, ఇతర అలవెన్సులను కూడా బీజేపీ సర్కారు నిలిపివేసింది.ఆయన చేసిన తప్పంతా నిక్కచ్చిగా..నిజాయితీగా ఉండటమేనని ఐఏఎస్ వర్గాల్లో వినిపిస్తున్న చర్చ. 1980 బ్యాక్ హెచ్‌సీఎస్ అధికారి అయిన ప్రదీప్ కసానీ హర్యానా ప్రభుత్వంలో 1984 నుంచి బాధ్యతల్లో ఉన్నారు. ల్యాండ్ యూజ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా గతేడాది ఆగస్టు 24న ఆయనను హర్యానా ప్రభుత్వం బదిలీచేసింది. అప్పటి నుంచి జీతం, అలవెన్సులు, ఇతర సౌకర్యాల కోసం ఆయన ఖట్టర్ సర్కారుపై పోరాడుతూనే ఉన్నారు. ఇదొక్కటే కాదు, కార్యాలయంలో పనిచేయడానికి కావాల్సిన ఫైళ్లు లేవు, ఆఫీసు సిబ్బందికూడా అందుబాటులో లేకుండా చేసింది బీజేపీ సర్కారు. జీతంతోపాటు వాటి గురించి కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. చివరకు ఆర్‌టీఐ ద్వారా ఆయనకు తెలిసిందేమంటే.. 2008 నుంచి ఆ ల్యాండ్ యూజ్ బోర్డు ఉనికిలోనే లేదు. 2007 వరకూ ఇది పర్యావరణ శాఖ పరిధిలో ఉండగా, ఆ తర్వాత దాన్ని వ్యవసాయ శాఖ పరిధిలోకి తెచ్చారు. కాగా, ల్యాండ్ యూజ్ బోర్డును మూసివేసే ప్రతిపాదనను కేంద్రానికి ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ పంపింది. 2008లో కేంద్రం ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.దీంతో ల్యాండ్ యూజ్ బోర్డును రద్దుచేశారు. అసలు శాఖంటూ లేని విభాగానికి ఆయనను హర్యానా ప్రభుత్వం బదిలీచేసింది. జీతం ఇవ్వకుండా కూర్చోబెట్టింది. కాగా, ఈ విషయమై ఆయన హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ)వద్దకు వెళ్ళాల్సిందిగా కోర్టు ఆయనకు సలహానిచ్చింది. సీఏటీలో ఆయన కేసు గెలిస్తే.. 18 శాతం వడ్డీ కలిపి జీతం బకాయిలు చెల్లించాల్సి ఉంది. కసానీ జీతం, ఇతర అలవెన్సులకు సంబంధించి సమాధానం చెపాల్సిందిగా హర్యానా ప్రభుత్వాన్ని సీఏటీ ఇప్పటికే ఆదేశించింది. ఈ కేసు మార్చి 7న విచారణకు రానుండగా, అప్పటికే ఆయన పదవీ విరమణ చేయనుండటం గమనార్హం.

FORM - IV

Statement about ownership and other particulars about newspaper NAVATALANGANA SAMAGRA TELUGU DINA PATRIKA to be published in the first issue every year after the last day of Februay.

1. Place of publication	:	Hyderabad
2. Periodicity of its publication	:	Daily
3. Printer's Name	:	Nandayala Narsimha Reddy
Nationality	:	Indian
Address	:	M.H.Bhavan, 1st Floor, Plot.No.21/1, Azamabad, Near RTC Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State.
4. Publisher's Name	:	Nandayala Narsimha Reddy
Nationality	:	Indian
Address	:	M.H.Bhavan, 1st Floor,Plot.No.21/1, Azamabad, Near RTC Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State.
5. Editor's Name	:	S.Veeraiah
Nationality	:	Indian
Address	:	M.H.Bhavan, 1st Floor, Plot.No.21/1, Azamabad,Near RTC Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State.
6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital.	:	Navatelangana Printers Private Limited
	:	Indian
	:	M.H.Bhavan, 1st Floor,Plot.No.21/1, Azamabad,Near RTC Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State.

I, Nandayala Narsimha Reddy hererby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
Date:28-02-2018 Signature of Publisher

దాడి చేయబోమని హామీ ఇస్తేనే...సమావేశానికొస్తాం

ఢిల్లీ సీఎంకు సీఎస్ లేఖ

న్యూఢిల్లీ: తమపై దాడి చేయబోమని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హామీ ఇస్తేనే ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు హాజరవుతామని ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్ అన్నారు. ఈ విషయంపై కేజ్రీవాల్‌కు ఆయన మంగళవారం ఓ లేఖ రాశారు. మూడు రోజులుగా అధికారులు లేక పాలన స్తంభించిందని.. ప్రజా సౌకర్యార్థం అధికారులంతా తమ విధులకు హాజరు కావాలని ప్రభుత్వాధికారులను కేజ్రీవాల్ కోరారు. దీంతో సీఎస్ పై విధంగా స్పందించారు. గత వారం సీఎస్‌పై ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు దాడికి పాల్పడిన తర్వాత ప్రభుత్వాధికారులు కేజ్రీవాల్ ప్రభుత్వంలో పనిచేయలేమని సచివాలయానికి రావడం మానేశారు. ఈ విషయమై కేజ్రీవాల్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌తో మాట్లాడారు. ఇదిలా వుండగా, ఢిల్లీలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ ప్రత్యక్షప్రసారం చేయనున్నారు. ఆ సమాచారాన్నంతా ప్రజలు చూడటం కోసం వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు.

అమలుకాని సంస్కరణలు - ఆందోళనలో దళితులు

నవతెలంగాణ, జనరల్‌డెస్క్

గుజరాత్‌లోని పఠాన్ జిల్లాలో దళితులు తమ భూమి హక్కు కోసం ఇటీవల జరిపిన ఆందోళన అనూహ్య మలుపులు తిరిగి చివరికి ఓ పరిష్కారం సాధించినట్టుగా పైకి కనిపిస్తున్నప్పటికీ అనేక సందేహాలు అక్కడి ప్రజల్లో ఇంకా వ్యక్తమవుతూనే ఉన్నాయి. సమీ బ్లాక్‌లోని దుద్కా గ్రామానికి చెందిన రహాభాయి చమర్, హేమాబెన్ వంకార్ వారసత్వంగా తమకు రావాల్సిన ఇనాం భూమి కోసం 2009 నుంచి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. వారసత్వంగా తాము సాగు చేసుకుంటున్న 20 ఎకరాల భూమిపై తమకు హక్కుదారుగా పట్టాలివ్వాలని వారిద్దరూ రెవెన్యూ ఆఫీస్‌లో దరఖాస్తు పెట్టుకున్నారు. అప్పుడు చేసిన చెలాన్ రూ.11,100 చెల్లించి 2013 ఫిబ్రవరిలో రెవెన్యూ అధికారులకిచ్చారు. తమ పేరున పట్టాలివ్వడానికి ఈ సొమ్ము తాము తప్పనిసరి చెల్లించాల్సిన ఫీజుగా వారు భావించారు.

దుద్కా గ్రామంలోని 20 ఎకరాల భూమిని దాదాపు వందేండ్ల క్రితం స్థానిక సంస్థాన పాలకుడు(రాజు) ఈ రెండు కుటుంబాలకు జాయింట్‌గా ఇనాం కింద ఇచ్చారు. మా తాతల కాలం నుంచి నేటి వరకూ ఆ భూమిని తామే సాగు చేసుకుంటున్నామని చమర్(49) తెలిపారు. కానీ, ఆ భూమి అధికారికంగా ప్రభుత్వం కింద ఉన్నందున పట్టాలివ్వాలని(క్రమబద్ధీకరణ చేయాలని) కోరామని చమర్ తెలిపారు. 2013 నుంచి కనీసం 30సార్లు రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌కు వెళ్లి పలువురికి మొర పెట్టుకున్నామని, ఇక కలెక్టర్ ఆఫీస్‌కు ఎన్నిసార్లు తిరిగామో కూడా గుర్తుకు లేదని చమర్ వాపోయారు.

చివరికి ఈ రెండు కుటుంబాలకు భూమి పట్టాలు అందజేయడం కూడా ఎంతో నాటకీయ పరిణామాల మధ్య జరిగింది. వీరి తరఫున పోరాడిన దళిత హక్కుల(రాష్ట్రీయ దళిత అధికార్ మంచ్) కార్యకర్త, రిటైర్డ్ ఉద్యోగి భానుభాయి వంకార్ ఈ నెల 15న పఠాన్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఆత్మాహుతికి పాల్పడ్డారు. ఆయన మరణంతో ఉత్తర గుజరాత్ ఆందోళనలతో అట్టుడికింది. వేలాదిమంది దళితులు పఠాన్ జిల్లాతోపాటు పొరుగున మెహసానా జిల్లాలో రోడ్లమీదికొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 18న ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న దళిత ఉద్యమ నేత, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీతోపాటు 100మంది కార్యకర్తలను అహ్మదాబాద్ పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకొని అరెస్ట్ చేశారు.

గుజరాత్‌లో భూ హక్కుల కోసం పోరాటం



భానుభాయి శవానికి పోస్టుమార్టం నిర్వహించిన గాంధీనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కూడా దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. భానుభాయి కోరినట్టుగా భూమి పట్టాలు ఇవ్వడంతోపాటు, ఆయన మృతి చెందిన కారణాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరపాలని సంఘాలు డిమాండ్ చేశాయి. దళిత సంఘాల డిమాండ్లకు ప్రభుత్వం హామీ ఇచ్చే వరకూ శవాన్ని తీసుకెళ్లేది లేదని ఆయన కుటుంబసభ్యులు కూడా నిరసన తెలిపారు. దాంతో, అధికారులు దిగివచ్చి తక్షణ డిమాండ్లకు హామీ ఇవ్వడంతో ఈ నెల 19న భానుభాయి వంకార్‌కు దళిత,ప్రజా సంఘాలు అంత్యక్రియలు నిర్వహించాయి. మరుసటి రోజున (ఈ నెల 20న) హేమాబెన్‌తోపాటు చమర్ కోరిక మేరకు ప్రభుత్వ అధికారులు భూమి పట్టాలను భానుభాయి భార్య చేతుల మీదుగా వారిద్దరికీ అందించారు.

కులం కారణంగానే జాప్యం..?

తాను, హేమాబెన్ దళితులమైనందునే తమకు పట్టాలిచ్చేందుకు తాత్సారం చేశారని చమర్ అన్నారు. భానుభాయితోపాటు చమర్ కూడా ఆత్మాహుతికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారన్నది గమనార్హం. తమలాగే తమ తాలుకాలో మరో మూడు కుటుంబాలు భూమి పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా వారికి ఫీజులు చెల్లించగానే మంజూరయ్యాయని భానుభాయి తమతో చెప్పారని చమర్ తెలిపారు. వారు దళితేతరులైనందునే వెంటనే పట్టాలిచ్చినట్టు భానుభాయి చెప్పారని చమర్ అన్నారు. పఠాన్ జిల్లాకు 30 కి.మీ. దూరంలోని వనగాల గ్రామానికి చెందిన రైతులు తాము కూడా భూమి హక్కుల కోసం ఓ దశాబ్ద కాలంగా పోరాడుతున్నామని తెలిపారు. తమ పొరుగున ఉన్న బీసీ కుటుంబాలకు మాత్రం ఇబ్బంది పెట్టకుండానే వారికి కేటాయించిన భూమి పట్టాలిచ్చారని వారు తెలిపారు.

సామాజికవేత్త ఘనశ్యాం ప్రకారం గుజరాత్‌లోని మొత్తం వ్యవసాయ కార్మికుల్లో 11.3 శాతం భూమిలేని పేదలు కాగా, దళితుల్లో మాత్రం అది 60 శాతంగా ఉన్నదని 2016లో జరిపిన ఓ సర్వేలో వెల్లడైంది. 2011 సామాజిక-ఆర్థిక కులగణన ప్రకారం దళితుల్లో భూమిలేనివారి జాతీయ సగటు 46 శాతం కాగా, గుజరాత్‌లో అంతకన్నా అధికంగా ఉండటం గమనార్హం. గుజరాత్ వ్యవసాయ భూపరిమితి చట్టం-1961 ప్రకారం రైతుకు సాగుభూమి 16 ఎకరాలకు, మెట్టభూమి 32 ఎకరాలకు పరిమితం చేశారు. మిగులు భూముల్ని ఎస్సీ,ఎస్టీ,బీసీల్లోని పేదలకు పంచాలి. గుజరాత్‌లో భూసంస్కరణలు సక్రమంగా అమలు కానందునే ఆ రాష్ట్రంలోని దళితులు సంఘటిత ఉద్యమాలపైపు ఆకర్షితులవుతున్నారని పరిశీలకులు చెబుతున్నారు. చాలా చోట్ల దళితులకు భూపంపిణీ జరిపినట్టు లెక్కల్లో చూపుతున్నా వాస్తవంగా ఆ భూములపై అగ్ర కులాలకు చెందినవారే హక్కులు అనుభవిస్తున్నారని చెబుతున్నారు. ఆక్రమణలకు గురైన దళితుల భూములను తిరిగి వారికి ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నవారిలో ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ కూడా ఒకరు. 2012లో గుజరాత్ హైకోర్టులో ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు కాగా, అందుకు సమాధానమిచ్చిన ఆ రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ చట్టం కింద లక్షా 60 వేల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసినట్టు తెలిపింది. మొత్తం 37,198 మంది భూమిలేని పేదలు లబ్ది పొందగా, వారిలో 17,163 కుటుంబాలు ఎస్సీలు, ఎస్టీలని తెలిపింది. కానీ, 2014లో ఆర్‌టీఐ కింద మేవానీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానంలో 18,000 కుటుంబాలకు మాత్రమే లబ్ది చేకూరింది.

సాకులు చెప్పొద్దు..వివరాలివ్వండి..!

ప్రధాని విదేశీ ప్రయాణ ఖర్చులపై..

- కేంద్రానికి సమాచార కమిషన్ ఆదేశం..!!



న్యూఢిల్లీ: ప్రధాని విదేశీ ప్రయాణాల కోసం ఎయిర్ ఇండియాకు కేంద్ర ప్రభుత్వం చెల్లించిన మొత్తం ఎంతో తెలపాలని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఆదేశించింది. 2013-14 ఆర్థిక సంవత్సరం నుంచి 2016-17 వరకూ వివరాలు ఇవ్వాలని తెలిపింది. నౌకాదళానికి చెందిన రిటైర్డ్ అధికారి లోకేశ్‌బాత్రా ఫిర్యాదు మేరకు విదేశాంగశాఖకు సీఐసీ ఈ ఆదేశాలిచ్చింది. సమాచార హక్కు చట్టం కింద తాము వివరాలు ఇవ్వాలని కోరగా తప్పుడు సమాధానం మంత్రిత్వశాఖ నుంచి సమాధానం రాలేదని బాత్రా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశ భద్రత పేరుతో రికార్డులు దాచి పెట్టాల్సిన అవసరం లేదని బాత్రా సూచించారు. ఎయిర్ ఇండియాకు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నందున వెంటనే బిల్లులు చెల్లించాలని, లేదంటే వడ్డీలు పెరిగి మరింత భారం పెరుగుతుందని, ఆది పన్ను చెల్లింపుదారులపై పడుతుందని బాత్రా గుర్తు చేశారు. ప్రధాని పలుమార్లు విదేశాలకు వెళ్లినందున అందుకు సంబంధించిన బిల్లులు, వివరాలు సమకూర్చడానికి సిబ్బంది అవసరమవుతారని, చాలా సమయం పడుతుందని విదేశాంగశాఖ ఇచ్చిన సమాధానాన్ని సీఐసీ తిరస్కరించింది. ఎప్పటికప్పుడు అధికారులు బిల్లులు తయారు చేసి చెల్లిస్తారని, అందువల్ల ఫిర్యాదుదారుకు వివరాలు ఇవ్వాల్సిందేనని ముఖ్య సమాచార కమిషనర్ ఆర్‌కె మాథుర్ స్పష్టం చేశారు.

రక్షణ, భద్రతా రంగాల్లో జోర్డాన్‌తో ఒప్పందాలు

భారత్‌లో మొదలైన జోర్డాన్ రాజు అల్ హుస్సేన్ పర్యటన

న్యూఢిల్లీ : మూడు రోజుల భారత పర్యటన నిమిత్తమై జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 బిన్ అల్ హుస్సేని మంగళవారం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా రక్షణ, భద్రత, పెట్టుబడుల రంగాల్లోని పలు అంశాలపై ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరగనున్నాయి. తీవ్రవాదం, అతివాద గ్రూపులకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలు వంటి వాటిపై ప్రధాని మోడీ- హుస్సేని చర్చలు జరుపనున్నారు. రక్షణ, భద్రతరంగాల్లో ఇరు దేశాల మధ్య గతంలోనే ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. సిరియా శరణార్థుల సంక్షోభం, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదం...వంటివాటిని జోర్డాన్ సమర్థవంతంగా నియంత్రించగలిగింది. ఈ అంశంలో జోర్డాన్ అనుభవాన్ని, పద్ధతుల్ని తెలుసుకోవటంపై భారత్ ఆసక్తికనబర్చింది.

జోర్డాన్ రాజు హుస్సేనికి ఆ దేశ ఆర్మీలో పనిచేసిన అనుభవముంది. అలాగే దేశ రక్షణ, భద్రతా అంశాల్లో అవగాహన ఉంది. ఇరాక్‌లో గల్లంతైన భారతీయుల్ని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావటంలో సాయం చేస్తామంటూ గతంలో జోర్డాన్ ముందుకు వచ్చింది. ఎన్నో దశాబ్దాల నుండి కొనసాగుతున్న ఇరు దేశాల వర్తక, వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవటంపై జోర్డాన్ రాజు దృష్టిపెట్టారు.

మధ్యప్రాచ్యంలో దౌత్యపరంగా జోర్డాన్ వ్యూహాత్మక ప్రాంతంలో ఉంది. ఆసియా, యూరప్, గల్ఫ్ దేశాలతో జోర్డాన్‌కు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలున్నాయి. అలాగే జోర్డాన్‌లో భారతీయ వ్యాపారవేత్తలు పలు సంస్థలు స్థాపించారు. మనదేశంలోకి జోర్డాన్ నుంచి ఎరువులు, రసాయనాలు దిగుమతవుతున్నాయి. ఇది మన ఆహార దిగుబడుల్ని పెంచటంలో కీలక పాత్ర పోషించింది, ఇప్పుడు ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా ఒప్పందాలు వర్తక, వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఐఐటీల్లో మహిళలకు 14 శాతం సీట్లు

లింగ నిష్పత్తిని పెంచడానికి ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ : ఐఐటీల్లో మహిళలను ప్రోత్సహించడానికి, లింగ నిష్పత్తి పెంచడానికి 14 శాతం సీట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రవేశ పరీక్షకు కొన్ని నెలల ముందే అన్ని ఐఐటీ కాలేజీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అవసరమైతే మహిళల కోసం నిర్దిష్ట సీట్ల సంఖ్యను పెంచాలని సూచించింది. దీనిపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) కసరత్తులు ప్రారంభించింది. స్కూల్ స్థాయి నుంచే దీన్ని ప్రారంభించడం అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్‌లో అమ్మాయిలెంత పైస్థాయి అయినప్పటికీ ఐఐటీపై వారు ఆసక్తి చూపడం లేదు. అందువల్ల ఈ ఏడాది నుంచి ఐఐటీల్లో మహిళలకు 14 శాతం సీట్లు కేటాయించాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఐఐటీజేఈఈ పరీక్షల్లో అర్హత సాధించినప్పటికీ ఐఐటీల్లో చేరేందుకు అధిక శాతం మహిళలు ఆసక్తిచూపడంలేదు. దీని వల్ల సంస్థలు, సమాజానికి భారీ నష్టం వాటిల్లుతోందని సౌత్ ఏషియా, వెంచర్ కాపిటల్ ఇంటర్ నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ రీజినల్ లీడ్, రుచిరా శుక్లా తెలిపారు. ఇంజనీరింగ్ మహిళలకు సరైన వృత్తి కాదనే దురభిప్రాయం ఉండటమే ఈ పరిస్థితికి కారణమని ఆమె అన్నారు. ఐఐటీల్లో రాణిస్తున్న వారు యువ మహిళలను ప్రోత్సహించాలని, వారికి ఆదర్శంగా నిలవాలని శుక్లా సూచించారు. దీని వల్ల దేశానికేగాక ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గతేడాది ఐఐటీలో దాదాపు 11,000 మంది విద్యార్థులు చేరగా కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లలో మహిళలు 10 శాతం కంటే తక్కువగా ఉన్నారు. 2017లో కాన్పూర్ ఐఐటీలో చేరిన 826 మంది విద్యార్థుల్లో 6.5శాతం, గౌహతి ఐఐటీలో 643 మంది విద్యార్థుల్లో 6.3 శాతం మంది మహిళా విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఢిల్లీ, బాంబే ఐఐటీల్లో కూడా 10 శాతం మంది మహిళా విద్యార్థులే ఉన్నారు. గతేడాది చూసినట్టయితే ఐఐటీలన్నింటిలోకెల్లా 'ఐఐటీ మండీ'లో 14 శాతం మంది మహిళా విద్యార్థులు చేరారు.



ప్రతి ఏడాది ఒక అత్యంత ప్రతిభావంతురాలైన మహిళా విద్యార్థి ఐఐటీ సీటు కోల్పోతున్నారని దీనికి సమాజిక పరిణామాలు ఓ కారణం కాగా అత్యధిక పోటీ ఉన్న జేఈఈ(అడ్వాన్స్‌డ్) ప్రవేశ పరీక్షకు సిద్ధమవ్వడానికి అనుమతించకపోవడమా కారణమని ఐఐటీ మండి డైరెక్టర్ తిమోతి ఏ గొన్సాల్వ్ వెల్లడించారు. ఐఐటీ సంస్థలు ఉన్నత చదువుల్లో, సమాజానికి ప్రైమ్ (ఎస్‌టీఈఎం) కోర్సులను ప్రవేశపెట్టి బాలికలను ప్రోత్సహించడానికి పాఠశాలలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. 2020 నాటికి ఇంజనీరింగ్ కాలేజీల్లో లింగ నిష్పత్తి కనీసం 20 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.


మద్రాస్ ఐఐటీలో
రాష్ట్ర గీతానికి బదులు సంస్కృత శ్లోకం

చెన్నై: తమిళనాడులో పాగా వేయడం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే చెన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తమిళ రాష్ట్ర గీతం 'తమిళ్ తాయ్ వాల్తు'కు బదులు సంస్కృత శ్లోకం 'మహా గణపతిమ్ మనసా స్మరామి'ని పాడించడం వివాదాస్పదమైంది. కార్యక్రమానికి హాజరైన కేంద్ర రవాణా, జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి రాధాకృష్ణన్ సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మరుమల్లర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) నాయకుడు వైగో.. వర్సిటీ చర్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా ఏ వేడుక నిర్వహించినా రాష్ట్ర గీతం పాడడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఇప్పుడు తమిళ ప్రతిష్ఠకు బీజేపీ కలిగిస్తున్నది. తమిళనాడులో హిందీని అమలు చేయాలనే దురుద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంస్కృత శ్లోకం ద్వారా రాష్ట్రంలోకి ప్రవేశిస్తోంది' అని ఆరోపించారు. దీనికి కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని.. తమిళ ప్రజలకు గడ్కరీ, రాధాకృష్ణన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనపట్ల వర్సిటీ డైరెక్టర్ భాస్కర్ రామ్మూర్తి స్పందిస్తూ.. విద్యార్థులు కోరితేనే ఆ పాట పాడించామని తెలిపారు. ఆరోపణలపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యస్వామి స్పందిస్తూ.... ఐఐటీ మద్రాస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థ అని, ఏ పాట పాడాలో కేంద్ర ఆదేశానుసారం ఉంటుందని తెలిపారు.

సర్కారు బడుల్లో టాకింగ్ బుక్స్

- ప్రయోగాత్మకంగా 200 స్కూళ్లలో ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యార్థుల్లో పుస్తకాలు చదువే ఆలోచన పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న పద్ధతులను అవలంభిస్తున్నది. దీనిలో భాగంగా ఈ విద్యాసంవత్సరం టాకింగ్ బుక్స్(మాట్లాడే పుస్తకాలు)ను పరిచయం చేస్తున్నది. 31 జిల్లాల పరిధిలో 200పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా వీటిని వినియోంచేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు టాకింగ్ బుక్స్‌కిట్స్‌ను పంపించారు. ఒక్కో కిట్‌లో వంద పుస్తకాలు ఉన్నాయి. వీటిని ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకూ వినియోగించనున్నారు. జిల్లాలోని ఐదారు పాఠశాలలను ఎంపిక చేసుకుని, వాటికి ఈ పుస్తకాలను అందించనున్నారు. సాధారణ పుస్తకాల మాదిరిగానే ఉండే వీటిలోని అక్షరం వద్ద ప్రత్యేకంగా తయారు చేయించిన స్టిక్‌తో టచ్ చేస్తే..అక్కడ ఉన్న అంశం మాటల రూపంలో వస్తుంది. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలోనూ టాకింగ్‌బుక్స్‌ను అధికారులు తయారు చేయించారు. పుస్తకాల్లో పౌష్టికాహారం, బాలకార్మికులు, పర్యావరణ పరిరక్షణ, బాలికల విద్య, పచ్చదనం-పరిశుభ్రత తదితర థీమ్స్ ఉన్నాయి. లైబ్రరీతో పాటు టాకింగ్‌బుక్స్ కూడా విద్యార్థుల ఆలోచన శక్తికి ఉపయోగపడతాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. ఈ విద్యాసంవత్సరం కేవలం కథలను మాత్రమే రూపొందించామనీ, వచ్చే ఏడాది సెలబస్‌నూ రూపొందించే ఆలోచనలో ఉన్నామని చెప్పారు.

ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళతాం...

సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో నేతలు



పోస్టర్ ఆవిష్కరణలో జ్యోతి, పోతినేని, జూలకంటి, వెంకట్, నాగయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో నిర్వహించబోతున్న తమ పార్టీ అఖిల భారత మహాసభల ద్వారా ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళతామని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి చెప్పారు. మహాసభల్లో అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులతోపాటు తెలంగాణలోని రాజకీయ పరిస్థితులను కూడా చర్చిస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, టి.జ్యోతి, బి.వెంకట్, పోతినేని సుదర్శన్‌తో కలిసి ఆయన మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఏప్రిల్ 18 నుంచి 22 వరకు తమ పార్టీ అఖిల భారత మహాసభలు జరగబోతున్నాయని చెప్పారు. ఆ సందర్భంగా 22న లక్షలాది మందితో ఎర్ర కవాతు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో సీపీఐ (ఎం) అఖిల భారత నేతలతోపాటు కేరళ, త్రిపుర ముఖ్యమంత్రులు ప్రసంగిస్తారని వివరించారు. మహాసభ నేపథ్యంలో రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, గోడ రాతలు తదితర కార్యక్రమాలను చేపడతామన్నారు. వీటితోపాటు అన్ని జిల్లాల్లో సదస్సులు, సమావేశాలు, సెమినార్లను కూడా నిర్వహిస్తామని తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. వెంకట్ మాట్లాడుతూ.. మహాసభల నిర్వహణ కోసం గతంలోనే 200 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఏర్పాట్ల కోసం 21 కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలకు భిన్నంగా ప్రజల అజెండాను ముందుకు తీసుకుపోవటమే తమ కర్తవ్యమని చెప్పారు. ఇందులో భాగంగానే బీఎల్‌ఎఫ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఫ్రంట్ నిర్మాణాన్ని పటిష్టం చేయటం, సామాజిక శక్తులు, వామపక్షాలను మరింత సంఘటితం చేయటం తదితరాంశాలపై తమ పార్టీ దృష్టి కేంద్రీకరిస్తున్నదని వివరించారు. వచ్చే ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయటమే బీఎల్‌ఎఫ్ లక్ష్యమని తెలిపారు. మహాసభలకు సంబంధించి మంగళవారం ప్రచారం, సమీకరణ, రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు కమిటీల సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై కమిటీలకు దిశా, నిర్దేశం చేశారని వివరించారు. మహాసభల నేపథ్యంలో అఖిల భారత స్థాయిలో రాజకీయ ముసాయిదాను ఇప్పటికే విడుదల చేశారని చెప్పారు. మార్చి 3న జరిగే పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ ముసాయిదాపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు కూడా హాజరవుతారని వివరించారు.

వైఫల్యాల దృష్టి మరల్చేందుకే

పీఎంపై విమర్శలు

బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

టీఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రధానమంత్రి నరేంద్రమోడీపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపణలు గుప్పించారని బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ఆరోపించారు. మంగళ వారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ సభలో ప్రధాని మోడీని అవహేళన చేస్తూ, కించపరుస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు.

సాంకేతికతతో అక్రమాలకు అడ్డుకట్ట

జాతీయ ఈ గవర్నెన్స్ సదస్సులో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆనంద్

నవతెలంగాణ - హైదరాబాద్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా, రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేశామన్నారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న 21వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో రెండోరోజు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతానికి తీసుకుంటున్న వినూత్న చర్యలను, సంస్కరణలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిషనర్ వివరించారు. జాతీయ ఆహార భద్రత కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి నెలకు కిలో రూ. 3 లకు ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని సరఫరా చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కుటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున కిలో రూ. 1కే సరఫరా చేస్తున్నదని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2.75 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ప్రతి నెల 1.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కనీస మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నామని, ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం-ఓపీఎంఎస్) ద్వారా చెల్లింపులు చేస్తున్నామని, 2016 ఖరీఫ్, 2017 రబీ, ఖరీఫ్‌లలో రూ. 11 వేల కోట్లు 15 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేయమన్నారు. ఈ విధానాన్ని దేశంలోని పలు రాష్ట్రాలు సైతం అనుసరిస్తున్నాయని అన్నారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకులు పక్కదారి పట్టకుండా అర్హులకు అందేలా సరఫరా నుండి పంపిణీ వరకు కంప్యూటరీకరణ, రేషన్ దుకాణాల్లో ఈపాస్ మెషీన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, సరుకుల రవాణా వాహనాలకు జీపీఎస్, గోదాముల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. అక్రమ లోడింగ్, అన్‌లోడింగ్ లావాదేవీలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు హైదరాబాద్ కేంద్రంగా పౌరసరఫరాల భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, త్వరలో అన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల కార్యాలయాల్లోను ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. రేషన్ షాపుల్లో ఈ పాస్ విధానం అమలు వల్ల ప్రతి నెల 12 నుంచి 15 శాతం బియ్యం మిగులుతున్నదని అన్నారు. రేషన్ లబ్ధిదారులు కోరుకున్న రేషన్ షాపుల నుండి సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ విధానాన్ని అమలు చేస్తున్నాం. గోదాముల నుంచి రేషన్ షాపులకు సరుకులు చేరగానే లబ్ధిదారులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తున్నాం. రేషన్ లావాదేవీలను సామాన్య ప్రజలు సైతం ప్రత్యక్షంగా తెలుసుకునేలా టీ-రేషన్ మొబైల్ యాప్‌ను రూపొందించాం, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎక్కడినుంచైనా ఈ యాప్ ద్వారా తన రోజువారీ కార్యక్రమాలు నిర్వహించుకునేలా 13 అప్లికేషన్స్‌తో ప్రభుత్వ సేవలను రూపొందించామని అన్నారు.

విదేశాల్లో ఉచిత పీజీ విద్య



నవతెలంగాణ - అంబర్‌పేట్

విదేశీ విద్య ఎంతో కష్టంగా ఖరీదుగా మారిన పరిస్థితులలో కొన్ని దేశాలు ఉచితంగా విద్య అందించడానికి పలు దేశాల యూనివర్సిటీలు ముందుకు వచ్చాయి. మన దేశం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండ్‌కు ఉన్నత చదువుల కోసం వెళ్తున్నారు. అక్కడక వెళ్లడం కూడా చాలా ఖరీదుగా మారింది. కాని యూరప్ దేశాలు ఇటలీ, ఫ్రాన్స్, ఫిన్‌లాండ్, బెల్జియం వంటి అనేక యూనివర్సిటీలలో పీజీ కోర్సులలో ఉచితంగా విద్యనందించడానికి ముందుకు వచ్చాయి. ద హోప్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నాడు హిమాయత్‌నగర్ లో ఏర్పాటు చేసిన విదేశీ విద్యపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ద హోప్ కన్సల్టెన్సీ డైరెక్టర్ జీవన్‌రెడ్డి విదేశీ యూనివర్సిటీల ప్రతినిధులు హారి,తూమస్, బెటినా తదితరులు మాట్లాడుతూ.. ఇటలీ, ఫ్రాన్స్, ఫిన్‌లాండ్, ఆస్ట్రేలియా దేశాలలోని పలు యూనివర్సిటీలలో పోస్టుగ్రాడ్యుయేషన్ బ్యాచలర్ డిగ్రీ కోర్సులలో ఉచిత విద్య వసతి సౌకర్యాలు కల్పించి స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తామని వారు తెలిపారు. మన దేశం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండ్ దేశాలకు వెళ్తున్నారని ఇక్కడ ఉన్న అవకాశాలను కూడా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అదే విధంగా అక్కడ ఎలాంటి ఇబ్బందులు పడకుండా కన్సల్టెన్సీ ద్వారా అక్కడి యూనివర్సిటీల కోర్సులు, వసతి సౌకర్యం స్కాలర్‌షిప్‌లకు సంబంధించిత వివరాలు వారు విద్యార్థులకు వివరించారు. యూరప్ దేశాలలో తెలుగు రాష్ట్రాల నుంచి 54వేల మంది విద్యార్థులు ఉన్నారని వారిలో 11800 మంది ద హోప్ కన్సల్టెన్సీ ద్వారా వెళ్లారని వివరించారు. ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీఎస్‌ఆర్టీసీకి రెండు అవార్డులు

- అందుకున్న ఎండీ రమణారావు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఇందన పొదుపు, వాహన ఉత్పాదకత, సంస్కరణ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రెండు అవార్డులు దక్కాయి. కేంద్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల పనితీరును బట్టి పలు అవార్డులు ప్రదానం చేశారు. రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి యుద్‌వీర్‌సింగ్ మాలిక్ ఈ అవార్డులను అందజేశారు. రెండు విభాగాల్లో టీఎస్‌ఆర్టీసీకి అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను టీఎస్‌ఆర్టీసీ ఎండీ రమణారావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందన పొదుపు విభాగంలో దేశంలోనే టీఎస్‌ఆర్టీసీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిందని చెప్పారు. వాహన ఇందన వినియోగ సామర్థ్యాన్ని కార్మికులు పది కిలోమీటర్లస్థాయికి పెంచగలిగారని తెలిపారు. కార్మికుల పనితీరు వల్లనే ఈ అవార్డులు దక్కాయని చెప్పారు.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయండి

- సీఎస్‌కు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యా, ఉద్యోగ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర జోషికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సచివాలయంలో సీఎస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు, డిగ్రీ, జూనియర్ లెక్చరర్లు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉద్యోగాల్లో భర్తీ కోసం సుమారు 6లక్షల మంది శిక్షణ పొందారని, వారంతా నోటిఫికేషన్ జారీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యావంతులైన నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే రిటైర్ అయిన 2వేల మంది ఉద్యోగులను తిరిగి ప్రభుత్వంలో ఓఎస్‌డీలు, పీఆర్‌ఓలు, ప్రభుత్వ సలహాదారులుగా నియమించడం అన్యాయమన్నారు. రిటైర్‌మెంట్ అయిన వారిని తిరిగి ఉద్యోగంలో కొనసాగించడం కూడా సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిటైర్డ్ అయిన వారిని రాజ్యాంగ విరుద్ధగా కొనసాగిస్తే బ్యూరోక్రసీ ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల మంత్రులు, రాజకీయ నాయకుల అండతో చట్ట విరుద్ధంగా ఫైళ్లపై సంతకాలు చేసే అవకాశం ఉందన్నారు.

సీఎస్ హామీ : సివిల్ సర్వీసెస్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేసేందుకు త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని సీఎస్ హామీ ఇచ్చారని ఆర్ కృష్ణయ్య తెలిపారు.


సంపాదకీయం

వ్యవసాయం

రైతు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. వేసవి రాకముందే రాజకీయాలు వేడెక్కుతున్నాయి. భూ రికార్డులను క్రమబద్ధీకరించడం, రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడం, పెట్టుబడి పథకం అమలు చేయటం, వ్యవసాయ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంస్కరణలకు తెరలేపారు. కంపెనీ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఉపాధి హామీ చట్టానికి ఉచ్చు బిగించడంతో ఓటుబ్యాంకు రాజకీయాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మీద కేసీఆర్ విమర్శల తీవ్రత పెంచారు. ప్రాంతీయ సదస్సులలో అన్నదాతలకు అన్యాయం చేసింది కేంద్రమేనని మాట్లాడుతున్నారు. సదస్సుల్లో గిట్టుబాటు ధర కావాలని అడిగిన రైతుకు అది కేంద్రం బాధ్యత.. మాది కాదు..అని ముఖ్యమంత్రి తప్పుకున్నారు. పార్లమెంట్‌లో మా ఎంపీలు గిట్టుబాటు ధర కోసం కొట్లాడుతారని ఉట్టి మాటలు గట్టిగా చెప్పారు. ఇప్పటిదాకా పార్లమెంట్‌లో గులాబీ ఎంపీలు ఏం చేశారు ? ఇక ఇప్పుడు అడుగుతారని నమ్మకం ఏమిటి ? ఇన్నాళ్లూ కేంద్రం అడుగులకు మడుగులొత్తారు. బడుగులూ బక్కరైతుల్ని పట్టించుకోనే లేదు. పైగా కేంద్రప్రభుత్వ విధానాలతో అన్నదాతల్లో అసంతృప్తి పెరుగుతున్నది. ఇందుకు రైతు సమన్వయ సమితులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయంపై సమగ్ర చర్చ జరగాలి. ప్రభుత్వ వ్యవసాయ విధానం ప్రకటించాలి. వ్యవసాయ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. పారదర్శకంగా వ్యవహరించడం పాలకుల కర్తవ్యం.

దేశవ్యాపితంగా ఉన్న రైతు సంఘాలు ఒకే గొడుగు కిందికి వచ్చాయి. రైతు రక్షణ యాత్ర జరిపారు. పార్లమెంట్ ముందు ధర్నా చేశారు. పార్లమెంట్‌లో వామపక్ష ఎంపీలు రైతు సమస్యలను ప్రస్తావించారు. అయినా పాలకులకు అన్నదాతల ఆక్రందనలు వినపడ లేదు. ఆత్మహత్యలు అగుపడలేదు. ఇప్పుడే ఎందుకు గుర్తుకు వచ్చిందో. గుర్తుంచుకోనంత అమాయకులు కాదు రైతులు. ఎన్నికల గాలాలకు ఓట్లు ఎరలు గుచ్చుతున్నారు. పథకాల వలలు పన్నుతున్నారు.



సాదా బైనామాలతో సాగిన భూముల ప్రక్షాళన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలతో ముగింపు పలుకుతున్నారు. ఇదొక ప్రహసనంగా సాగుతోంది. భూ ప్రక్షాళన దేశంలో ఎక్కడా జరుగలేదని గొప్పలు చెప్పుకుంటున్నారు. దానికి పట్టామీద కేసీఆర్ బొమ్మ పెట్టాలా వద్దా అనే చర్చలు కూడా చేశారు. నిజానికి రెవెన్యూ గ్రామాల్లో ప్రతి ఏడాది జరిగే తతంగమే భూ రికార్డుల ప్రక్షాళన. జమాబందీ పేరుతో జరుగుతూనే ఉంటుంది. రికార్డులు మారుస్తూనే ఉంటారు. ఇది పాత పట్టాలు రద్దు చేసి కొత్త పట్టాలు ఇవ్వటమే. దీన్ని ఓ ఘనకార్యంగా చెప్పుకోవటం పాలకులకే చెల్లుతుంది. రికార్డులు మార్చారు. ఇది నిరంతర ప్రక్రియ మాత్రమేనని గమనించాలి.

పెట్టుబడి పథకాన్ని గత సంవత్సరం టీఆర్ఎస్ ప్లీనం సందర్భంగా కేసీఆర్ ప్రకటించారు. అప్పటి నుండి అవకాశం దొరికినప్పుడల్లా పథకం ప్రకారం ప్రచారం చేసుకుంటూనే ఉన్నారు. కొందరు దేశంలోనే మొట్టమొదటిదని ముఖ్యమంత్రి రైతు పక్షపాతి అని పొగడ్తలతో మంచెత్తుతున్నారు. తనకు పెట్టుబడి వద్దని కేసీఆర్ ప్రకటించి, ఆదర్శ రైతుగా అభినందనలు పొందారు. పెట్టుబడి పథకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అసలు సంగతి అర్థమవుతుంది. ప్రపంచ బ్యాంకు సబ్సిడీలను తగ్గించాలంటోంది. నగదు బదిలీని ఎత్తుగడగా ఉపయోగించి సబ్సిడీలకు తిలోదకాలిస్తారు. అందుకు అభివృద్ధి చెందిన దేశాలను అనుసరిస్తున్నారు. రైతులకు ఆదాయాన్ని పెంచేందుకు నేరుగా చేసే చెల్లింపులు రాయితీ కిందికి రావు. భూమి సాగు చేయకుండా పడావు పెడితే ప్రభుత్వం సంబంధిత రైతులకు అధిక మొత్తం చెల్లింపులు చేస్తుంది. వ్యవసాయ బీమా సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టే ఖర్చు సబ్సిడీల కిందికి రావు. అమెరికా 1998లో రైతులకిచ్చే తలసరి రాయితీ 30.655 డాలర్లు మొత్తం రైతులకు 93.3 బిలియన్ డాలర్లు (రూ.4 లక్షల 20 వేల కోట్లు) ఇచ్చింది. అమెరికన్ నూతన వ్యవసాయ చట్టం ప్రకారం ఆహారం వ్యవసాయంపై 2014లో 927.9 బిలియన్ డాలర్లు కేటాయించింది. మన కేంద్ర బడ్జెట్ కంటే రెండింతలు ఎక్కువ రైతులకు నగదు పెట్టుబడి ఇవ్వడం వెనుక ఉన్న రహస్యాన్ని తెలుసుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ఇజ్రాయిల్ తరహా వ్యవసాయం అన్నారు. మన ముఖ్యమంత్రి కూడా రైతు సమితులను అధ్యయనానికి ఇజ్రాయిల్ పంపుతానంటున్నారు. ఐదు వేల ఎకరాలకు ఒక వేదిక చేసి వ్యవసాయ రంగంలో మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. కార్పొరేట్ వ్యవసాయానికి బాటలు వేస్తున్నారు. స్వామికార్యం స్వకార్యం లాగా ఎన్నికల్లో రైతుల ఓట్లు రాబట్టేందుకు అదే సమయంలో వ్యవసాయ రంగంలో సంస్కరణలు అమలుకు తెర లేపినట్టు కనిపిస్తున్నది.

రైతులంతా వ్యవసాయం చేసుకుంటున్నారనీ, అసలు కౌలురైతులే లేరని ముఖ్యమంత్రి బుకాయిస్తున్నారు. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల్లో 14 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారు. కావాలనే కౌలు రైతులకు ప్రభుత్వం కార్డులు ఇవ్వలేదు. పైగా ఇప్పుడు కౌలురైతులే లేరనడం కంటే అన్యాయం మరొకటి ఉండదు. అబద్ధాలు ఆడినా అతికినట్టు ఉండాలి. అటవీ హక్కుల చట్టం ప్రకారం రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు హక్కు పత్రాలు పొందారు. వారికి పెట్టుబడి సహాయం వస్తుందో రాదోననే ఆందోళనలో ఉన్నారు. రైతు సమన్వయ సమితులంటే టీఆర్ఎస్ సమితులే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ట్రాక్టర్ల సబ్సిడీలు కూడా టీఆర్ఎస్ కార్యకర్తలకే అందుతున్నాయి. రైతులంతా టీఆర్ఎస్ కార్యకర్తలు కాదని గుర్తెరగాలి. వ్యవసాయంపై సమగ్ర చర్చ జరగాలి. ప్రభుత్వం వ్యవసాయ విధానం ప్రకటించాలి. వ్యవసాయ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. పారదర్శకంగా వ్యవహరించడం పాలకుల కర్తవ్యం.

పేరు రైతులది, పెత్తనం పార్టీది, పెన్నిధి కార్పొరేట్లది



ఎన్ వేణుగోపాల్

రైతు సమన్వయ సమితి అనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కొత్త మురిపెం రెండు రోజులుగా హోరెత్తుతున్నది. నిజంగా తెలంగాణ రైతాంగం, వ్యవసాయరంగం, గ్రామీణ రంగం తక్షణమే ఆదుకుని, ఉపశమనాలు కల్పించవలసిన దుర్భర స్థితిలో ఉన్నాయి. ఆ గ్రామీణ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి కావలసింది రెండు రోజుల ఆర్భాటపు కొత్త మురిపాలు కాదు. తక్షణ, మధ్యంతర, దీర్ఘకాలిక విశాల వ్యూహంతో ఎన్నో చర్యలు చేపట్టవలసి ఉన్నది. కాని అటువంటి ఉద్దేశమే లేని ప్రభుత్వం రైతులకు ఎకరానికి నాలుగువేల రూపాయల (రెండు పంటలకైతే ఎనిమిది వేలు) పంట పెట్టుబడి అనే ప్రధాన హామీతో పాటు మరెన్నో హామీలు వెల్లువెత్తిస్తున్నది.

సాగులో ఉన్న వివాదరహిత భూముల సొంతదార్లను

> **ఈ పథకం అమలు చేయబోయే ఇన్సూరెన్స్ కంపెనీ ఏదో ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ఏ కంపెనీలతో తాను చర్చలు జరుపుతున్నదో. ఏ కంపెనీ ఎంత తక్కువ ప్రీమియంకు ఇంత సొమ్ము చెల్లించడానికి సిద్ధపడుతున్నదో, కంపెనీ ఎంపికకు ఎటువంటి పారదర్శకమైన టెండర్ పద్ధతి అనుసరిస్తారో ఏ ఒక్క వివరమూ ఎక్కడా లేదు. ప్రీమియం వెయ్యి రూపాయలు ఉంటుందని, అంటే ఏడువందల కోట్ల రూపాయలు ఖర్చవుతాయని ఒక సమాచారం బైటపడింది. "ఇంకో ఐదు వందల కోట్లు ఎక్కువైనా ఫరవాలేదు" అని ముఖ్యమంత్రి స్వయంగా అన్నారు.**

గుర్తిస్తే, సాగుకు లాయకు గాని భూములను, వ్యవసాయేతర భూములను నమోదు చేస్తే రైతులకు పంట పెట్టుబడి సహాయం అందించడం సులభం అవుతుందనే పేరుతో కొన్ని నెలల కింద భారీ భూసర్వే జరిపిన ప్రభుత్వం, దాని కొనసాగింపుగా రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసింది. ఆ రైతు సమన్వయ సమితుల అవగాహన సదస్సుల పేరుతో హైదరాబాద్ లోనూ కరీంనగర్ లోనూ సోమ, మంగళవారాల్లో భారీ సభలు నిర్వహించింది.

నిజంగా సాగుదార్లకు సహాయం అందించడమే లక్ష్యమైతే, భూమి పట్టాదార్లు ఎవరో తెలుసుకునే భారీ సర్వే అవసరం లేదనీ, అనుపస్థిత భూస్వాములకు పంట పెట్టుబడి పేరుతో అప్పనంగా మరికొన్ని వేల రూపాయలు ఇవ్వడమే దీని లక్ష్యమనీ ఈ శీర్షికలో సెప్టెంబర్ లో వ్యాఖ్యానించాను. "గ్రామంలో కౌలుదార్ల సంఖ్య 30 శాతం దాకా ఉండవచ్చునని అన్ని గణాంకాలూ చెపుతున్నాయి గనుక ఈ ప్రభుత్వ సహాయంలో ఆ మేరకు వ్యవసాయం పేరు మీద వ్యవసాయేతర రంగానికి చేరబోతున్నదన్నమాట" అన్నాను. మిగిలిన 70 శాతం కూడ నిజమైన సాగుదార్లకు చేరేలా లేదని, రైతులకు అందించే ఆర్థిక సహాయాన్ని గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏర్పడే రైతు సమన్వయ సమితులు నిర్ణయించనున్నాయని అప్పటి సూచనలను బట్టి రాశాను. "ఆ సమితి సభ్యులను మంత్రులు నామినేట్ చేస్తారు... గ్రామ సమితిలో 15మంది, మండల, జిల్లా సమితుల్లో 24 మంది చొప్పున, రాష్ట్ర సమితిలో 42 మందిని ప్రభుత్వం, లేదా బాధ్యుడైన మంత్రి నామినేషన్ ద్వారా నియమిస్తారు. నామినేషన్ ద్వారానే ఈ సమితులకు కోఆర్డినేటర్లను నియమిస్తారు. ఎక్కడా ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియ లేదు, ప్రాతినిధ్య పాలన లేదు. తెలంగాణ రాష్ట్ర సమితి ఇష్టారాజ్యంగా తన కార్యకర్తలకు, చోటామోటా నాయకులకు పదవులు సృష్టించి పెట్టి, ప్రతి గ్రామంలోనూ రైతుకు ఎనిమిది వేల చొప్పున పంచే అధికారం వాళ్ల చేతుల్లో పెడుతున్నది. ఇది రైతుకు ఆర్థిక సహాయం అందించే పద్ధతో, అధికారపార్టీ గ్రామీణ స్థాయి నాయకులకు స్వయం ఉపాధి పథకమో ఎవరికి వారే తేల్చుకోవచ్చు" అని అప్పుడే రాశాను.

ఆరు నెలల తర్వాత ఆ అనుమానాలను నిజం చేస్తూ, మరిన్ని అనుమానాలకు తావిస్తూ గత రెండు రోజులు ఆర్భాటం సాగుతున్నది. తాను ప్రకటిస్తున్న "రైతు సంక్షేమ విధానాల" ఘనతతో "రైతాంగానికి ముందున్నదంతా స్వర్ణయుగమే" అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నది. మన పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో ఎన్నికల జ్వరం వేడెక్కుతున్న కొద్దీ చేసినవీ చెయ్యనివీ అన్నీ చేసినట్టే చెప్పుకోవడం, చేసినవి గోరంతలు కొండంతలుగా చెప్పుకోవడం, అన్ని గడపల్లోన మా గడప మేలు అనీ, అవతలివాళ్లవి అన్నీ తప్పులే అనీ చెప్పుకోవడం, ఏమీలేని శూన్యంలో ఛూమంతర్ అని అల్లావుద్దీన్ అద్భుతదీపం లాంటి బుడగలను సృష్టించి ప్రేక్షకుల కనికట్టు టక్కు టమార విద్యలు ప్రదర్శించడం పెరిగిపోతుంటాయి. నటనకూ జీవితానికీ, అబద్ధానికీ నిజానికీ, కల్పనకూ వాస్తవానికీ మధ్య విభజన రేఖలు చెదిరిపోతాయి. కళ్లముందరి రైతుల ఆత్మహత్యలూ, కనీస ఉపశమనం దక్కని కుటుంబాల దైన్యమూ కనబడకుండా పోతాయి. పగటికలల మైమరపులో భవిష్యత్తులో ప్రవహిస్తాయని నమ్మబలుకుతున్న పాలూ తేనే నోట్లో నీరు ఊరేలా చేస్తాయి.

కాని ఎన్నికల జ్వరాన్ని, ప్రగల్భాల వాగాడంబరాన్ని పక్కన పెట్టి, ప్రకటనల మేడి పండ్లను కాస్త ఒలిచి చూడవలసిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా దేశంలోకెల్లా రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న మహా ఘనత వహించిన రాష్ట్రపు వాస్తవ స్థితిని అర్థం చేసుకోవలసి ఉంది. ఆ వాస్తవ స్థితిని సెంటిమెంటుగా వాడుకుంటూ ప్రకటిస్తున్న రైతు సంక్షేమ పథకాలు వాస్తవంగా రైతుల కోసమేనా, అవి రాష్ట్ర ఆర్థిక స్థితిని నిజంగానే మెరుగు పరుస్తాయా, లేక ఆశ్రితులకూ కార్పొరేట్లకూ దళారీలకూ బొక్కసాలు నింపుతాయా, అధికారం పెంచుతాయా ప్రశ్నించవలసి ఉంది.

తెలంగాణలో రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి 2018 జనవరి వరకు ఆత్మహత్య చేసుకున్న రైతుల సంఖ్య 3412. ఈ మృతులందరినీ రైతులుగా గుర్తించడానికే ఈ ప్రభుత్వానికి మనసు రాలేదు. రైతు ఆత్మహత్యగా గుర్తిస్తే ఎక్స్ గ్రేషియా ఇవ్వవలసి వస్తుందనే భయంతో, అసలు అవి రైతు ఆత్మహత్యలు కావని, మరేదో కారణంతో జరిగిన ఆత్మహత్యలనీ, సహజ మరణాలనీ అధికారులూ, అధికారపార్టీ రాజకీయ నాయకులూ, ప్రభుత్వమూ మసిపూసి మారేడుకాయ చేశారు. అది ఆత్మహత్య అయినా కాకపోయినా తమ నియోజకవర్గంలో ఒక కుటుంబపెద్ద అసహజ మరణం పాలయితే ఆ కుటుంబాన్ని పరామర్శించాలన్న కనీస మానవతా స్పృహను కూడ అధికారపార్టీ రాజకీయ నాయకుల్లో అత్యధికులు పాటించలేదు. ఇంకా ముందుకువెళ్లి ఎక్స్ గ్రేషియా కోసమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కూడ ఒక సీనియర్ మంత్రి ప్రకటించి గత ప్రభుత్వాల తానులోని ముక్కలమేనని నిరూపించుకున్నారు. ఆత్మహత్య వంటి దారుణమైన అంశంలోనే ఇంత నిర్లక్ష్యంగా, అమానుషంగా ఉండగలిగిన ప్రభుత్వం, విత్తనాల కల్తీ, ఎరువుల సరఫరా, గిట్టుబాటు ధరలు, కనీస మద్దతు ధరలు, మార్కెటింగ్ లో దళారీల, వ్యాపారుల ఆగడాలను అరికట్టడం వంటి సాధారణ అంశాలను పట్టించుకుంటుందని, పరిష్కరిస్తుందని ఊహించడం కూడ అసాధ్యం. కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి, తద్వారా తమకు ముడుపులు సంపాదించుకోవడానికి నీళ్ల సెంటిమెంటు వాడుకునే అవకాశం ఉంది గనుక దాన్ని వాడుకోగలరు. స్థానిక నేలతో, పంటతో, అవసరంతో సంబంధం లేకుండా నియోజక వర్గానికి లక్ష ఎకరాల సాగునీరు అనే మాయామంత్రాన్ని పదే పదే జపిస్తూ అదే వ్యవసాయం పట్ల తన శ్రద్ధ అని చూపుకోగలరు. వ్యవసాయాభివృద్ధికి అత్యవసరమైన



అంశాలలో నీటి పారుదల సౌకర్యాల కల్పన కన్న ముఖ్యమైనది భూయాజమాన్య అసమానతలను రద్దు చేయడం అనే మౌలిక వ్యవస్థాగత పరిష్కారం అనే అవగాహనను అతి తెలివితో విస్మరించగలరు. అయినా తాము రైతు బిడ్డలమని, రైతులకు మేలు చేయడానికే ఉన్నామని నమ్మించగలరు.

ఈ రెండు రోజుల్లో ప్రకటించిన పంట పెట్టుబడి, సబ్సిడీపై ట్రాక్టర్లు, సోలార్ ఫెన్సింగ్ కు సబ్సిడీ, ఒక లక్షా ఇరవై ఐదు వేల కోట్లు చేరనున్న రైతుల వార్షికాదాయం, ప్రతి రైతుకూ ఐదు లక్షల రూపాయల ఆరోగ్య, ఆకస్మిక మృతి బీమా, ఇజ్రాయెల్ సాయంతో కుప్పం తరహా సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, వగైరా అనేక "రైతు సంక్షేమ" పథకాలలో ఒక్కొక్కదాని లోగుట్టు విప్పితే ఎన్ని కంకాళాలు బైటపడతాయో పరిశోధన చేయవలసిందే గాని, ఇక్కడ మచ్చుకు ఒక్క పథకం గురించి మాత్రం చూద్దాం.

నాలుగు సంవత్సరాలుగా ఆత్మహత్య చేసుకున్న 3412 మందిలో కేవలం 768 మందిని మాత్రమే గుర్తించిన, ఆ బాధిత కుటుంబాలను పరామర్శించడానికి కూడ సమయం చిక్కని మహా ఘనత వహించిన ప్రభుత్వానికి రైతుల మీద ప్రేమ కారిపోతున్నదట. డెబ్బై లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రు. 5 లక్షల బీమా చేయిస్తుందట. రైతులు అనారోగ్యానికి గురైనా, అకాల మరణం సంభవించినా కుటుంబానికి రు. 5 లక్షలు వచ్చేలా ఈ బీమా ఉంటుందట. ఆ ప్రీమియం అంతా ప్రభుత్వమే కడుతుందట. పైకి చూస్తే "అబ్బ, తెలంగాణ రైతుల మీద తెలంగాణ ప్రభుత్వానికి ఎంత ప్రేమ" అనిపిస్తుంది. కాని ఇటువంటి ప్రభుత్వ ప్రకటనల పెద్ద అక్షరాలు దాటి చిట్టచివర రాసిన చిన్న అక్షరాల దగ్గరికి వెళ్లాలి. 'షరతులు, నిబంధనలు వర్తిస్తాయి' అనే కంటికి కనబడని అక్షరాల కోసం వెతకాలి.

అలా వెతికినప్పుడు ఈ భారీ బీమా పథకం ఒక భారీ కుంభకోణం అని తేలుతుంది. ఇది రైతులకు, బాధితులకు మేలు చేయడానికి కాదు. వందల కోట్ల రూపాయలో, వేల కోట్ల రూపాయలో ప్రజాధనాన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడానికి మాత్రమే. ఈ పథకం అమలు చేయబోయే ఇన్సూరెన్స్ కంపెనీ ఏదో ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ఏ కంపెనీలతో తాను చర్చలు జరుపుతున్నదో. ఏ కంపెనీ ఎంత తక్కువ ప్రీమియంకు ఇంత సొమ్ము చెల్లించడానికి సిద్ధపడుతున్నదో, కంపెనీ ఎంపికకు ఎటువంటి పారదర్శకమైన టెండర్ పద్ధతి అనుసరిస్తారో ఏ ఒక్క వివరమూ ఎక్కడా లేదు. ప్రీమియం వెయ్యి రూపాయలు ఉంటుందని, అంటే ఏడువందల కోట్ల రూపాయలు ఖర్చవుతాయని ఒక సమాచారం బైటపడింది. "ఇంకో ఐదు వందల కోట్లు ఎక్కువైనా ఫరవాలేదు" అని ముఖ్యమంత్రి స్వయంగా అన్నారు.


అనారోగ్యం, మరణం అనే రెండు ప్రమాదాలు ఇందులో చూపుతున్నారు గనుక ఇది కేవలం లైఫ్ ఇన్సూరెన్స్ పథకం కాదు, హెల్త్ ఇన్సూరెన్స్ పథకం కూడ. సాధారణంగా ఈ రెంటికీ ప్రీమియంలు భిన్నంగా ఉంటాయి. రెండూ కలిపిన బీమాకు రు. 5 లక్షలకు ప్రీమియం కనీసం రు. 2 వేల నుంచి రు. 5 వేల వరకూ ఉంటుంది. సంప్రదింపుల ద్వారా, లక్షల సంఖ్యలో పాలసీలను చూపడం ద్వారా, టెండర్ ప్రక్రియలో తక్కువలో తక్కువ కోట్ చేసినవారికే కాంట్రాక్టు ఇవ్వడం ద్వారా ప్రీమియంను వెయ్యి రూపాయలకే తగ్గించ గలిగినా ప్రభుత్వం చెల్లించవలసిన ప్రీమియం కనీస పక్షం ఏడువందల కోట్ల రూపాయలు. అలా ఏడువందల కోట్ల రూపాయలు సంపాదించిన కంపెనీ, ఇవాళ అమలులో ఉన్న నిష్పత్తుల ప్రకారం చూస్తే ఎక్కువలో ఎక్కువ రు. నాలుగు వందల కోట్లు మాత్రమే తిరిగి చెల్లించవలసి ఉంటుంది. అంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని బుట్టలో వేసుకుని కాంట్రాక్టు సంపాదించే ఇన్సూరెన్స్ కంపెనీ ఈ ఒక్క కాంట్రాక్టులోనే కనీసం మూడు వందల కోట్ల రూపాయల లాభం చేసుకుంటుంది. ఆ కాంట్రాక్టు తనకు వచ్చేలా చేసుకోవడానికి ఏమైనా చేయగలుగుతుంది కూడ.

ఇందులో ఎవరికైనా ఏమైనా అనుమానం ఉంటే, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అనే పంటల బీమా పథకంలో 2016-17లో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు రైతుల నుంచీ, ప్రభుత్వం నుంచీ రు. 22,004 కోట్లు ప్రీమియం వసూలు చేశాయని, అవి పంటలు నష్టపోయిన రైతులకు తిరిగి చెల్లించినది రు. 12,020 కోట్లు మాత్రమేనని, అంటే ఒక్క సంవత్సరం రైతుల పేరు మీద ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు కొల్లగొట్టుకుపోయిన ధనం రు. 9984 కోట్లు అని రాజ్యసభలో ఒక ప్రశ్నకు జవాబుగా స్వయంగా ప్రభుత్వమే చెప్పింది!!!

సెల్: 9848577028

మెయిల్ @ నవతెలంగాణ

జేఎన్‌యూలో ఉపకులపతి అరాచకం



చాకేటి రాజు

దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ'లో ఉపకులపతి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా విద్యార్థిలోకం ఏకమయ్యింది. 2016 సంవత్సర ప్రారంభంలో నియమితులైన ప్రొ.మామిడాల జగదీశ్ కుమార్ నియంతత్వ ధోరణిని సవాలు చేస్తూ జేఎన్‌యూ మునుపెన్నడు లేని రీతిలో నిరంతర ఉద్యమాలకు వేదికగా నిలిచింది. ఫిబ్రవరి 9, 2016 దేశద్రోహ ఆరోపణల సంఘటన నుండి నేటి 'నిర్బంధపు హాజరు'కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమ పరిణామాల వరకు ఉపకులపతి చర్యలే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నలలో అధికారంలో ఉన్న పార్టీ ఆదేశాలతో తను తీసుకునే విధానాలే దినచర్యగా మార్చుకొని విద్యార్థుల, అధ్యాపకుల నమ్మకాన్ని కోల్పోయారు ఉపకులపతి జగదీశ్ కుమార్. ఉన్నత విద్యాపరంగా జేఎన్‌యూకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విశిష్టత, ప్రత్యేకతను, పాలక మండళ్ళ నియమ-నిబంధనలను తుంగలో తొక్కుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వ అండదండలతో తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ చిన్నపాటి 'కిమ్ జాంగ్ ఉన్'(ఉత్తర కొరియా అధ్యక్షుడు) లా తయారయ్యారు.

ఉపకులపతిగా నియమితులైన 2016 నుంచి ఇప్పటివరకు తీసుకున్న చర్యలలో మొదటగా యూజీసీ గెజెట్ పేరుతో 2017లో ఎంఫిల్/ పీహెచ్‌డీ విద్యార్థుల ప్రవేశ సంఖ్యను 1174 నుండి 194కు తగ్గించడం, నజీబ్ కేసులో ఉదాసీనత, అణగారిన/వెనుకబడిన వర్గాలకు ఇచ్చే పాయింట్లు తీసేయడం, విద్యార్థులు శాంతియుతంగా నిర్వహించుకునే ధర్నా-స్థలం(ఫ్రీడం స్క్వేర్) ఎత్తివేయటం, రాత్రులలో నడిచే క్యాంటీన్లపై ఆంక్షలు విధించటం, పాలక మండళ్ళ సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను పెడచెవిన పెట్టడం లేదా వాటిని నిర్వహించక పోవటం, ఇష్టానుసార అధ్యాపక నియామకాలు చేపట్టడం, ధర్నాలు చేసిన వారికి జరిమానా వేయటం లేదా నోటీసులు పంపడం, నిర్బంధపు హాజరు ఇలా ఒక్కటేంది చెప్పుకుంటే చాలానే ఉన్నాయి. నిజానికి జేఎన్‌యూలో నిర్బంధపు హాజరు ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత లేదు. ఎందుకంటే ఇక్కడా తరగతి గదులు ఎప్పుడు విద్యార్థులతో నిండుగానే ఉంటాయి. దీనికి తోడు హాజరును విద్యార్థులు తీసుకునే ఫెలోషిప్‌కు, హాస్టల్ వసతికి, సెమిస్టర్ నమోదులాంటి వాటికి తప్పనిసరి అనుసంధానం చేయటం వలన విద్యార్థుల అధ్యాపకుల ప్రకోపానికి కారణమయ్యారు. విద్యార్థిలోకం వీటన్నిటికి వ్యతిరేకంగా ఎన్ని ధర్నాలు, ర్యాలీలు చేసిన విశ్వవిద్యాలయ పాలకుల జవాబు మౌనం ఒక్కటే. నిజానికి ఇందులో చాలా సమస్యలకు, గందరగోళానికి ఉపకులపతి తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఎటువంటి సమ్మతి లేకుండా ఆమోదించిన 2016 యూజీసీ గెజెటే ముఖ్యకారణంగా చెప్పవచ్చు.

ఉపకులపతి అంటే విద్యార్థుల సర్వతోభ్యున్నతికి కృషి చేస్తూ వారిలో పరిశోధనాత్మకతను పెంపొందించేలా విధానపర చర్యలు తీసుకుని ముందుండి నడిపించే ఆదర్శవంతుడిగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉంది. యూనివర్సిటీలో పాలనకు సంబంధించి దానికి పార్లమెంట్‌లో చేసిన చట్టం ఉంది. దాని ప్రకారం నియమ నిబంధనలు కూడా ఉన్నప్పటికి సరైన పద్ధతిలో కాకుండా వ్యక్తిగత ఇష్టానుసారంగా వ్యవహరించడంతో యూనివర్సిటీలో పాలన గాడి తప్పుతుందని ప్రముఖ విద్యావేత్తలు కూడా హెచ్చరించినా పట్టించుకోని వైనం. వెరసి విద్యార్థుల ఉద్యమం రోజు రోజు తీవ్ర రూపం దాల్చింది. అధికారంలో ఉన్న పాలకులు జేఎన్‌యూను రాజకీయ కోణములో కేవలం 'లెఫ్ట్ ప్రాబల్యం' ఉన్న వర్సిటీగా చూడటం ఎంతమాత్రం సమ్మతం కాదు. ఒకరకంగా ఇప్పుడు జేఎన్‌యూ కాషాయికరణ నీడలో పడింది. తనను నియమించిన పాలకుల పట్ల విధేయత ఉండవచ్చేమో కాని మరీ వారే ఆశ్చర్యపోయేలా అతివిధేయతకు పోవటం అంత శ్రేయస్కరం కూడా కాదేమో! అలా మొత్తం మీద ప్రస్తుత పరిణామాలను చూస్తే జేఎన్‌యూను కాస్తా "జగదీష్ నమో యూనివర్సిటీ"గా మార్చేసారేమోనన్న భావన కలుగుతుంది.

జేఎన్‌యూ దేశానికి చాలామంది ఉన్నత విద్యావేత్తలను, సివిల్ సర్వెంట్లను, రాజకీయ నాయకులను, ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన వ్యక్తులను అందించినది అనడంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి యూనివర్సిటీ నేడు తన ఉనికిని కోల్పోయే ప్రమాదంలో ఉన్నది. ఒకవైపు జేఎన్‌యూకి దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీ అంటూ ప్రభుత్వమే ర్యాంకులను ఇస్తూ మరొకవైపు దానికి ఉన్న స్వతంత్ర అధికారాలను హరించటం జరుగుతుంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల నేతృత్వంలో ప్రభుత్వాలు వస్తూంటాయి పోతూంటాయి. అంతమాత్రాన విశ్వవిద్యాలయాల ప్రాథమిక సైద్ధాంతిక భావాలను, పునాదులను మార్చాలనుకోవటం హాస్యాస్పదమే అవుతుంది.

- జేఎన్‌యూ, న్యూఢిల్లీ, సెల్: 9868328761

యువతకు ఉద్యోగాల కల్పనేది?



డాక్టర్ చుక్కా రామయ్య,

ఈ రోజు పాఠశాలలకు, విశ్వవిద్యాలయాలకు అణగారిన వర్గాల నుంచి విద్యార్థులు, మహిళలు వస్తున్నారు. వారిని దారిద్ర్యం నుంచి విముక్తి చేసేందుకు నాణ్యతతో కూడిన విద్యనందించడం ద్వారానే సాధ్యమవుతుంది. అందువల్ల రాజకీయాల కతీతంగా మానవ సంపదను నిర్మాణాత్మక దృక్పథంతో పెంచుకుంటే ప్రపంచానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుంది. ఆ దిశగా పాలకులు కృషిచేస్తారని ఆశిద్దాం!

రామయ్య మాట

శాస్త్రసాంకేతిక రంగంలో హైదరాబాద్ ఓ ప్రధాన కేంద్రంగా వర్ధిల్లుతోంది. నేటి పాలకులు సైతం ఐటీ రంగం విస్తరణపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంతో భాగ్యనగరం ఓ ప్రధాన ఐటీ హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. అయితే, ఈ సాంకేతిక విప్లవ ఫలితాలు సామాన్యుడికి చేరువయ్యేలా ప్రభుత్వాలు పనిచేయాలి. అంతేకాదు, ఐటీ రంగం ఎంత వేగంగా విస్తరిస్తుందో.. నిరుద్యోగ సమస్య కూడా అందుకు సమాంతరంగా పెరుగుతోంది. ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. నిరుద్యోగం, పేదరికంతో కుంగిపోతున్న నేటి యువతరానికి ఉద్యోగాల కల్పన ఓ సవాల్‌గా మారుతోంది. ఇప్పటికే గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి అనేక అంతర్జాతీయ ప్రముఖ సంస్థలు తమ కేంద్రాలను ఇక్కడ నెలకొల్పేందుకు ముందుకొచ్చిన నేపథ్యంలో ఆయా సంస్థల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యాలను నేటి యువతరానికి నేర్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఏటా ఇంజినీరింగ్ పూర్తిచేసుకొని బయటకు వస్తున్న లక్షలాది మందిలో ఉపాధి అవకాశాలు చాలా కొద్దిమందికి మాత్రమే లభిస్తున్నాయి. మన రాష్ట్రానికి వస్తున్న కంపెనీలకు అవసరమయ్యే సమర్థమైన మానవవనరుల్ని సమకూర్చేలా ప్రభుత్వం కొత్త కొత్త కోర్సుల్ని ప్రవేశపెట్టాలి. తద్వారా నిరుద్యోగ సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుంది.

రాష్ట్రంలోకి అనేక ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమలు ఎన్ని వస్తున్నా నిరుద్యోగ సమస్య మాత్రం తీరడంలేదు. దీనికి కళాశాలల్లో బోధనా తీరు మారాలి. ఎంతసేపూ పుస్తకాల్లో ఉన్నది చెప్పడమే తప్ప విద్యార్థుల్లో స్వతహాగా ఆలోచనలను పెంపొందించే కార్యక్రమాలు గానీ, విషయాన్ని పరిశోధించే తత్వాన్ని గానీ తీసుకురావడంలో ఘోర వైఫల్యం చెందుతున్నాం. చిన్నప్పట్నుంచి బండెడు పుస్తకాలు భుజనావేసుకొని ఉదయాన్నే బడికి వెళ్లి సాయంత్రం ఆరు గంటలకు తమ పిల్లలు ఇంటికి వస్తే చాలనుకుంటున్నారు నేటి తరం తల్లిదండ్రులు. దీన్ని ఆసరాగా చేసుకొని వీధివీధికీ కొత్తకొత్త పేర్లతో విద్యా సంస్థలు వెలుస్తున్నాయి. రూ.వేలకు వేలు వసూలుచేసి పిల్లల్ని ఓ మూస పద్ధతిలో బట్టీ చదువులకు అలవాటు చేయడం పరిపాటిగా మారింది. చిన్నారుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించడంలో చేస్తున్న కృషి మాత్రం



కనబడటంలేదు. విద్యార్థులైతే స్వేచ్ఛగా తమ ఆలోచనల్ని వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉండటం లేదు. ఇక యూనివర్సిటీల్లోకి వచ్చి వారిని స్వతహాగా ఆలోచించి పరిశోధనలు చేయమంటే బేల చూపులు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో విద్యారంగంలో తీవ్ర సంక్షోభం నెలకొంది. మరి, ఈ దీనవస్థకు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కాదా? విద్యారంగంలోకి ప్రాఫిట్ మోటివ్ బలంగా చొచ్చుకొచ్చింది. ప్రతి మనిషి ప్రాథమిక హక్కుగా ఉన్న విద్యే నేడు పెద్ద వ్యాపార సరకుగా మారిపోయింది. పుట్టిన ప్రతి పౌరుడికీ విధిగా చదువు చెప్పించాల్సిన ప్రభుత్వాలే విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న మాఫియా పట్ల చూసీచూడనట్టు వ్యవహరిస్తుంటే తాము ఇంకెవరికి చెప్పుకోవాలని ప్రజలు ఘోషిస్తున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ధన దాహానికి కళ్లెం వేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యత కొరవడటంతో తమ పిల్లల చదువు కోసం రూ. వేలకువేలు కట్టేందుకు తమ రక్తాన్ని ధారపోసి శ్రమించగా వచ్చిన ఆ మొత్తాన్ని కార్పొరేట్ విద్యా సంస్థలకే చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అప్పులు చేసి కార్పొరేట్ విద్యా సంస్థలకు లక్షల రూపాయలు కట్టినా తీరా చదువు పూర్తిచేసుకొని బయటకు వస్తున్న తమ పిల్లలు ఉద్యోగాలు రాక ఇంటికే పరిమితమవడాన్ని చూసి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. సామాజిక అలజడికి దారితీస్తున్న ఇలాంటి సమస్యలపై తక్షణమే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. పిల్లల్లో దాగి ఉన్న అసమాన ప్రతిభను వెలికి తీసేందుకు బదులుగా వారిని మూసలో పోసినట్టు బట్టీ చదువులకే పరిమితం చేసేలా వ్యవహరించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. పిల్లల్లో నైపుణ్యాల పెంపునకు కృషిచేయాలి. తద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలి.

నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం ఎంతో కష్టం. అందువల్ల నేడు ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధనా ప్రమాణాలు పెంచడంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రాఫిట్ మోటివ్‌ను తగ్గించి ప్రతి విద్యార్థికి తనకు ఇష్టమైన రంగంలో నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. గతంలో అనేక విద్యాసంస్థలు సమాజం కోసం పనిచేయడం నేను చూశాను. నెల్లూరులో కావలి కళాశాల ఎంతోమంది మేధావుల్ని, సామాజిక కార్యకర్తల్ని ఈ సమాజానికి అందించింది.

తెలంగాణలో కూడా అనేక గొప్ప ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మానవీయ విలువల్ని, పోరాట పటిమను నూరిపోసి నాణ్యమైన విద్యా వ్యాప్తికి అవిరళ కృషిచేశాయి. ఆ రోజు విద్యను ఓ సేవగా చూస్తే.. నేడు దాన్ని వ్యాపార సరుకుగా మార్చి విద్యా వ్యవస్థనే చిన్నాభిన్నం చేస్తున్నారు. విద్యను వ్యాపార సరుకుగా చూడని దేశాలు మానవ వనరుల అభివృద్ధిలో, మానవ జీవన ప్రమాణాల పెంపులో అగ్రపథాన దూసుకెళుతున్నాయి. కేవలం ఇంజినీరింగ్ కళాశాలలే కాదు కేజీ నుంచి పీజీ వరకు ఎంతో పవిత్రతతో, సామాజిక బాధ్యతతో విద్యను బిల్డప్ చేస్తేనే సామాజిక ప్రయోజనం ఒనగూరుతుంది. ఒక్కరోజుతో టాలెంట్ రాదు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యతే ప్రధానంగా మార్పులు తీసుకొస్తేనే సమాజానికి మేలు. ఎప్పుడూ లేనంతగా ఈ రోజు పాఠశాలలకు, విశ్వవిద్యాలయాలకు అణగారిన వర్గాల నుంచి విద్యార్థులు, మహిళలు వస్తున్నారు. వారిని దారిద్ర్యం నుంచి విముక్తి చేసేందుకు నాణ్యతతో కూడిన విద్యనందించడం ద్వారానే సాధ్యమవుతుంది. అందువల్ల రాజకీయాల కతీతంగా మానవ సంపదను నిర్మాణాత్మక దృక్పథంతో పెంచుకుంటే ప్రపంచానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుంది. ఆ దిశగా పాలకులు కృషిచేస్తారని ఆశిద్దాం!

- ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు





ఓడిపోనివ్వండి... గెలుపు బాటలు వేసుకుంటారు



జీవితం... బుడి బుడి నడకలతోనే మొదలవుతుంది. తప్పటడుగులు వేయకుండా ఒకేసారి నడకనేర్చుకోలేం. కిందపడకుండా అస్సలు పైకి లేవలేం. ఓటమి లేకుండా గెలుపునకు విలువెక్కడుంటుంది. కాబట్టి పిల్లలను ఓడిపోనివ్వండి. ఓటమి విజయానికి బాటలు వేస్తుందని వాళ్లే తెలుసుకుంటారు.

మన పిల్లలనెప్పుడూ విజయాలే వరించాలని కోరుకోవడంలో తప్పులేదు. కానీ అది అసాధ్యమనే అవగాహన మనకుండాలి. ఓటమి లేని విజయం వాళ్లకు ఏ జీవిత పాఠమూ నేర్పలేదని తెలుసుకోవాలి. కాబట్టి వాళ్లకి ఓటమిని పరిచయం చేయాలి. తరగతిలో కాస్త వెనకపడిపోతుంటే మిగతావారితో పోల్చి కించపరచొద్దు. మీ పిల్లలు ఏయే విషయాల్లో వెనకబడి ఉన్నారో చూడండి. వీలైతే కొత్త పద్ధతుల్లో ఆ సబ్జెక్టుపై పట్టుసాధించే అవకాశం ఉందేమో ప్రయత్నించండి. ప్రతి సబ్జెక్టునీ వైవిధ్యంగా నేర్పించే ఆన్‌లైన్ వీడియోలెన్నో ఇప్పుడు దొరుకుతున్నాయి. ఆటల్లో కూడా వెనకబడి ఉన్నాడా! బాధపడకండి. ఆటలో ఓటమి, విజయం రెండూ అత్యంత సహజమనే విషయం చెప్పండి. క్రీడాస్ఫూర్తిని ఆస్వాదించడమే ఏ ఆటకైనా లక్ష్యమనే విషయం అర్థం చేయించండి. మీ పిల్లలు చేసే చిన్న ప్రయత్నాలని కూడా మెచ్చుకోండి. కళకీ అదే వర్తిస్తుంది. సంగీతం, నృత్యం, వాయిద్యం నేర్చుకోవడం... ఇలా ఏదైనా సరే ఇవన్నీ జయాపజయాలకి అతీతమైనవనే విషయం వివరించండి. పక్కనుండేవాళ్లతో పోల్చుకోవడం కాదు.. ప్రపంచానికి మన ప్రత్యేకత చాటడం కళతోనే సాధ్యమవుతుందనే విషయం వాళ్లకి చెప్పగలగాలి.

నిదానంగా చెప్పండి...

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణ నేర్పే క్రమంలో అరవడం, భయపెట్టడం, కొట్టడం లేదా డబ్బో, మరేదో వస్తువు ఇస్తామని ప్రలోభపెట్టడం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల వారిలో క్రమశిక్షణ పెరగకపోగా, మరింత పెంకిగా తయారయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు పొరపాట్లు చేసినప్పుడు చాలామంది తల్లిదండ్రులు ఆ తప్పును మళ్లీ మళ్లీ ఎత్తిచూపుతారు. అలా కాకుండా చేసిన తప్పును ఎలా సరిదిద్దుకోవాలో వారికి నేర్పండి. ఉదాహరణకు మీ అబ్బాయి వేరే అబ్బాయిని కొడితే 'స్నేహితుడిని అలా కొట్టొద్దు' అని చెప్పే బదులు 'మీ స్నేహితుడికి క్షమాపణ చెప్పు.. ఎందుకంటే నువ్వు అతడిని కొట్టావు. అది తప్పు. నువ్వే ఆలోచించు..' అని నిదానంగా చెప్పి చూడండి.

అనుభవంతోనే...

ప్రతి ఒక్కరికి అనుభవమే పెద్ద గురువు. ఇది పిల్లలకూ వర్తిస్తుంది. కాబట్టి వారు చేస్తున్న పనులు మరీ సమస్య కానంతవరకూ అడ్డు చెప్పే ప్రయత్నం వద్దు. చేయనివ్వండి. తప్పయితే అలా చేయకూడదని అనుభవం ద్వారా వారే స్వయంగా తెలుసుకుంటారు. అప్పుడు అలాంటివి మళ్లీ చేయకూడదని వివరించండి.

సాధారణంగా చాలామంది తల్లిదండ్రులు పిల్లలు చేసిన మంచి పనుల కంటే వారు చేసిన చిన్న చిన్న తప్పులపైనే ఎక్కువగా దృష్టి పెడతారు. అది పొరపాటు. వారు చేసే ప్రతి పనిని గమనించండి. మంచి పనిని మెచ్చుకోవాలి. ఎక్కడ నిస్తేజంగా ఉన్నారో, ఏ విషయాల్లో చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నారో చూడండి. వారి వెన్నంటే ఉండి అన్ని విషయాలూ నేర్చుకునేలా తోడ్పడండి. పిల్లలకు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నేర్పే సమయంలో మరీ తిట్టకండి. అలా చేయడం వల్ల మొదటికే మోసం వస్తుంది. వారు అసలు మాట వినరు. క్రమశిక్షణ అనేది ఒక్కరోజులో వచ్చేయదు. దానికీ సమయం పడుతుంది. తల్లిదండ్రులుగా మీకు ఓపిక అవసరం.

వాస్తవికత అవసరం..

చదువులో వాళ్ల సామర్థ్యమేంటీ, వాళ్లకి ఏ రంగంలో ఆసక్తి.. ఎంత మేరకు ఉంది, ఎందులో రాణించగలరు.. అనే విషయాలపై తల్లిదండ్రులు స్పష్టత తెచ్చుకోవాలి. అవసరమైతే ఉపాధ్యాయుల సాయం తీసుకోవాలి. పిల్లల ఆసక్తి ఎందులో ఉందో తెలుసుకోకున్నా ఫర్వాలేదు. కానీ వాళ్లు బలహీనంగా ఉన్న అంశాలవైపు బలవంతంగా తీసుకెళ్లకండి. పిల్లలు కోరుకున్నవి ఏవైనా సరే అందులోనే వాళ్లు వెళ్లేలా



ప్రోత్సహించండి. మొదట్లో ఒడుదొడుకులున్నా కచ్చితంగా నిలదొక్కుకుంటారని నమ్మండి. విద్య అన్నది సంపాదనకోసం అనేకన్నా.. వికాసం కోసమేననే విశ్వాసం ముందు మనలో బలంగా ఉండాలి. మీ శాయశక్తులా వాళ్లని చదివించండి. వాళ్లకిష్టమున్నవన్నీ చేయించండి. వాళ్ల లక్ష్యాలు అందుకోనివ్వండి. ఆ లక్ష్యం వాళ్లదైనా, మీదైనా సరే అది వాళ్ల సామర్థ్యానికి దగ్గరగా, వాస్తవికంగా ఉందోలేదో చూసుకోండి చాలు.

పిల్లలను 'నువ్వేదీ చేయలేవు' అని తిట్టినా... 'నీకేం తక్కువరా? నువ్వు క్లాసు ర్యాంకు కాదు స్టేట్‌ర్యాంకు సాధించగలవు. సాధించాలి' అని ఎక్కువ అంచనాలు పెట్టినా పిల్లల్లో తీవ్రమైన ఆత్మన్యూనత ఉంటుంది. ఇలాంటి పిల్లలు అమ్మానాన్నల అంచనాలని అందుకోలేని ప్రతిసారీ తమని తాము పరాజితులుగా భావిస్తారు. కానీ ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు నటిస్తారు. లోలోన కుంగుబాటుతో ఉంటారు.

నమ్మకాన్నివ్వండి...

ఇంట్లో తల్లిదండ్రులూ, స్కూల్లో, కాలేజీల్లో ఉపాధ్యాయులూ, అధ్యాపకులు.. ఎవరు చెప్పినా వినరు. ప్రతి విషయాన్నీ వ్యతిరేకిస్తుంటారు. తల్లిదండ్రులూ, టీచర్లపైనేకాదు.. అందరిపైనా అతిగా కోపగించుకుంటూ ఉంటారు. ప్రతి చిన్నవిషయానికీ ఆందోళనకి గురవుతుంటారు. పరీక్షల ముందు జ్వరం తెచ్చుకుంటారు.

అతి కోపం, తిరుగుబాటుతనం, ఆత్మన్యూనత.. సహజంగానే వీళ్లని ఒంటరివాళ్లని చేస్తుంది. 'ప్రపంచంలో అందరూ ఆనందంగానే ఉన్నారు.. నేను తప్పు!' అనే ఆలోచనతో కొట్టుమిట్టాడుతుంటారు. ఇది వీళ్లని మానసిక కుంగుబాటుకీ చేరువచేస్తుంది. అనేక అనారోగ్య సమస్యలుగానూ ఇది బయటపడుతుంది.

కాబట్టి పిల్లలను భయపెట్టకండి. వాళ్లని ఓడిపోనివ్వండి. 'ఓటమి వచ్చినా.. మేం నిన్ను ప్రోత్సహిస్తాం!' అనే నమ్మకానివ్వండి. వాళ్లపై అతి అంచనాలభారం మోపడంకన్నా.. అపజయం ఎలా ఉంటుందో రుచిచూపిస్తే ఎప్పుడూ వాస్తవంలోనే ఉంటారు. ఏ పరిస్థితులు వచ్చినా ఆత్మస్థైర్యంతో స్థిరంగా నిలబడతారు. వేలాది చదువులు నేర్పని సారం.. ఇదొక్కటే బోధిస్తుంది.

తలస్నానానికి ముందు!



ఆయిల్ మసాజ్: తలస్నానానికి ముందు గోరువెచ్చని నూనెతో మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయడం వల్ల జుట్టు మెరుస్తూ, ఆరోగ్యంగా ఉంటుంది.

వేడి నీటిని: తలస్నానానికి ఎప్పుడూ ఎక్కువ వేడి నీటిని ఉపయోగించరాదు. హాట్ వాటర్ వల్ల జుట్టు పొడిబారడమే కాకుండా రఫ్‌గా మారిపోతుంది.

తేనె, పెరుగు: జుట్టు శుభ్రం చేసుకోవడానికి ముందు తేనె, పెరుగు కలిపి జుట్టుకి పెట్టుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. తేనె మాయిశ్చరైజింగ్‌లా పనిచేసి కండిషనర్ రాసుకున్నట్టు కనిపిస్తుంది.

మినప్పప్పు: మూడు చెంచాల మినపప్పును రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మెత్తటి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఇందులో ఒక గుడ్డు, ఒక చెంచా నిమ్మరసం కలిపి, ఒక కప్పు పెరుగు లో బాగా కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ❄

కప్పు ఆకుకూరలో!




ప్రతిరోజూ ఒక కప్పు ఆకుకూర తీసుకునే వారిలో మధుమేహం వచ్చే ప్రమాదం 14శాతం తగ్గించవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. లేదంటే ఆకుకూరలు వారానికి మూడు సార్లు తీసుకుంటూ వుండాలని వారు సూచిస్తున్నారు. ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆకుకూరల్లోని విటమిన్-బీ పాలెట్స్ జ్ఞాపకశక్తిని, రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

ఆకుకూరల్లో ఉండే విటమిన్-'ఏ' కంటిచూపును మెరుగు పరుస్తుంది. గుండె సంబంధిత వ్యాధులకు దారితీసే అమైనో ఆమ్లాలనూ నియంత్రిస్తాయి. ముఖ్యంగా పొన్నగంటి కూరలో విటమిన్ 'ఏ' సమృద్ధిగా ఉంటుంది. పొన్నగంటి కూర తింటే రేచీకటి రాకుండా కాపాడుకోవచ్చు. వేడి ఎక్కువగా ఉన్నవారు పొన్నగంటి కూర తీసుకుంటే మంచిది. ఇక పుదీనా పచ్చడి తీసుకుంటే మెదడు చురుగ్గా ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీర బరువు తగ్గించడంలోనూ ఆకుకూరలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆకుకూరల్లోని విటమిన్ 'కె' బరువును తగ్గిస్తుంది. ముఖ్యంగా ఆకుకూరల్లో క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతిరోజూ తినని వారు కనీసం వారానికి మూడు సార్లు ఆకుకూరలను తీసుకోవడం మంచిది. ❄

తప్పని 'సరి' ఆహారం..!

టీనెజ్ వయసులో ఆడపిల్లలు ఎదుర్కొనే సమస్య నెలసరి. ఇలాంటి సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలన్నది పెద్ద సమస్య. నెలసరి ప్రారంభం కాగానే అమ్మాయికి ఎలాంటి ఆహారం ఇవ్వాలో అని అమ్మకు టెన్షన్. నెలనెలా రుతుస్రావంలో రక్తం కోల్పోతుంది. ఈ టైమ్‌లో ఎప్పుడూ తినేదానికంటే ఎక్కువే తినిపించమని చాలా మంది సలహా ఇస్తారు. మరి నిజానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలన్న విషయంలో చాలా అపోహలున్నాయి. వాటిలోవాస్తవాలను గ్రహిస్తే.. చాలా వరకు ఆడపిల్లల్లో ఎనిమియా(రక్తహీనత) రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. ప్రతినెలా వచ్చే నెలసరితో రక్తం కోల్పోతుండటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గుతుంది. రక్తహీనత రాకుండా ఐరన్‌ను భర్తీ చేయాల్సిన అవసరం ఉంటుంది.

కొత్తగా రుతుస్రావం మొదలైన వారికి కొబ్బరి, బెల్లం, నువ్వులు, పల్లీలు పెట్టాలంటారు. పెద్దలు చెప్పే ఈ ఆహారం శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. అయితే కొబ్బరిలోనూ, నువ్వుల్లోనూ ఫ్యాట్ ఎక్కువ ఉంటుంది. మోతాదు మించితే ఈ వయసులో త్వరగా బరువు పెరుగుతారు. స్థూలకాయం సమస్య వస్తుంది. రోజూ ఇచ్చే ఆహారానికి అదనంగా ప్రొటీన్స్ ఉండే ఆహారం ఇస్తే మంచిది.



పిండివంటలు, స్వీట్స్‌లో నెయ్యికి బదులు వెన్న వేయాలి. వెన్న కాచి నెయ్యి చేశాక అందులో కొన్ని పోషకాలు తగ్గుతాయి. కొవ్వులో జీర్ణమయ్యే విటమిన్లను ఒంట బట్టించుకునేందుకు వెన్న దోహదం చేస్తుంది. మీ రోజువారీ ఆహారం తోపాటు తాజా ఆకుకూరలు, ఎండుఖర్జూరం, నువ్వులు, బెల్లం, గసగసాలు, అటుకులు ఎక్కువగా తీసుకుంటే మంచిది.

మాంసాహారులైతే .. మాంసం, చేపలు, చికెన్‌తో పాటు... మాంసాహారంలో లివర్‌ను ప్రత్యేకంగా తీసుకోవాలి. కోడిగుడ్డు, పాలు తప్పనిసరిగా రోజూ తీసుకోవాలి. ఐరన్ ఉండే ఆహార పదార్థాలతో పాటు విటమిన్-సి ఉండే తాజా పండ్లు... జామ, నిమ్మ, నారింజ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.

నెలసరి రోజుల్లో ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి. గ్లూకోజ్ నీళ్లు, కొబ్బరినీళ్లు తీసుకోవడం మంచిది. ఉప్పు, కారం ఎక్కువగా ఉండే పచ్చళ్లు, మసాలా ఎక్కువ ఉండే స్పైసీ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ చాలా తక్కువగా తీసుకోవాలి. చిప్స్, ఫ్రెంచ్‌ఫ్రైస్, బర్గర్లు, పిజ్జాల వంటి జంక్‌ఫుడ్‌తో పాటు కెఫిన్ పాళ్లు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్ నెలసరి సమయంలో అస్సలు తీసుకోకూడదు. ❄

సైన్యంలోకి సౌదీ మహిళలు...



సౌదీ అరేబియా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై మహిళలు కూడా ఆర్మీలో చేరవచ్చంటూ చారిత్రక ప్రకటన చేసింది. మహిళా సాధికారతను పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

రియాద్, మక్కా, అల్-ఖాసిం, మదీనా తదితర ప్రొవిన్సెస్‌ల సైన్యంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని.. అందుకు గురువారం(మార్చి 1వ తేదీ) ఆఖరు రోజని ప్రకటించింది. ఆర్మీలో చేరాలనుకునే మహిళలు దరఖాస్తులో 12 అంశాలను తప్పకుండా పూరించాలని తెలిపింది. సౌదీ జాతీయురాలై ఉండటం.. 25-35 ఏండ్ల మధ్య వయస్సు.. హైస్కూలు విద్యార్హత కలిగి ఉండాలి. వైద్య పరీక్షలు చేసుకోవడం తప్పనిసరని పేర్కొంది. ఇక శారీరక ధారుఢ్యం విషయంలో అభ్యర్థి ఎత్తు 155 సెంటీమీటర్లకు తగ్గకూడదని తెలిపింది. వీటితోపాటు ఇతరత్రా నిబంధనలను విధించింది. అయితే గార్డియన్ అనుమతితోనే ఆమె సైన్యంలో చేరాలన్న నిబంధనపై మాత్రం మహిళా హక్కుల సంఘాలు పెదవి విరుస్తున్నాయి. అయితే ఈ నియామకం యుద్ధంలో పోరాటడం కోసం కాదని.. తాము సైన్యంలో రాణించగలమన్న భావన మహిళలలో పెంపొందించేందుకేనని అధికారులు చెబుతున్నారు. చమురుపై ఆధారపడుతున్న సౌదీ భవిష్యత్తులో దాని నుంచి దూరంగా జరగాలనే ఉద్దేశంతో విజన్ 2030 కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. మహిళల అభ్యున్నతికి ఆటంకాలుగా ఉన్న చట్టాలకు సవరణలు చేస్తూ వారికి సడలింపులు ఇస్తున్నారు. గతంలో మహిళలు డ్రైవింగ్ చేయటంపై నిషేధం ఎత్తివేత, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు అనుమతులు మంజూరు చేసిన విషయం విదితమే. ❄

ఆత్మవిశ్వాసమే మీ బాడీగార్డ్

మహిళలు ఇంటి నుంచి కాలు బయట పెట్టి చీకటి పడకుండానే ఇల్లు చేరుకోవడం అంత సులభం కాదు. హైదరాబాద్‌లాంటి బిజీ నగరాల్లో అసలు సాధ్యం కాదు. అలాంటప్పుడు ఎదురయ్యే ఆపదల నుంచి మనకు మనమే రక్షణ కల్పించుకోవాలి. అందుకు కొన్ని టిప్స్ పాటించాలి...

- బయటకు వెళ్లేముందు బ్యాగులో చాకు, పెప్పర్ స్ప్రే లాంటి రక్షణాయుధాలు పెట్టుకోవడం మర్చిపోవద్దు. కనీసం కారప్పొడి, బాడీ స్ప్రే లాంటివైనా ఉంచుకోవాలి.
- నడిచి వెళ్తున్నా, టూ వీలర్ మీద వెళ్తున్నా... వీలైనంత వరకూ ఎక్కువగా రద్దీ ఉండే దారిలోనే వెళ్లండి. రద్దీ లేని షాట్‌కట్ రూట్లలో వెళ్లవద్దు.
- తప్పనిసరి పరిస్థితుల్లో నిర్మానుష్యంగా ఉండే దారుల్లో వెళ్లాల్సి వస్తే... టూ వీలర్‌ని పొరపాటున కూడా ఆపకండి. నడిచి వెళ్తుంటే కనుక బ్యాగులో ఉన్న ఆయుధాన్ని తీసి చేతితో పట్టుకోండి.
- ఒంటరిగా నడుస్తున్నప్పుడు భయంగా దిక్కులు చూడటం, టెన్షన్‌గా చేతులు నులుముకోవడం, చెమట తుడుచుకోవడం వంటివి చేయవద్దు. మీ నడకలో, బాడీలాంగ్వేజ్‌లో స్టిఫ్‌నెస్ ఉండాలి. అది మీ కాన్ఫిడెన్స్‌కు చిహ్నంలా కనబడాలి. అప్పుడు మీ జోలికి రావడానికి ఎవరైనా కాస్త జంకుతారు.
- ఫోను మాట్లాడుకుంటూనో, ఏదో ఆలోచిస్తూనో పరిసరాలను గమనించడం మర్చిపోవద్దు. నడుస్తూనే నలుదిశల్లో ఏం జరుగుతోందో గమనిస్తూ.. ముందుకు వెళ్లాలి.
- ఆటో, క్యాబ్‌లు ఎక్కే ముందు డ్రైవర్‌ని కాసేపు ఏదో ఒకటి మాట్లాడించండి. అతడు మద్యం సేవించాడన్న అనుమానం వస్తే.. ఆ వెహికిల్ లో వెళ్లకండి.
- ఆటోనో, క్యాబ్‌నో ఎక్కితే... వెహికిల్ నంబర్ నోట్ చేసుకుని వెంటనే ఇంట్లోవాళ్లకు చెప్పండి. వీలైతే మీ ఫోన్‌లో హాట్‌స్పాట్ ఆన్ చేస్తే ఆటో ఏ రూట్లో వెళ్తోందో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. ❄



ఏపీకి హోదాతో అదనంగా వచ్చేదేంటీ?

అమరావతి: హోదా వల్ల అదనంగా వచ్చేదేమిటని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఫలానావి వస్తాయని జీఓ ఏమైనా ఉందా ? ఉంటే ఇవ్వాలని తాము అడుగుతున్నామని తెలిపారు. అయినా కేంద్రం ఇస్తానంది కాబట్టి హక్కుగా అడుగుతున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు లేవని, ఇక్కడ రాజకీయాలు చేయాలనకుంటే కుదరదని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఉండవల్లిలో సీఎం నివాసం దగ్గరున్న గ్రీవెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో వచ్చిన పెట్టుబడులను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రపార్టీ అధ్యక్షులు హరిబాబు స్పెషల్ స్టేటస్‌పై మాట్లాడుతున్నారని, రాష్ట్రంపై ఆరోపణలు చేస్తున్నారని, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకుడు కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం హోదా ఇస్తానందని, సహకరించాలని కోరారు. హోదా ఇవ్వకపోయినా చేతులు ముడుకు కూర్చొని బీద అరుపులు అరిచే వ్యక్తిని కాదని తెలిపారు. తెలివితేటలను ఎవరూ తక్కువ చేయలేరని వ్యాఖ్యానించారు. అయినా హోదా పేరుతో కొంతమంది ఆందోళనలు చేస్తున్నారన్నారు.

మంత్రాల నెపంతో వృద్ధుడి హత్య

నవతెలంగాణ-గుర్రంపోడు

మంత్రాల నెపంతో వృద్ధునిపై దాడి చేసి చంపేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తేరాటిగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పిల్లి సాయన్న కుమారుడు శివ(18) వారం రోజుల కింద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, కన్నెబోయిన రాములు(60) మంత్రాలు చేయడంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సాయన్న ఆరోపించాడు. రాములుకు ఈ విషయం తెలియడంతో సాయన్న ఇంటికి వెళ్లి అడిగాడు. అప్పటికే కోపంతో ఉన్న సాయిలు కన్నెబోయిన వెంకటయ్య, కన్నెబోయిన సత్తయ్య, పిల్లి వెంకటయ్య, మండలి వెంకటయ్య, శ్రీనుతో కలిసి రాములుపై దాడి చేశారు. బండరాయితో రాములు తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని దేవరకొండ డీఎస్పీ రవికుమార్, కొండమల్లేపల్లి సీఐ శివరామిరెడ్డి పరిశీలించారు. నిందితులు పరారీలో ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాములు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల్ని మోసం చేసిన సీఎం

- నేడు సింగరేణి వ్యాప్తంగా నిరసనలు :

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను మరోసారి మోసం చేశారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ -ఏఐసీడబ్ల్యూఎఫ్ అనుబంధం) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్ సాయి బాబు, బి మధు తెలిపారు. శ్రీరాంపూర్‌లో సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ కార్మికుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదని, తమ సమస్యలపై మాట్లాడాలని కోరిన మహిళా కార్మికుల గొంతులు నొక్కేసి, పోలీసులతో అరెస్టులు చేయిం చారని తెలిపారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారంనాడు నిర సన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులే లేరని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా తప్పుడు ప్రకటన చేశారని, ఇటీవలి కాలంలో టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంట్రాక్ట్ కార్మికుల సమ స్యలు పరిష్కరిస్తామని, సీఎం దృష్టికి తీసుకెళ్తామని పదేపదే ప్రకటనలు చేశారని చెప్పారు. కానీ శ్రీరాంపూర్ సమావేశంలో ఈ అంశాన్నే ప్రస్తా వించకుండా అసమర్థులుగా నిలిచారని విమర్శించారు. సీఎం పర్యటన సందర్భంగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు సెలవు ప్రకటించకుండా వివక్ష పాటించిందని చెప్పారు. ఇదే సభ నిర్వహణ కోసం మాత్రం కాంట్రాక్ట్ కార్మికులతో రాత్రింబవళ్లు వెట్టిచాకిరీ చేయించు కొని దుర్మార్గంగా వ్యవహరించారని అన్నారు. బుధవారం జరిగే నిరసన కార్యక్రమాల్లో కాంట్రాక్ట్ కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'కేసులతో నీరు రాకుండా అడ్డు'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అపాలమూరును వలసల జిల్లా మార్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీదేనని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో నిధులు, నీళ్ళు, నియామకాలను ఆంధ్రాకు తరలిపోవడానికి సహకరిస్తే, ఇప్పుడు కోర్టు కేసులతో పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తగిన సమయంలో కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు త్రికరణ శుద్ధితో పర్యవేక్షిస్తున్నారన్నారు. పాలమూరు, నెట్టెంపాడు, భీమా, ఆర్డీఎస్, కోయిలసాగర్, కెఎల్ఐ ప్రాజెక్టుల ఖచ్చితంగా నిర్ణీత సమయంలో నీటిని అందిస్తామన్నారు.

జడ్చర్లలో నేడు 120 మంది టైలర్లకు కుట్టు మిషన్ల పంపిణీ

సీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జడ్చర్లలో 120 మంది టైలర్లకు కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్టు మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ ట్రస్ట్ పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నామన్నారు.

సీఎం కేసీఆర్ దిగజారి మాట్లాడారు : బీజేపీ

హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ తన హెూదాను మరిచి దిగజారుడు మాటలు మాట్లాడటం సరికాదని, ప్రధాని మోడీపై చేసిన వ్యాఖ్యలకు తక్షణమే ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకుంటే, బీజేపీ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

గవర్నర్‌కు ఫిర్యాదు

బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు రామచంద్రారెడ్డి, రాజాసింగ్, నల్లు ఇంద్రాసేనరెడ్డి ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసిన ఫిర్యాదు చేశారు. కేసీఆర్ మాట్లాడిన క్లిపింగ్స్‌ను, పేపర్ కటింగ్‌లను గవర్నర్‌కు అందజేశారు.

మార్చి 1న హోలీ..
సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్: హోలీ పండుగ ఎప్పుడు జరుపుకోవాలనే దానిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. మార్చి 1న హెూలీ పండుగని తెలిపింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం మార్చి 2న 'హెూలీ' సెలవు ప్రకటించగా... రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మార్చి 1న 'హెూలీ' సెలవు ప్రకటించింది. దీంతో రెండు తేదీలపై ఉద్యోగుల్లో గందరగోళం ఏర్పడింది. సెలవు విషయంలో ఉద్యోగులు స్పష్టత కోరారు. దేవాదాయశాఖ మార్చి 1వ తేదీనే 'హెూలీ' అని స్పష్టం చేసింది. మార్చి 1ని హెూలీ పండగ సెలవుగా.. మార్చి 2ని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

5న తెలుగు రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్ర హోంశాఖ భేటీ

మార్చి 5న సాయంత్రం 4 గంటలకు తెలుగు రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్రహోంశాఖ సమావేశం కానుంది. విభజన చట్టం అమలు తీరు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, 13వ షెడ్యూల్‌లోని అంశాలపై చర్చించనున్నారు.

ఉత్సవ కమిటీ చైర్మెన్ కోసం ఎస్సీ సంఘాల సమావేశం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మెన్ ఎంపిక కోసం ఉన్నతాధికారులు ఎస్సీ సంక్షేమ సంఘాల నుండి దరఖాస్తులు సేకరించేందుకు సంబంధిత సంఘాలతో మంగళవారం సమావేశమయ్యారు. కొత్తపేటలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పీ.కరుణాకర్, గురుకుల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడీ సర్కారుకు తగ్గుతున్నఆదరణ

- కష్టాలతో ప్రజలు సతమతం:

సీఎస్‌డీఎస్ సర్వే



న్యూఢిల్లీ: నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ప్రజానీకంలో ఆదరణ పెద్దఎత్తున తగ్గుతోందని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) సంస్థ పేర్కొంది. ఈ సంస్థకు చెందిన లోక్‌నీతి రిసెర్చ్ ప్రోగ్రామ్‌కు చెందిన కొందరు పరిశోధకులు ఒక మీడియా సంస్థ సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సీఎస్‌డీఎస్ వెల్లడించిన వివరాల ప్రకారం 2014లో యూపీఏ -2 ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకత కన్నా ప్రస్తుతం నరేంద్రమోడీ సర్కారుపై ప్రజల అసంతృప్తి ఎక్కువగా ఉంది. నోట్ల రద్దు, జీఎస్టీ తదితర అంశాలతో పాటు, ప్రజానీకం పెద్ద ఎత్తున ఇక్కట్ల పాలవుతుండటం కూడా నరేంద్ర మోడీ సర్కారుకు ప్రజల్లో ఆదరణ గణనీయంగా తగ్గడానికి కారణాలుగా ఈ సర్వే నిర్ధారించింది. ' రానున్న రోజులో ఈ సమస్యలను కొంతవరకైనా పరిష్కరించకపోతే మోడీ సర్కారు ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవటం ఖాయంగా కనిపిస్తోంది' అని సీఎస్‌డీఎస్ వ్యాఖ్యానించింది.

సమస్యల వలయంలో ప్రజానీకం

నరేంద్రమోడీ ప్రభుత్వ హయంలో ప్రజానీకం పెద్ద ఎత్తున సమస్యల వలయంలో చిక్కుకుపోయిందని, ఏటికేడాది ఈ సమస్యలు పెరుగుతున్నాయని ఈ సర్వే నిర్ధారించింది. నోట్ల రద్దు తరువాత ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. 2017 ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో ప్రజల కష్టాలు మరింత పెరిగాయని సర్వే పేర్కొనడమే దీనికి నిదర్శనం. దీనికి తోడు పెరుగుతన్న నిరుద్యోగం, నిత్యావసర వస్తులు ధరలు, జీవన ప్రమాణాలు గణనీయంగా పడిపోవడం వంటివి కూడా ప్రజల్లో అసంతృప్తికి దారి తీసింది.

ఇక్కట్లే కొలబద్ద

ప్రజానీకపు సంతృప్తి స్థాయిని కొలవడానికి వారు ఎదుర్కొంటున్న సమస్యలనే కొలబద్దగా ఈ సర్వేలో వినియోగించారు.

మింట్ మిజరీ ఇండెక్స్‌గా వ్యవహరించే ఈ విధానంలో ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల, నిరుద్యోగం ఇతర అంశాలను ప్రామాణికంగా తీసుకుని ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారు. దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)ని లెక్కగట్టే విధానం మారడంతో కొన్ని నూతన అంశాలను కూడా సర్వేలోకి తీసుకున్నారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితికి పొంతన లేకపోవడం, ఆధారపడ్డదగ్గ విశ్వసనీయ సమాచారం అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి అవకాశాల స్థాయి, ప్రజల కొనుగోలు శక్తి, ఆరోగ్యం కోసం ఖర్చు పెడుతున్న మొత్తాన్ని పరిగణలోకి తీసుకున్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఆహారేతర ఖర్చులకు ప్రజలు వినియోగిస్తున్న మొత్తాన్ని కొలబద్దగా తీసుకున్నారు. 0 నుండి 100 వరకూ వుండే ఈ సూచీలో 100 అన్నది ప్రజల ఇక్కట్ల గరిష్ట స్థాయిని సూచిస్తుంది. యుపిఎ -2 ప్రభుత్వంపై 2014లో 57 పాయింట్ల వద్ద ప్రజల అసంతృప్తి స్థాయి ఉండగా, తాజా సర్వేలో అది 64 పాయింట్లకు చేరుకుంది.

అసంతృప్తి ఇలా..

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిసంవత్సరాల్లో పెద్దగా కనిపించని అసంతృప్తి 2016 నుండి పెరగడం కనిపించింది. 2017 అర్థ సంవత్సరం తరువాత ఈ ప్రక్రియ మరింత వేగవంతమై 64 పాయింట్లకు చేరింది. ముఖ్యంగా గత ఏడాది వేసవి తరువాత మోడీ సర్కారుపై ప్రజల్లో అసంతృప్తి తీవ్ర స్థాయిలో పెరిగిన విషయాన్ని ఈ సర్వే స్పష్టం చేసింది. మంచి రోజులు తెస్తామన్న హామీ నెరవేర్చటంలో మోడీ విఫలమయ్యారన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

కౌలు శాశ్వతం కాదు...

పంటదారుకే ఎకరాకు ఎనిమిది వేలు

- ఎలా పంచుకోవాలో వాళ్లిద్దరే తేల్చుకోవాలి : వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి
- పరిహారం కోసమే రైతులు చనిపోతున్నారనడం తప్పని వ్యాఖ్య
- మైనార్టీ గురుకులాల నిధులపై నఖ్వీకి వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'పంట కౌలుకు ఒప్పందం ఉండదు. కౌలు శాశ్వతం కాదు. అందుకే పెట్టుబడి పథకం కౌలు రైతులకు వర్తింపచేయబోం' అని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఎకరాకు ఎనిమిది వేల పెట్టుబడి పథకం కేవలం పంటదారుకే వర్తిస్తుందని స్పష్టం చేశారు. 'ఈ ఎనిమిది వేల రూపాయలను ఎలా పంచుకోవాలన్నది పంటదారు, కౌలుదారు తేల్చుకోవాలి' అని చెప్పారు. పరిహారం కోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని టీఆర్ఎస్ మంత్రులు చేసిన వ్యాఖ్యలను పోచారం తప్పుపట్టారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థికతోడ్పాటు నందించేందుకు పరిహారం ప్రకటించారని, అంతే కానీ ఈ డబ్బుల కోసం రైతులు చనిపోతారనడం తప్పని అన్నారు.

మంగళవారం ఢిల్లీకి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డి టీఆర్ఎస్ ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీని కలిశారు. ఎంఎస్‌డీపీ(మల్టీసెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కింద మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలని కోరారు. అందుకు నఖ్వీ సానుకూలంగా స్పందించారని సమావేశనంతరం తెలంగాణభవన్‌లోని శబరి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోచారం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికి మోడల్‌గా నిలుస్తోందని నఖ్వీ ప్రశంసించారని చెప్పారు. అలాగే బాన్సువాడలో ఉర్దూమీడియంలో రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయశాఖకు అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అన్నారు. రైతాంగం ఆత్మగౌరవంతో బతికే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేపడుతున్న యాత్రపై విమర్శలు గుప్పించారు. ఇది కేవలం రాజకీయ యాత్ర అని అన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇక కేంద్రంలోని బీజేపీ సర్కారు రైతులను అప్పుల ఊబిలో నెడుతోందని ఓ ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

ఉపాధి సమస్యలపై వ్యకాస సమరభేరి

- నేడు గ్రామీణాభివృద్ధిశాఖ
- కమిషనరేట్ ముందు మహాధర్నా : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని హాజరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని 3.80 లక్షల శ్రమశక్తి సంఘాలను నిర్వీర్యం చేయడానికి నిరసనగా ప్రజాసంఘాలు సమరభేరి మోగించాలని నిర్ణయించాయి. సర్కారు జారీచేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గ్రామీణ ఉపాధి హామీ మేట్ల సంఘం గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రాష్ట్ర కార్యాలయం ఎదుట సంయుక్తంగా మహాధర్నా చేయనున్నాయి. ఇందులో వందలాది మంది ఉపాధి మేట్లతోపాటు కూలీలు సైతం పాల్గొననున్నారు. గత నెల రోజులుగా మండలాలు, జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలను చేపట్టాయి. కమిషనరేట్ ఎదుట జరిగే మహాధర్నాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొననున్నారు. అలాగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి.వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నాగయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఉపాధ్యక్షురాలు బి.పద్మ, గ్రామీణ ఉపాధి హామీ మేట్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, సంఘం రాష్ట్ర నాయకులు మస్కు నర్సింహ్మ సైతం వస్తున్నారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, నగర పంచాయతీల్లోనూ పనులు కల్పించాలనే డిమాండ్లతో ధర్నాకు పూనుకున్నారు. హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ ముందు మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యే ధర్నాకు భారీ సంఖ్యలో ఉపాధి మేట్లు, ఉపాధి కూలీలు హాజరుకావాలని ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గత ఏడాది అక్టోబరు 18న 1786/ఇ.జి.ఎస్/పి.ఎం/ఎస్.పి/2016 పేర ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. తద్వారా ఉపాధి హామీ నిధులను టీఆర్ఎస్ కార్యకర్తలకు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కాగా పాతమేట్ల పేర్లు కూడా రికార్డుల్లో లేకుండా చేసిందని, ఇందుకు సాఫ్ట్‌వేర్‌ను ఆయుధంగా వాడుకున్నదనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. కొత్తసాఫ్ట్‌వేర్‌ను రూపొందించి టీఆర్ఎస్ కార్యకర్తల పేర్లు నమోదు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు ప్రజాసంఘాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం 30 జిల్లాల్లో అమలవుతున్నది. 437 మండలాల్లోని 8751 పంచాయతీల్లో పనులు చేపట్టారు. 21,390 ప్రదేశాల్లో పనులు చేస్తున్నట్టు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల సమాచారం. ఒక్కో శ్రమశక్తి సంఘంలో 10 నుంచి 30 మంది వరకు కూలీలు సభ్యులుగా ఉంటారు. వీరంతా దాదాపు కోటి మందికిపైగా అవుతారు. వీరిలో 51 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీచేశారు. ఇందులో ఆయా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు సైతం ఉన్నారు. కాగా సుమారు 45 లక్షల మంది కూలీలు ప్రతిరోజూ ఉపాధి హామీ పనులకు హాజరవుతారని గ్రామీణాభివృద్ధి శాఖ సమాచారం.

ప్రశాంతంగా టీఆర్టీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో మంగళవారం టీఆర్టీలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) పరీక్ష జరిగింది. హెచ్ఎండీఏ పరిధిలో ఏడు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

మంగళవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)కు 6,635 మంది దరఖాస్తు చేయగా, 4,696 (70.7 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు.మధ్యాహ్నం భాషాపండితులు (ఉర్దూ, మరాఠీ, హిందీ) పరీక్షకు 6,231 మంది దరఖాస్తు చేస్తే, 5,454 (87.5 శాతం) మంది రాశారని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా, ప్రత్యేక స్క్వాడ్‌లతో పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

నేడు ఆన్‌లైన్‌లో పీఈటీ, స్కూల్ అసిస్టెంట్

టీఆర్టీలో భాగంగా బుధవారం ఆన్‌లైన్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ), స్కూల్ అసిస్టెంట్ రాతపరీక్షలు జరుగుతాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం పీఈటీ (తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ, హిందీ) మాధ్యమం అభ్యర్థులకు రాతపరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

పాలనను సరళతరం చేయడమే ఇ గవర్నెన్స్ : కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

పాలనను సరళతరం చేయడం, తద్వారా మానవ జీవనాన్ని సులభతరం చేయడమే ఇ-పరిపాలన(ఇ గవర్నెన్స్) ప్రధాన ధ్యేయం కావాలని ఈశాన్య ప్రాంత అభివద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, ప్రధాన మంత్రి కార్యాలయ వ్యవహారాలు, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు శక్తి విభాగం, అంతరిక్ష విభాగ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇ-పరిపాలనపై రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన 21వ జాతీయ సమావేశం ముగింపు సదస్సులో ఆయన పాల్గొన్నారు ఇ పరిపాలనపై ప్రాంతీయ సమావేశాలను నిర్వహించాలన్న తమ ప్రయత్నంలో భాగంగా తాము గత మూడు సంవత్సరాలలో గువాహటీ, జమ్ము, నాగ్ పూర్, చండీగఢ్, విశాఖపట్టణం, జైపూర్‌తో పాటు హైదరాబాద్ వంటి చోట్ల ఈ సమావేశాలను ఏర్పాటు చేశామని, ఇవి విజయవంతం అయ్యాయని ఆయన వివరించారు. సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడంలో చక్కని ప్రయత్నాలు చేసిన విజేతలకు 8 కేటగిరీలలో మొత్తం 19 అవార్డులను ఈ సందర్భంగా ఆయన అందజేశారు.

ఖమ్మం కలెక్టరేట్ నిర్మాణం చేయడం చెల్లదనే రిట్‌పై వాదనలు

హైదరాబాద్: ఖమ్మం జిల్లా కలెక్టరేట్ భవనాలు బాగున్నప్పటికీ కొత్తగా శివారు ఏరియాలో కలెక్టరేట్ భవనాలు నిర్మాణాలు చేయడం చెల్లదనే రిట్ పిటిషన్‌పై వాదనలు వచ్చే మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఇప్పుడున్న భవనం బాగుందని, అందరికీ అందుబాటులో ఉందని, అయినా ప్రజాధనాన్ని వెచ్చించి శివారులో కొత్తగా నిర్మాణం చేయాల్సిన అవసరం లేదని పేర్కొంటూ న్యాయవాది విజయభాస్కర్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన బెంచ్ విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

శిశు మరణాలపై కోర్టులో విచారణ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రభుత్వ ఆధీనంలోని శిశు మందిరాల్లో 40 మంది పిల్లలు చనిపోయారని, శిశువుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆ వ్యాజ్యాన్ని మరోసారి విచారణ చేపట్టింది. గతంలో బెంచ్ ఆదేశాల మేరకు తెలంగాణ సర్కార్ ఏడాది కాలంలో 18 మంది నవజాత శిశువులు దొరికిన కొద్ది కాలానికే లోకాన్ని విడిచారని తెలిపింది. శిశు మందిరాల్లోని ఇతర పిల్లలకు పౌష్టికాహార సమస్యలేమీ లేవని, వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని, శిశుమందిరాల నిర్వహణ ప్రమాణాలతోనే ఉందని తెలిపింది. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని తెలంగాణ సర్కార్ తరపు లాయర్ చెప్పారు. కౌంటర్ వ్యాజ్యాన్ని దాఖలు చేయాలని సర్కార్‌ను ఆదేశించిన బెంచ్ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

సీపీఐ(ఎం) నేత శ్రీనివాస్ వ్యాజ్యంపై విచారణ

ఆసిఫ్‌నగర్ ఏరియాలోని భోజగుట్ట ప్రాంత భూముల్లో నిర్మాణాలే కాకుండా ప్రహరీని కూడా నిర్మించొద్దని ముస్తఫాహిల్స్ హౌసింగ్ సొసైటీనితాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. సొసైటీకి భూకేటాయింపుల రద్దుకు కలెక్టర్ సిఫార్సుపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్ ఆదేశించింది. సొసైటీకి భూకేటాయింపుల్ని ప్రశ్నిస్తూ సీపీఐ(ఎం) నాయకుడు శ్రీనివాస్ వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

ఎకరానికి రూ. 4వేలు

కౌలు, పోడు రైతులకు ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి. సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెట్టుబడి పథకం కింద కౌలు, పోడు రైతులకు కూడా ఎకరానికి రూ. 4వేల చొప్పున ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ , అధ్యక్షులు పి.జంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఖరీఫ్‌లో రూ.4వేలు, రబీలో రూ.4 వేలు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కౌలుదారు, ఆక్రమణదారు, తాకట్టుదారు పదాలను తొలగిస్తూ సవరణ చట్టం తీసుకురావడం వల్ల 14లక్షల మంది కౌలు రైతులు తమ హక్కులను కోల్పోయారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 14లక్షల మంది కౌలుదారులు సాగు చేస్తున్నట్టు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) గుర్తించిందన్నారు. పంటలు పండించడానికి ఇచ్చేదే పెట్టుబడి రాయితీ పథకం అయినప్పుడు పండించే కౌలు రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కౌలు రైతులే నష్టపోతున్నారని, ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి పరిహారం కూడా కౌలు రైతులకు కాకుండా భూయజమానులకు ఇవ్వడం అన్యాయమన్నారు. పోడు భూములు సాగు చేసే 1.08 లక్షల రైతులతో పాటు దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న 20 వేల మంది(50 వేల ఎకరాలు), అసైన్డ్ భూములు ఖరీదు చేసిన 1.5 లక్షల మంది, ఇంకా భారజ్‌ఖాత భూములు, ప్రభుత్వ భూములు, చెరువు పడకలు, అటవీ బంజరులు సాగు చేస్తున్న రైతులకు కూడా ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

2022 నాటికి అందరికి సురక్షిత తాగునీరు

- కేంద్ర తాగునీటి సరఫరా విభాగం : అదనపు సలహాదారు దినేశ్‌చందర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2022 నాటికి దేశంలో ప్రతీ ఒక్కరికి సురక్షిత తాగునీటిని అందించాలని, ఆ దిశగా తెలంగాణలో అడుగులు పడుతున్నాయని కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అదనపు సలహాదారు దినేశ్ చంద్ అన్నారు. మిగతా రాష్ట్రాల కంటే నాలుగేండ్ల ముందుగానే తెలంగాణ ఈ ఘనత సాధించడం గొప్ప విషయమన్నారు. బుధవారం ఢిల్లీలోని పర్యావరణ్ భవన్‌లో జరిగిన 2018-19 వార్షిక తాగునీటి ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న దినేశ్ చంద్, మిగతా రాష్ట్రాలు తెలంగాణ మోడల్‌ను అనుసరించాలని సూచించారు. మిషన్ భగీరథ పనులను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడానికి వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను సంస్థాగతంగానే రూపొందించుకోవడం పట్ల ఆయన అభినందించారు. తద్వారా రూ. 30 కోట్ల ప్రజాధనం మిగిలిందన్నారు. ఇంతేగాక పలు పథకాల కోసం కేంద్రం ఇచ్చిన నిధులను ఆ రాష్ట్రం సమర్థవంతంగా ఖర్చు చేసిందని గుర్తు చేశారు. అందుకే ఈ ఏడాదికి రూ. 41.10 కోట్ల ప్రోత్సాహకంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని అధికారులను ఆదేశం చారు. అలాగే ఎన్ఆర్‌డబ్ల్యూడీపీ పథకం కింద కేంద్రం ఇచ్చిన రూ.115 కోట్లల్లో 92 శాతం నిధులను, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సరఫరా కోసం వాటర్ సబ్‌మిషన్ పథకంలో భాగంగా మంజూరు చేసిన రూ.516 కోట్లల్లో 75 శాతం నిధులను ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ఖర్చు చేసిందని చెప్పారు. ఆయా నిధులతో తెలంగాణలోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా పథకాలను నిర్వహిస్తున్నదని వివరించారు . ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్ రెడ్డి, మిషన్ భగీరథపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చ్చారు. పస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న తాగునీటి పథకాలను మిషన్ భగీరథతో అనుసంధానించి మరింత సమర్థవంతంగా అమలుచేస్తామని చెప్పారు.

'విభజన హామీలపై ఎందుకు మాట్లాడరు'

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

విభజన హామీలపై టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఎందుకు మాట్లాడటం లేదని మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఎందుకు సాధించలేదన్నారు. జై తెలంగాణ నుండి జై ఆంధ్ర వరకు టీఆర్ఎస్ స్ఫూర్తి పోయిందన్నారు. టీఆర్ఎస్‌ను బొందపెట్టాలన్నారు. సుఖేందంర్‌రెడ్డి ఉద్యమ నాయకుడు అయితే, మా పార్టీ నాయకులు కూడా ఉద్యమ నాయకులేనన్నారు.


నామమాత్రంగా అసెంబ్లీ కమిటీలు : పొంగులేటి

అసెంబ్లీ కమిటీలు నామమాత్రంగా ఉన్నాయని మండలిలోని కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. హౌస్ కమిటీ, అస్యూరెన్స్ కమిటీలు నామ్‌కేవాస్తేగా ఉన్నాయన్నారు.అందులో తాను ఉండనన్నారు. ఖమ్మం మార్కెట్ లో రైతు సమస్యలు చెప్పుకునే వీల్లేకుండా పోయిందన్నారు.

ఏప్రిల్ చివరివారంలో పాదయాత్ర

- ఆలంపూర్ టూ ఆదిలాబాద్ వరకు చేస్తా: విలేకరులతో మాజీ మంత్రి డికె అరుణ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పాదయాత్రకు మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత డికె అరుణ సిద్ధమయ్యారు. ఈ మేరకు రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేసుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర పూర్తయిన వెంటనే, పాదయాత్ర చేపట్టేం దుకు అరుణ సిద్ధమ య్యారు. మంగళవారం విలేకరులతో జరిపిన చిట్‌చాట్‌లో పాదయాత్ర వివరాల ను వెల్లడించారు. 119 నియోజకవర్గాల్లోని ముఖ్య ప్రాంతాలన్నీ కలిపేట్టు పాదయాత్ర ప్లాన్ చేస్తున్నామని అన్నారు. ఏ జిల్లా నేతలు అజిల్లా పాదయాత్రలో ఉండేలా ప్లాన్ చేస్తున్నా, తాను మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నానని చెప్పారు. దీనిపై అన్ని జిల్లాల నేతలతో మాట్లాడుతున్నట్టు తెలిపారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్...సోనియాగాంధీ... అనే విషయాన్నీ ప్రజ ల్లోకి తీసుకెళ్తామన్నారు. సీఎం కేసీఆర్ కు రైతులను ఆదుకోవాలనే సోయి నాలుగేండ్లకు వచ్చిందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగై నా గెలవాలని రౌడీ సమన్వయ సమితిలను ఏర్పాటు చేశారని, వాటినే రైతు సమన్వయ సమితులు అంటున్నారని చెప్పారు.

రాజ్యసభ కోసం పోటీ

హైదరాబాద్ : రాజ్యసభ సీటు కోసం తెలంగాణలో పోటీ పెరిగింది. అన్ని మతాలు, కులాల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో ఎవరికివారు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గొల్ల కురుమల నుంచి రాజ్య సభ సీటును ఆశిస్తున్న వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. యాదవుల్లో పలువురు వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు రాజ్యసభ సీటును దక్కించుకునేందుకు టీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వాన్ని, సీఎం కేసీఆర్ ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరు ముఖ్యమంత్రిని కలిస్తే, మరొకరు మంత్రి కేటీఆర్, ఇంకా ఎంపీ కవితను, మంత్రి హరీశ్‌రావును, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలుస్తున్నారు. వీరిలో వరంగల్ జిల్లాకు చెందిన నాయకులు, విద్యాసంస్థల అసోసియేషన్ ప్రతినిధి సుందర్ రాజు యాదవ్, టీఆర్ఎస్ నాయకులు రాజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య లు ఉన్నారు. మరో రెండు స్థానాల కోసం కూడా పోటీ ఎక్కువగా ఉంది. టీన్యూస్ ఎండీ సంతోష్‌కుమార్, మంత్రి నాయిని నర్సింహారెడ్డిలకే కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.



సిరియాలో కాల్పుల విరమణకు తూట్లు

ఉనికి కోసం తిరుగుబాటుదారులు పాకులాట

డమాస్కస్ : సిరియాలో శాంతి స్థాపన కోసం ఐరాస ప్రయత్నిస్తోంది. ఈ మేరకు 30 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలని సిరియా బలగాలను, తిరుగుబాటుదారులను సూచించింది. ఇరు వర్గాల మధ్య జరుగుతున్న భీకర పోరులో దాదాపు 700 మందికి పైగా చనిపోవడంతో ఐరాస భద్రతా మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే, ఒకవేళ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆమోదించినట్టయితే తమ ఉనికి కోల్పోతామనే ఫోబియాతో తిరుగుబాటుదారులు గౌటా నగరంపై బాంబుల వర్షం కురిపిస్తున్నారు. ఎందరో అమాయక ప్రజలను పొట్టనబెట్టుకుంటున్నారు. ఐరాస భద్రతా మండలి ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. ఇప్పటికే తిరుగుబాటుదారులు జరిపిన వైమానిక దాడుల్లో ఆస్పత్రులు, భవనాలు, వందలకొద్ది ఇండ్లు ధ్వంసమయ్యాయి. గౌటాలో నెత్తురు ఏరులై పారుతోంది. గౌటాలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలనే లక్ష్యంతో ఈనెల 25న ఐరాస భద్రతా మండలి సమావేశం జరిగింది. తక్షణమే సిరియాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేయాలని మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి సిరియా మిత్రదేశమైన రష్యా కూడా ఓటేసింది. సిరియా రాజధాని డమాస్కస్ శివారు నగరమైన గౌటా నగరం 2013 నుంచి తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉంది. ఈ నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా బలగాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.

బ్రిటన్‌లో మంచు తుఫాను



లండన్ : బ్రిటన్‌లో మంచు తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న మంచు కారణంగా జనజీవనం స్తంభించింది. వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. పాఠశాలలు మూతపడ్డాయి. రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే శాఖ పేర్కొన్నది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...కెంట్, సర్రె, సఫోల్క్, ససెక్స్ ప్రాంతాల్లో మంచు ప్రభావం అధికంగా ఉన్నది. స్కాట్లాండ్, ఇంగ్లాండ్, వేల్స్ ప్రాంతాల్లోని మంచు ఎక్కువగా కురియడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మంచు పేరుకుపోవడంతో ఓ స్కూల్ బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 45 మంది చిన్నారులు గాయపడ్డారు. మంచు తుఫాను దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ప్రతినిధి గెమ్మా ప్లబ్ హెచ్చరికలు జారీ చేశారు.

ఆస్ట్రేలియా ఏసీపీకి ఉద్వాసన

- **యూట్యూబ్‌లో జాతి విద్వేష భావాలు రెచ్చగొట్టేలా పోస్ట్‌లు చేసినందుకు...**



బ్రెట్ గ్యూరిన్

సిడ్నీ : ఆస్ట్రేలియాలో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి ఉద్వాసనకు గురయ్యారు. యూట్యూబ్‌లో నకిలీ పేరుతో జాతి విద్వేష భావాలను రెచ్చగొట్టేలా పోస్ట్‌లు పెట్టి ఇంటెలిజెన్స్ విభాగం అధికారులకు చిక్కారు. ఈకేసుపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఏసీపీ తన నేరాన్ని అంగీకరించారు. దీంతో, విక్టోరియా ఏసీపీ బ్రెట్ గ్యూరిన్‌ని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రకటించింది. వెర్నర్ డెమెరిస్ట్ పేరుతో బ్రెట్ పలు అసభ్యకరమైన, జాతి విద్వేష భావాలను రెచ్చగొట్టే పోస్టులను యూట్యూబ్‌లో పెట్టారని విచారణ అధికారి మీడియాతో చెప్పారు. జాతి విద్వేష భావాలను రెచ్చగొట్టే వారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని అన్నారు.

ఆర్మీ చీఫ్‌ను తొలగించిన సౌదీ రాజు



రియాద్: సౌదీ రాజు సల్మాన్ సంచలన నిర్ణయం తీసుకొన్నారు. ఆర్మీ చీఫ్ కమాండర్ అబ్దుల్ రహ్మాన్ బిన్ సలేహ్ అల్ బునియాన్‌ను తొలగించారు. ఈ మేరకు సౌదీ ప్రెస్ ఏజెన్సీ ప్రకటించింది. రహ్మాన్ స్థానంలో ఫయ్యాద్ అలీ రువాలీని నియమిస్తూ సౌదీ రాజు నిర్ణయం తీసుకున్నారని ప్రకటించింది. అంతేగాకుండా, భూ, వైమానిక దళాలకు చెందిన సైన్యాధిపతులను కూడ రాజు ఇతరులతో భర్తీ చేశారు. పాతవారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు.

అయితే, రక్షణ విభాగంలో కీలకమైన మార్పులకు సంబంధించి స్పష్టమైన ప్రకటన మాత్రం ఇవ్వలేదు. ఎందుకు వారికి మార్చాల్సి వచ్చిందనే విషయమై ప్రకటించలేదు.సౌదీ రాజు కుమారుడు రక్షణ మంత్రిగా కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం సౌదీ దళాలు యెమెన్ యుద్ధంలో పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఆకస్మిక నిర్ణయం సంచలనం కలిగించింది. యెమెన్‌లో తిరుగుబాటుదారులకు మద్దతుగా సౌదీ దళాలు పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు మూడేండ్లుగా యెమెన్‌లో అంతర్యుద్ధం నడుస్తున్నది. సౌదీలో జరిగిన ఆకస్మిక పరిణామాలకు అరబ్ దేశాలు ఆశ్చర్యపడుతున్నాయి.

క్యాబినెట్‌లో మహిళకు మంత్రి పదవి

సౌదీ అరేబియా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. తామందర్ బింట్ యూసుఫ్ అల్ రామను తొలిసారిగా కార్మిక శాఖ ఉప మంత్రిగా నియమిస్తూ సౌదీ రాజు సల్మాన్ నిర్ణయం తీసుకున్నారు. అంతేగాకుండా, దేశంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మిలిటరీ విభాగంలో సౌదీ రాజు మార్పులు చేపట్టారని గల్ఫ్ మీడియా అభిప్రాయపడింది. రాజు తలాలత్, అతని సోదరుడు అల్ వలీద్ బిన్ తలాల్‌లు సదరన్ అసీర్ ప్రావిన్స్‌కు డిప్యూటీ గవర్నర్లుగా సౌదీ రాజు నియమించారు. సైన్యంలో చేరేందుకు మహిళలకు కూడ అవకాశం కల్పిస్తూ సౌదీ రాజు సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

పపువా న్యూగినియాలో భూకంపం

- **14 మంది మృతి, 300 మందికి గాయాలు**



పోర్ట్ మోర్స్‌బీ : పపువా న్యూగినియాలో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 7.5గా నమోదైనట్టు యూఎస్ జియోలజికల్ సర్వే అధికారులు తెలిపారు. పపువా న్యూగినియాలోని ఎంగా ప్రావిన్స్‌లోని బంగారు గనులున్న ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 14 మంది మృతిచెందారు. 300 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలమట్ట మయ్యాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. పలు భవనాలు కూలిపోయాయి. రోడ్లపై కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. భూకంపం సంభవించిన ప్రాంతాల్లో హెలా ప్రావిన్స్ గవర్నర్ ఫిలిప్స్ ఉండియలు సందర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు.

చేతిలో ఆయుధం లేకున్నా రెడీ : గవర్నర్ల సమావేశంలో ట్రంప్

వాషింగ్టన్: చేతిలో ఆయుధం లేకున్నప్పటికీ దుండగులను ఎదుర్కొనగల గుండెధైర్యం తనలో ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మంగళవారం గవర్నర్లతో ట్రంప్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫ్లోరిడాలోని పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటనపై చర్చించారు. తన వద్ద ఆయుధం లేకపోయినా ఫ్లోరిడా స్కూల్‌లో విద్యార్థులను కాపాడేందుకు తాను వెళ్ళేవాడినని ట్రంప్ అన్నారు. ఓ ఉన్మాది చేతిలో చిన్నారులు హతం కావడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలోని ఫ్లోరిడా స్కూల్‌లో కాల్పుల ఘటనల్లో సుమారు 17 మంది మరణించారు. ఫ్లోరిడా ఘటనపై ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీరు నన్ను పరీక్షించే వరకు నమ్మలేరు. కానీ అలాంటి పరిస్థితుల్లో ఆయుధం లేకున్నా తాను విద్యార్థులను కాపాడేందుకు వెళ్ళేవాడినని ట్రంప్ గవర్నర్ల సదస్సులో వ్యాఖ్యానించారు. పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ట్రంప్ అధికారులను ఆదేశించారు. ఇలాంటివి జరగకుండా దీర్ఘకాలిక చర్యలు అవసరమని పేర్కొన్నారు. స్కూల్ సిబ్బందిలో శిక్షణ పొందిన, తగిన ధ్రువీకరణ పత్రం కలిగిన వారి వద్ద ఆయుధాలు ఉంచాలని సూచించారు. స్కూల్లో ఆయుధాలతో సెక్యూరిటీ గార్డులను నియమించాలని సూచించారు. ఫ్లోరిడా స్కూల్‌లో దాడి జరిగిన సమయంలో డ్యూటీలో ఉన్న గార్డుల ప్రవర్తన చాలా దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జర్మనీలో డీజిల్ కార్ల వినియోగంపై నిషేధం

- **వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా..**



బెర్లిన్: వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా జర్మనీ సంచలన నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు డీజిల్ కార్ల వినియోగంపై నిషేధం విధిస్తున్నట్టు పేర్కొన్నది. వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నిషేధం అమల్లో ఉంటుందని తెలిపింది. కోర్టు ఆదేశాల ప్రభావం జర్మనీలోని డీజిల్ కార్ల అమ్మకాలపై ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్ల అమ్మకాలు తగ్గినప్పటికీ వాతావరణ కాలుష్యం కొంతమేర తగ్గించేందుకు వీలవుతుందని చెబుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...స్టట్‌గార్ట్, డుస్సెల్‌డార్ఫ్ నగరాల్లో వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్నది. ఈ నగరాల్లో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కొంతకాలంగా ప్రయత్నిస్తున్నది. కోర్టు తాజా తీర్పును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని అన్నారు. ఈ రెండు నగరాల్లో డీజిల్ కార్లను నిషేధించాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. అయితే, దీని ప్రభావం జర్మనీ అంతటా ఉంటుందని అన్నారు. ఫెడరల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ వెల్లడించిన వివరాల ప్రకారం.. జర్మనీలోని మ్యూనిచ్, కొలోన్ నగరాలతో పాటు 70 నగరాల్లో వాతావరణ కాలుష్యం అధికంగా ఉంది. వాహనాల నుంచి కార్బన్ మోనాక్సైడ్ ఉద్గారం మోతాదు అధికంగా ఉంది. డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రికల్ వాహనాలను ఉపయోగించాలని జర్మనీ ఛాన్స్‌లర్ గతవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సూచించారు.

శాస్త్ర విజ్ఞాన సౌరభాలకు వెలుగెప్పుడు?

దేశంలో పరిశోధన- అభివృద్ధి రంగానికి కేటాయింపులు అంతంత మాత్రమే

- **ఆర్డీకి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సరిపోవని తేల్చి చెప్పిన ఆర్థిక సర్వే**
- **బ్రిక్స్ సభ్య దేశాల్లో చిట్టచివరి స్థానం మనదే!**
- **శాస్త్ర విభాగంలో ప్రాక్టికల్ నైపుణ్యం ముఖ్యమంటున్న నిపుణులు**

జై

ఊహలకు, కల్పనలకు ఎప్పుడో కాలం చెల్లిపోయింది. వడివడిగా ప్రగతి పథంలో దూసుకుపోతున్న వివిధ దేశాలకు దీటుగా భారతావని నిలువాలంటే.. శాస్త్ర విభాగంలో సరైన పరిశీలన, ప్రయోగ విధానం, నిర్ధారణ నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఎంతైనా అవసరం. ఐతే, శాస్త్ర పరిశోధన- అభివృద్ధి విభాగాల్లో మన దేశం ఇంకా అనుకున్న స్థాయిలో విజయవంతం అవట్లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆ నేపథ్యంపై "నేషనల్ సైన్స్ డే" సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం..





28.02.2018 నేషనల్ సైన్స్ డే సందర్భంగా..

"రామన్ ఎఫెక్ట్"కు గానూ ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్‌కు 1930, ఫిబ్రవరి 28న నోబెల్ బహుమతి వరించగా.. సైన్స్ రంగానికి చేసిన సేవలకు భారత ప్రభుత్వం 1954లో భారత రత్న అవార్డుతో ఆయన్ని సత్కరించింది. సదరు అవార్డు అందుకుంటున్న సందర్భంగా రామన్ మాట్లాడుతూ.. "ప్రయోగ శాలల పరికరాలవల్ల విజ్ఞాన శాస్త్రం సంపూర్ణం అవ్వదు. నిరంతర పరిశోధన, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి, తోడ్పాటు ఉంటేనే.. ఎవ్వరైనా విజ్ఞానశాస్త్ర కడలిని మథించగలుగుతార"ని అన్నారు. ఐతే, మన దేశంలో శాస్త్ర పరిశోధన- అభివృద్ధికి అందుతున్న ప్రోత్సాహకం అంతంత మాత్రంగానే ఉండటం విచారకరం.

బ్రిక్స్ దేశాల్లో మన స్థాయి:

మానవ పరిణామ క్రమంలో శాస్త్ర సాంకేతికత పోషిస్తోన్న పాత్ర ఎంతో ఉన్నతమైనది. రాతిపనిముట్లతో మొదలైన ఆదిమ మానవుడి ప్రస్థానం.. అంతరిక్షంలో ఇండ్లు కట్టుకునే స్థాయికి ఎదిగిందంటే.. అదంతా విజ్ఞాన శాస్త్ర గొప్పదనమే! రానున్న కాలంలో దేశాల అభివృద్ధి రేటింగ్స్.. ఆర్థిక, సామాజిక అంశాలతో పాటు సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో ఆయా దేశాల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందని అంచనా! ఇది గమనించిన చైనా, అమెరికా, ఇజ్రాయిల్, దక్షిణ కొరియా వంటి దేశాలు పరిశోధన- అభివృద్ధి రంగానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తూ.. అక్కడి మానవ వనరులను సరిగ్గా ఉపయోగించుకుంటున్నాయి. ఐతే, మన దేశంలో గత ఇరవై ఏండ్ల నుండి శాస్త్ర పరిశోధనలకు కేటాయిస్తున్న నిధుల్లో (దేశ జీడీపీతో పోలిస్తే) ఎంత మాత్రం పెరుగుదల లేకపోవడం గమనార్హం. కాగా, 'శాస్త్ర పరిశోధన- అభివృద్ధి' రంగానికి నిధులను కేటాయిస్తున్న బ్రిక్స్ దేశాల్లో మనమే అట్టడుగు స్థానంలో ఉండటం విచారకరం.

ఆ దేశాలు ఎంతో ముందుకు:

దేశ జీడీపీలో కేవలం 0.6% నిధులను మాత్రమే పరిశోధన విభాగానికి మనం కేటాయిస్తుండగా.. చైనా దేశం 2020 నాటికి జీడీపీలో 2.5 శాతం సొమ్మును(ప్రస్తుతం 2.1%) ఒక్క పరిశోధన విభాగానికే వెచ్చించాలని చూస్తుండటం విశేషం. శాస్త్ర- సాంకేతిక విభాగాలకు చైనా దేశం ప్రాముఖ్యతనిస్తున్నది కాబట్టే, చిన్న చిన్న సాంకేతిక పరికరాలను అసెంబుల్ చేసే స్థితి నుండి సూపర్ హై ఎండ్ కంప్యూటర్లు మొదలు అత్యున్నత సాంకేతిక యుద్ధ విమానాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి సదరు దేశం చేరింది.

గత పదేండ్ల కాలంలో ప్రపంచ దేశాలకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక ఆవిష్కరణలన్నీ గంపగుత్తగా ఒక్క అమెరికా నుండి రావడాన్ని చూస్తే.. అక్కడ సైన్స్ పరిశోధనలకు ఇస్తోన్న ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. రానున్న కాలంలో అభివృద్ధి చెందిన దేశాలను అందుకోవాలంటే భారతావనిలో శాస్త్ర పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలకు పెద్దపీట వెయ్యాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు రంగం, విశ్వవిద్యాలయాల నుంచి కూడా శాస్త్ర పరిశోధన- అభివ ద్ధి విభాగానికి తోడ్పాటు ఎంతో అవసరం.

అలాగే, మన దేశంలో జరుగుతోన్న పరిశోధనల తీరుతెన్నులు ఆశించిన స్థాయిల్లో ప్రాక్టికల్ నైపుణ్యాన్ని పెంచేవిధంగా లేవన్న విమర్శలను దూరం చేస్తూ ముందుకు పోతే.. భవిష్యత్ భారతం శాస్త్ర సాంకేతిక భారతంగా విలసిల్లుతుంది.

శాస్త్ర పరిశోధనలో మన భారతం

- శాస్త్ర పరిశోధన- అభివృద్ధి రంగానికి భారత్ కేటాయిస్తున్న నిధులను వెంటనే రెట్టింపు చెయ్యాలని ఆర్థిక సర్వే- 2018 సైతం తేల్చి చెప్పింది.
- శాస్త్ర పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలకు చైనాలో సుమారు 300 కంపెనీలు అత్యధిక నిధులు వెచ్చిస్తుండగా.. ఆ సంఖ్య మన దేశంలో కేవలం 25కే పరిమితమైంది.
- జీడీపీలో అత్యధిక నిధులను శాస్త్ర పరిశోధన- అభివృద్ధి రంగానికి కేటాయిస్తున్న దేశం - ఇజ్రాయిల్.

దేశం	ఆర్డీకి కేటాయిస్తున్న నిధులు – అంచనా (జీడీపీలో)
ఇజ్రాయిల్	4.30
ద.కొరియా	4.20
అమెరికా	2.80
చైనా	2.10
బ్రెజిల్	1.24
రష్యా	1.19
భారత్	0.60

రైతుల సంక్షేమమే లక్ష్యం

- **ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ**

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్



రాష్ట్ర రైతాంగం, వ్యవసాయ అభివ ద్ధి కోసం అనేక వినూత్న సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ తెలిపారు. అనతి కాలంలోనే యావత్తు దేశ దష్టిని ఆకర్షిస్తూ తెలంగాణను ఒక ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అనేక వరాలను ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. అందులో భాగంగా మొదటిగా రైతులకు రుణమాఫీ కింద రూ.16.400 కోట్లను కేటాయించారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో అనేక మంది రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడ్డారన్నారు. ఇంత భారీస్థాయిలో ఏ రాష్ట్రం కూడా రుణమాఫీ చేయలేదన్నారు. ప్రతి రైతుకు పంట పెట్టుబడి ఎకరానికి రూ.4000 ప్రకటించి దేశంలోనే ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వం పంట పెట్టుబడికిగాను రూ.12 వేల కోట్లను కేటాయించినట్టు ప్రకటించారు. నిజాం పాలనలో జరిగిన భూసర్వే తర్వాత రాష్ట్రంలో పాలించిన ఏ ప్రభుత్వం కూడా చేయని కార్యాన్ని కేసీఆర్ అత్యంత ధైర్యంతో రెవెన్యూశాఖ అధికారులతో చర్చించి సమగ్ర భూప్రక్షాళన సర్వేకు నాందీ పలికారని చెప్పారు. త్వరలో అందరికి అత్యంత భద్రతతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వబోతున్నామని చెప్పారు. రెవెన్యూ శాఖ సిబ్బంది కష్టాలను గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహకంగా ఒక నెల జీతాన్ని కానుకగా ప్రకటించారని చెప్పారు. అదనంగా ప్రతి రైతుకు రూ. 5 లక్షల వ్యక్తిగత బీమా కల్పిస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పుష్కలంగా ప్రోత్సాహం

- **సెరికల్చర్ ఉద్యోగులు సైనికుల్లా పని చేయాలి: హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పట్టు పరిశ్రమ శాఖకు తెలంగాణ ప్రభుత్వం పుష్కలంగా ప్రోత్సాహమిస్తుంది కనుక సెరికల్చర్ ఉద్యోగులందరూ సైనికుల్లాగా పని చేయాలని హార్టికల్చర్ కమిషనర్ ఎల్. వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. హార్టికల్చర్, సెరికల్చర్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోయంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన శాఖ కంటే భవిష్యత్తులో పట్టుపరిశ్రమ శాఖ బలోపేతం కానున్నదని చెప్పారు.

ఉపాధి హామీ పథకం కింద మల్బరీ తోటలు, పట్టుపురుగుల పెంపకం గది నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. మల్బరీ తోట పెంపకానికి మూడు దఫాలుగా కలిపి రూ.1.39 లక్షల సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్యాక్రాంతం అయిన పట్టు పరిశ్రమ శాఖకు తెలంగాణ ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకురానున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని భర్తీ చేసుకుంటామన్నారు. పని చేసే ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నిరాశకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చేది కేవలం పట్టుపురుగుల పెంపకంతోనే అని తెలిపారు. రైతులను చైతన్య పర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం త్వరలో కోటి ఎకరాలకు సాగునీరందించబోతున్నందున మల్బరీ తోటలు విస్తారంగా పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సెరికల్చర్ డిపార్టుమెంట్ అడిషనల్ డైరెక్టర్ మదన్‌మోహన్‌రావు, నాబార్డు డిజిఎమ్ సిఎస్ఆర్ మూర్తి, సైంటిస్టు డాక్టర్. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌లో అప్రకటిత ఎమర్జెన్సీ

- **ఆంక్షలు ఎత్తేయాలని సీపీఐ(ఎం) ఆందోళన**
- **మీడియాకు, రాజకీయ పార్టీలకు అనుమతి నిరాకరణపై ఆగ్రహం**
- **పలువురి నాయకుల అరెస్ట్**

నవతెలంగాణ-నయాబజార్



మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని ఇటీవల ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆందోళనకు దిగిన విషయం విదితమే. రైతులకు మద్దతుగా సీపీఐ(ఎం), ఇతర వామపక్ష, రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు నిలవడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలకు పూనుకుంది. ఈ క్రమంలోనే ఖమ్మం మార్కెట్‌లో అప్రకటిత ఆంక్షలు విధిస్తూ రాజకీయ పార్టీలను, మీడియాను రాకుండా అడ్డుకుంటోంది. మార్కెట్‌లోకి ఎవరూ రాకుండా పోలీసులను మోహరించి రెండ్రోజులుగా కొనుగోళ్లు చేపడుతోంది. పంట ధర తెగ్గోస్తున్న దళారులు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. వారికే వత్తాసు పలికేలా, ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించుకుని కొనుగోళ్లు జరిపేలా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చర్యలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. తొలుత భారీ ర్యాలీగా మార్కెట్ ప్రాంతంలోని బోసుబొమ్మ సెంటర్‌కు చేరుకున్నారు. ర్యాలీని అడ్డుకునేందుకు అప్పటికే పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి సీపీఐ(ఎం) నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. అయినా, వెనకడుగు వేయకుండా నాయకులు బారీకేడ్లను తోసుకుంటూ మార్కెట్ వైపు ముందుకు సాగారు. పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి నగరంలోని టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజాగళాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదన్నారు.

ఎన్నాండ్లు ఇలా ఆంక్షలు విధించి పరిపాలన సాగిస్తారని ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అడిగినందుకు అక్రమంగా అరెస్టులు చేయిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, రైతులకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లోకి రాజకీయ పార్టీలను, మీడియాను, రైతు సంఘాలను అనుమతించాలని, లేనిచో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, తుశాకుల లింగయ్య, వై.విక్రమ్, గట్టు రమాదేవి, తాళ్ల నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి వినోదానికి రంగం సిద్ధం..



భరత్ అనే నేను


రంగస్థలం


నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా


పంతం


ఆచారి అమెరికా యాత్ర


కాలా

దేశంలోని అన్ని భాషా చిత్రాలకు వేసవి సీజన్ చాలా చాలా స్పెషల్. ఈ సీజన్‌లో చిన్నా, పెద్ద చిత్రాలనే తేడా లేకుండా ప్రతి ఒక్క దర్శక, నిర్మాత తమ చిత్రాన్ని సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటారు. సమ్మర్ కావడంతో స్టూడెంట్స్‌కు ఇచ్చే హాలీడేస్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కీలక పాత్ర పోషిస్తాయి. సకుటుంబ సపరివార సమేతంగా సినిమాలను చూసేందుకు కూడా ఇది అనువైన సీజన్. ప్రతి యేడాది మాదిరిగానే ఈ యేడాది కూడా బోల్డెన్ని తెలుగు చిత్రాలు వేసవి బరిలో దిగేందుకు రెడీ అవుతున్నాయి. కాంబినేషన్ కమర్షియల్ చిత్రాలు, కంటెంట్ బేస్డ్ చిత్రాలు, ప్రయోగాత్మక చిత్రాలు.. ఇలా అన్ని రకాల సినిమాలు అమీతుమీ తేల్చుకునేందుకు సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి.

ఈ సమ్మర్ సీజన్‌ని పురస్కరించుకుని మార్చి, ఏప్రిల్, మే నెలల్లో దాదాపు 20 చిత్రాలు విడుదలకాబోతున్నాయి. అందులో మార్చిలోనే దాదాపు 11 సినిమాలుండగా, ఏప్రిల్‌లో నాలుగు, మేలో ఐదు పెద్ద చిత్రాలున్నాయి (ఇప్పటి వరకు ప్రకటించిన తేదీల ప్రకారం).

మార్చి

మార్చి మొదటి వారంలో ఒక్క సినిమా కూడా లేదు. అధిక రేట్లు వసూలు చేస్తున్న డిజిటల్ కంపెనీలు క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డిలకు వ్యతిరేకంగా మార్చి 2 నుంచి థియేటర్ల బంద్ నిర్వహిస్తున్న నేపథ్యంలో మొదటి వారంలో వచ్చే సినిమాలపై క్లారిటీ లేదు.

ఇక రెండో వారంలో(మార్చి 9) 'కణం' చిత్రం రిలీజ్ అవుతోంది. నాగశౌర్య, సాయిపల్లవి జంటగా నటించిన ఈచిత్రానికి విజయ్ దర్శకత్వం వహించగా, లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. డిఫరెంట్ పాయింట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలోని 'సంజలి..' అనే పాటను ఇటీవలే విడుదల చేశారు. ఇదే వారంలో మంచు విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ జంటగా జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన 'ఆచారి అమెరికాయాత్ర'ను కూడా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. పద్మజ ప్రొడక్షన్ పతాకంపై కిట్టు, కీర్తి చౌదరి నిర్మిస్తున్నారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మంచు విష్ణు, నాగేశ్వర్‌రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న మూడవ సినిమా కావడం విశేషం.

మార్చి మూడో వారం (మార్చి 15)న 'సత్యగ్యాంగ్' విడుదల కానుంది. సాత్విక్ ఈశ్వర్, అక్షిత జంటగా నటించిన ఈ చిత్రానికి ప్రభాస్ దర్శకత్వం వహించగా, మహేష్ ఖన్నా నిర్మించారు. సమాజంలోని అనాథలకు పరిష్కారం చూపే కథాంశంతో వస్తున్న సందేశాత్మక చిత్రమిది. ఒక్క రోజు గ్యాప్‌తో నిఖిల్ హీరోగా నటిస్తున్న 'కిరాక్ పార్టీ' విడుదల కానుంది. శరన్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే హీరోయిన్లుగా నటిస్తున్నారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా కాలేజ్ లైఫ్‌ను ప్రతిబింబించే ఈ సినిమాను రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. రాజ్ మాదిరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఐతే2.0' కూడా ఇదే రోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. సోషల్ మీడియా వల్ల వచ్చే నష్టాలను తెలియజేస్తూ సందేశాత్మకంగా రూపొందిన ఈ సినిమాలో ఇంద్రనీల్ సేన్ గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

మార్చి నాలుగో వారం (మార్చి 23)న కళ్యాణ్ రామ్ 'ఎమ్మెల్యే' విడుదల అవుతోంది. 'ఇజం' తర్వాత కొంత గ్యాప్‌తో కళ్యాణ్ రామ్ నటిస్తున్న చిత్రమిది. ఉపేంద్ర మాదవ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కళ్యాణ్‌రామ్ సరసన కాజల్ హీరోయిన్‌గా నటిస్తుంది. భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిఫరెంట్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇదే రోజు 'రాజరథం' విడుదల కానుంది. అనూప్ భండారి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఆయన సోదరుడు నిరూప్ భండారి హీరోగా నటించగా, అవంతిక కథానాయికగా నటించింది. ఆర్య, రవిశంకర్ కీలక పాత్రలు పోషించారు. మార్చి చివరి వారంలో రెండు భారీ ప్రతిష్టాత్మక చిత్రాలు 'మహానటి', 'రంగస్థలం' విడుదల కానున్నాయి. మహానటి సావిత్రి జీవితం ఆధారంగా నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న చిత్రం 'మహానటి'. కీర్తి సురేష్ సావిత్రి పాత్రలో నటిస్తుండగా సమంత, మోహన్‌బాబు, విజయ్ దేవరకొండ, దుల్కర్‌సల్మార్, తరుణ్ భాస్కర్, క్రిష్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా మార్చి 29న భారీ స్థాయిలో విడుదలవుతోంది. వైజయంతి బ్యానర్‌పై స్వప్నా దత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీంతోపాటు మిత్రన్ దర్శకత్వంలో విశాల్ నటించిన అనువాద చిత్రం 'అభిమన్యుడు' కూడా ఇదే రోజు విడుదల కానుంది. ఒక్క రోజు గ్యాప్‌తో మార్చి 30న రామ్‌చరణ్ 'రంగస్థలం' విడుదల కానుంది. 1985 బ్యాక్‌డ్రాప్‌లో విలేజ్ నేపథ్యంలో సాగే రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. చరణ్ సరసన సమంత కథానాయికగా నటిస్తోంది. ఇందులో చరణ్ చెవిటి వాడిగా కనిపించనున్నారు. పూజా హెగ్డే స్పెషల్‌సాంగ్‌లో మెరవనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్(సీవీఎం) సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

థియేటర్ల బంద్ ప్రభావం..

వేసవి సినిమాలపై థియేటర్ల బంద్ ప్రభావం పడే అవకాశం. అధిక ఫీజులను వసూలు చేస్తున్న డిజిటల్ సంస్థలు క్యూబ్, యుఎఫ్ఓ, పీఎక్స్‌డీలకు వ్యతిరేకంగా మార్చి 2 నుంచి థియేటర్ల బంద్ నిర్వహించాలని, ఆయా డిజిటల్ సంస్థలకు కంటెంట్‌ను ఇవ్వకూడదని దక్షిణాది చిత్రపరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. హాలీవుడ్ వంటి వాటిల్లో ఈ డిజిటల్ సంస్థలు మొదటి ఐదేండ్లు మాత్రమే ఫీజులు వసూలు చేసి, ఆ తర్వాత ఉచితంగానే కంటెంట్‌ను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నాయి. ఇండియాలో కూడా తొలుత అదే మాదిరిగా ఇస్తామని ఎంటరైన ఈ సంస్థలు తర్వాత ఫీజును తగ్గించకపోగా, మరింత పెంచుతున్నాయి. దీంతో నిర్మాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని జాయింట్ యాక్షన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. సదరు డిజిటల్ సంస్థలు 9 శాతం మాత్రమే రేట్లను తగ్గిస్తామని స్పష్టం చేశారు. వర్చువల్ ప్రింట్ ఫీజు 25 శాతం తగ్గిస్తూ, విడతల వారిగా మొత్తం ఫీజును తగ్గించాలని, బ్రేక్‌లో కొత్త సినిమాల ట్రైలర్లని వేయాలని జాక్ డిమాండ్ చేయగా, అందుకు డిజిటల్ సంస్థలు ఒప్పుకోలేదు. దీంతో ఆయా సంస్థలకు కంటెంట్‌ను ఇవ్వకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని భావిస్తున్నారు. మరి బంద్ కొనసాగితే ఇప్పుడు ప్రకటించిన చిత్రాల తేదీలు మారే అవకాశం ఉంది. అది ముమ్ముందు ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాలి.

ఏప్రిల్

ఏప్రిల్ మొదటి వారం(ఏప్రిల్ 5)లో నితిన్ హీరోగా రూపొందుతున్న 'ఛల్ మోహన్‌రంగ' ప్రేక్షకుల ముందుకొస్తోంది. మేఘా ఆకాష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ అందించారు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ట్ మూవీస్ పతాకాలపై ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. లవ్,ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుందీ చిత్రం.

ఏప్రిల్ రెండో వారం(ఏప్రిల్ 12)న నాని ద్విపాత్రాభినయం చేసిన 'కృష్ణార్జునయుద్ధం' రిలీజ్ కానుంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నాని సరసన అనుపమా పరమేశ్వరన్, రుస్కర్ మీర్ కథానాయికలుగా నటిస్తున్నారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

మూడో వారంలో భారీ చిత్రం 'భరత్ అనే నేను' ప్రేక్షకుల ముందుకు రానుంది. 'శ్రీమంతుడు' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిది. కైరా అద్వాని కథానాయిక. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మహేష్ సీఎంగా కనిపించనున్నారు.

నాలుగో వారంలో రజనీకాంత్ 'కాలా' విడుదల కానుంది. 'కబాలి' వంటి బ్లాక్ బస్టర్‌ను రూపొందించిన పా.రంజిత్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. ముంబయి మాఫియా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హ్యూమా ఖురేషి కథానాయికగా నటించింది. ఏప్రిల్ 27న ప్రపంచ వ్యాప్తంగా ఈచిత్రం విడుదల కానుంది.

మే

మేలోనూ భారీ చిత్రాలు సందడి చేయబోతున్నాయి. మొదటివారం (మే 4)న అల్లు అర్జున్ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు వస్తోంది. దేశభక్తి నేపథ్యంలో వక్కంతం వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. అను ఇమ్మాన్యుయెల్ హీరోయిన్. ఇందులో బన్నీ సైనికుడిగా నటిస్తున్నారు. మార్చి 1న పోస్టర్ ఇంపాక్ట్‌ను రిలీజ్ చేయనున్నారు. మే రెండో వారంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'సాక్ష్యం' ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పూజా హెగ్డే కథానాయికగా నటించిన ఈ చిత్రానికి శ్రీవాస్ దర్శకత్వం వహిస్తుండగా అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. డిఫరెంట్ కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం మే 11న రిలీజ్‌కు సన్నద్ధమవుతోంది. 'గౌతమ్‌నంద' పరాజయం తర్వాత గోపీచంద్ నటిస్తున్న సినిమా 'పంతం'. కె.చక్రవర్తిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న చిత్రమిది. సందేశాత్మక కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా మే 18న విడుదల కానుంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాలో మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తోంది.

మే 24న నాగచైతన్య 'సవ్యసాచి' ప్రేక్షకుల ముందుకు రానుంది. చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో చైతూ సరసన నిధి అగర్వాల్ నటిస్తుండగా, మాధవన్, భూమిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిఫరెంట్ జోనర్‌లో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వేసవి సందడిని పంచడానికి సిద్ధమవుతుందీ చిత్రం. ఒక్క రోజు గ్యాప్‌తో నాగార్జున, రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆఫీసర్' చిత్రం విడుదల కానుంది. శ్రీవిష్ణు 'నీది నాది ఒకే కథ', రవితేజ 'నేల టికెట్' చిత్రాలు కూడా సమ్మర్ కానుకగానే రిలీజ్ కానున్నాయి. ఇలా భారీ బడ్జెట్ చిత్రాలతోపాటు చిన్న చిత్రాలు సైతం వేసవి బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమ బాగోగుల కోసం భారీ చిత్రాల నిర్మాతలు ఎవరికీ పోటీ లేకుండా కొంత గ్యాప్ ఇస్తూ తమ చిత్రాల తేదీలను మార్చుకోవడం హర్షించదగ్గ విషయం.


ఎమ్మెల్యే


మహానటి


ఛల్ మోహన్ రంగ


కృష్ణార్జున యుద్ధం


సాక్ష్యం


సవ్యసాచి


కిరాక్ పార్టీ

నవచిత్రం

పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్


'ఆఫీసర్'లో నాగార్జున

నాగార్జున, రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి తాజాగా 'ఆఫీసర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా టైటిల్‌ను, ఫస్ట్‌లుక్ మోషన్ టీజర్‌ను నాగార్జున అభిమానులతో పంచుకున్నారు. 'ఇలాంటి భయపెట్టే పోలీస్‌ను ఎప్పుడూ చూడలేదు' అని పోస్టర్‌పై ఉన్న లైన్ ఆకట్టుకుంటోంది. ఇందులో నాగార్జున పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఓ పాపని కాపాడే ప్రయత్నంలో భాగంగా నాగ్ చేసే పోరాటాలు నేపథ్యంలో సినిమా సాగుతుందట. కంపెనీ పతాకంపై వర్మ నిర్మిస్తున్నారు. 24ఏండ్ల తర్వాత ఈ కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. మైరా సరీన్ కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం ముంబయిలో యాక్షన్ ఎలిమెంట్స్ చిత్రీకరిస్తున్నారు. మే 25న సినిమాను విడుదల చేయబోతున్నారు.

ఆ క్షణం కోసం వెయిటింగ్ !

'ప్రేమలో పడాలని నాక్కూడా ఉంది. కానీ ప్రస్తుతం ఆ టైమ్, అవకాశం లేదు' అని అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. ప్రస్తుతం హిందీ, తమిళ చిత్రాలతో బిజీగా ఉన్న రకుల్‌పై ఇటీవల ప్రేమ వ్యవహారాలకు సంబంధించిన వార్తలు వినిపించి విషయం విదితమే. వాటిని ఆమె ఖండించింది. తాజాగా లవ్ ప్రపోజల్స్, లవ్ లెటర్ గురించి రకుల్ చెబుతూ, 'కాలేజ్ రోజుల్లో ప్రేమలో పడే అవకాశం రాలేదు. ప్రేమలో పడాలనే ఆలోచనే రాలేదు. అదే సమయంలో ఏ ఒక్క అబ్బాయి కూడా నాకు 'ఐ లవ్ యు' అని చెప్పలేదు. అలాగే ఒక్క లవ్ లెటర్ కూడా రాలేదు. 'మీకు కుప్పలు కుప్పలుగా లెటర్స్ వస్తున్నాయి, నాకు మాత్రం ఎందుకు రావడం లేద'ని మా స్నేహితులను అడిగేదాన్ని. హీరోయిన్ అయ్యాక కొంత మంది 'మేడమ్ ఐ లైక్ యు', 'ఐ విల్ మ్యారీ యు' అని ప్రపోజ్ చేశారు. ఇప్పుడు నాక్కూడా ప్రేమలో పడాలని ఉంది. అలాంటి వ్యక్తి నా లైఫ్‌లోకి ఎప్పుడు వస్తాడో తెలియడం లేదు. పెళ్ళి కొడుకుని వెతికే బాధ్యత నేను తీసుకోలేనని మా అమ్మతో చెప్పా. దీంతో నా పెళ్ళి వ్యవహారాలన్నీ వాళ్లే చూసుకుంటామని చెప్పారు' అని తెలిపింది.


రకుల్ ప్రీత్ సింగ్

అత్యున్నత ప్రమాణాలతో...


నిరూప్ భండారి, అవంతిక

నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య, రవిశంకర్ ప్రధాన పాత్రధారులుగా అనూప్ భండారి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాజరథం'. రానా దగ్గుబాటి వాయిస్ అందిస్తున్నారు. జాలీ హిట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 23న విడుదలకు సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడంతా చిత్ర టెక్నీషియన్ల గురించి మాట్లాడుకుంటున్నారని చెబుతోంది చిత్ర బృందం. 'ఈ చిత్రానికి సౌండ్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న రాజా కృష్ణన్ దేశంలోనే పేరొందిన టాప్ సౌండ్ మిక్సర్స్‌లో ఒకరు. 'ప్రేమమ్', 'బెంగుళూరు డేస్', 'విక్రమ్‌వేద', 'అర్జున్‌రెడ్డి', 'అ..ఆ', 'నా పేరు సూర్య' వంటి చిత్రాలకు పనిచేసిన ఆయన ఈ సినిమాను అత్యున్నతంగా తీర్చిదిద్దిన విధానం సూపర్‌గా ఉంది. డాల్బీ ఆట్మాస్ అవసరం అని, దాని వల్ల ప్రేక్షకులకు మరింత అనుభూతిని అందించగలమని టీంని ప్రోత్సహించి సౌండ్ విషయంలో స్పెషల్ కేర్ తీసుకున్నారు. 'ఈ సినిమా నా కెరీర్‌లోనే ఒక మైల్ స్టోన్‌గా నిలిచిపోతుంది. ప్రేక్షకులు సినిమా చూశాక సౌండ్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు' అని ఆయన తెలిపడం సంతోషంగా ఉంది. ఇక 'బాహుబలి', 'ఈగ', 'దృశ్యం', 'రంగితరంగి' వంటి సినిమాకు పనిచేసిన కలరిస్ట్ శివకుమార్ ఈ చిత్రానికి కూడా పనిచేయం గొప్ప విషయం. స్క్రిప్ట్‌కి తగ్గట్టుగా కలర్ పాల్లేట్స్‌ను ఈ సినిమా కోసం వాడారు. ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో అత్యున్నత ప్రమాణాలతో ఈ చిత్రం ఉండబోతుంది. అనూప్ మరోసారి తెరపై తన మ్యాజిక్‌ను చూపించబోతున్నారు' అని తెలిపింది.

సింగరేణిలో సీఎం సభ వల్ల
40 కోట్ల నష్టం : సీఐటీయూ

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

సింగరేణిలో సీఎం కేసీఆర్ సభ నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి 40 కోట్ల నష్టం వాటిల్లిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, సాయిబాబు తెలిపారు. సీఎం సభ కోసం రామగుండం, బెల్లంపల్లిలోని ఏడు బ్రాంచీలకు ప్రభుత్వం సెలవు ఇచ్చిందని అన్నారు. బొగ్గు ఉత్పత్తిని నిలిపివేసిందన్నారు. రామగుండంలో 200 బస్సులు, బెల్లంపల్లిలో 200 బస్సులను ఏర్పాటు చేసి,వాటిద్వారా కార్మికులను తరలించారని ఆరోపించారు. ఒక్కో బస్సుకు గనుల్లో ఉంటున్న మేనేజర్లను ఎగ్జిక్యూటివ్‌లుగా నియమించారని తెలిపారు. మొత్తానికి 40కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఇంతచేసినా కార్మికులకు నయాపైసా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హామీ ఇవ్వలేదన్నారు. ఏ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ సభను పెట్టారో ప్రజలకు చెప్పాలన్నారు.

రక్షణ మంత్రికి కేటీఆర్ లేఖ

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. కారిడార్ ఏర్పాటు తెలంగాణకు అన్ని రకాల అర్హతలున్నాయన్నారు. దీనివల్ల ద్వారా తెలంగాణ స్థానిక యువతకు మరింత ఉపాధి లభిస్తుందన్నారు. బుందేల్ ఖండ్, చెన్నాయ్- బెంగళూర్ ప్రాంతాలకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించిన తీరుగానే తెలంగాణకు సైతం కేటాయించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్లను ప్రకటించిన కేంద్రం, అన్ని విధాల అనువైన పరిస్థితులున్నప్పటికీ తెలంగాణను విస్మరించడం పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

కేంద్రం ఏంచేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేయడాన్ని ఎద్దేవా చేస్తూ.. 'థాంక్ గాడ్.. వాళ్లు ప్యూన్‌ను వదిలేశారు' అని ట్వీట్ చేశారు."మన విద్యావంతులు నెహ్రూ పాలన నుంచి కాంగ్రెస్ తప్పుడు పాలన వరకు ప్రతి ఒక్కరినీ నిందిస్తారు. అదేవిధంగా పీఎన్‌బీ కుంభకోణానికి ఆడిటర్లు కారణమని నిందించారు. అదృష్టవశాత్తు వారు ప్యూన్‌ను విడిచిపెట్టారు. అసలైన ప్రశ్న ఏమిటంటే.. పీఎన్‌బీ నిజమైన యజమాని అయిన ప్రభుత్వం ఏంచేస్తోంది" అని ఆయన ట్వీట్ చేశారు. ఆరేండ్లుగా కుంభకోణం జరుగుతోంది, అందులో నాలుగేండ్లు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయాన్ని సిన్హా గుర్తుచేశారు.

ముహూర్తం మార్చి 14 లేదా15 ?

(మొదటిపేజీ తరువాయి)

వేసుకోగా.. జనవరి చివరి నాటికి రూ.24 వేల కోట్లే సమకూరాయి. జనవరి చివరి నాటికి రూ.3,643 కోట్ల రెవెన్యూ లోటుతో బడ్జెట్ బండి కనాకష్టంగా నడుస్తుదని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో గత మూడేండ్ల మాదిరిగానే వచ్చే ఏడాది సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడే అవకాశముందని ఆయా వర్గాలు వివరించాయి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను భారీగా పెంచిన నేపథ్యంలో.. జనవరి చివరి నాటికి సిబ్బంది జీతభత్యాల కోసం ప్రభుత్వం రూ.19,165 కోట్లను ఖర్చు చేసింది.

మతతత్వమే మహా అడ్డంకి

(మొదటిపేజీ తరువాయి)

జీవితాన్ని ప్రారంభించిన ఎండీ. అమిన్, తదనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నతస్థాయికి ఎదిగారని, ప.బెంగాల్ వామపక్ష ప్రభుత్వంలో సుదీర్ఘ కాలం మంత్రిగా పనిచేశారని వారంతా స్మరించుకున్నారు. పార్టీ సభ్యుడిగా, మంత్రిగా అమిన్ సేవల్ని కొనియాడుతూ, ఆయన మృతికి ఘన నివాళి అర్పించారు.

ఇంటర్నెట్ సేవల్లో భారత్‌కు 47వ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

భారత్‌కు 47వ స్థానం నాణ్యత పట్ల భారతదేశం రాజీ పడిందని, తక్కువ డాటాతో సరిపెడుతోందని తాజా అధ్యయనం అభిప్రాయపడింది. ఇంటర్నెట్ సేవలపై 86 దేశాల్లో అధ్యయనం జరగ్గా, భారత్‌కు 47వ స్థానం దక్కింది. ప్రపంచ దేశాల్లో ఇంటర్నెట్ వాడకంపై సమగ్రమైన అధ్యయనం కోసం 'ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్' (ఈఐయూ) అనే కమిటీని ఫేస్‌బుక్ ఏర్పాటుచేసి, ఈనివేదికను రూపొందించింది. 23 ఆసియా దేశాల్లో కూడా భారత్‌కు మెరుగైన స్థానం దక్కలేదు. ఇంటర్నెట్ అనుసంధానం విషయంలో భారత్‌కు 12వ స్థానం లభించింది. ప్రపంచంలో 380 కోట్లమందికి ఇంకా ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాలేదని నివేదిక పేర్కొంది.


మహిళకు దూరంగా...ఇంటర్నెట్

మొత్తం 86దేశాల్లో దాదాపు 91శాతం ఇంటర్నెట్ వాడకందార్ల సమాచారాన్ని క్రోడీకరించారు. ధనిక, పేద దేశాల్లో వాడకం ఎలా ఉందో పరిశీలించారు. దాదాపు అన్ని దేశాల్లోనూ మహిళలకన్నా పురుషులకే అత్యధికంగా (33.5 శాతం) ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. ఈ తేడా పేద దేశాల్లో అత్యధికంగా ఉంది. ప్రపంచంలోని ప్రజలందరికీ ఇంటర్నెట్ అందుబాటులో రావాలంటే మరికొన్నాండ్లు పట్టేట్టు ఉంది. ఆసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాల్లో 'ఇంటర్నెట్' సాధికారత అన్నదానిపై సర్వేలో 67 శాతంమంది స్పందించారు. ఇంటర్నెట్ సౌకర్యాన్ని కలిగివుండటమన్నది మానవ హక్కుగా వారు పేర్కొన్నారు.

మహిళా భద్రత చైతన్య పరుగు

మార్చి 4న.. 10,5,2 కి.మీ రన్‌లో ఏడు వేల మంది మహిళలు, బాలికలు

- 3 నుంచి రెండు రోజుల పాటు షీటీమ్, భరోసా ఎక్స్‌పో
- మహిళలు షీటీమ్స్‌ను ప్రోత్సహించాలి: డీజీపీ మహేందర్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్ రెడ్డి

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మహిళల భద్రత, రక్షణపై ప్రజలను మరింతగా చైతన్యపర్చడానికి మార్చి 4వ తేదీన హైదరాబద్‌లో 10కె,5కె,2కె రన్‌లను నిర్వహించనున్నట్టు రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి ప్రకటించారు. అలాగే మార్చి 3, 4 రెండు రోజుల పాటు షీటీమ్, భరోసా ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మార్చి8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. గత నాలుగేండ్లుగా హైదరాబాద్‌లో మహిళల భద్రత, రక్షణ కోసం షీటీమ్‌లు చేస్తున్న కృషి ఎనలేనిదని ఆయన కొనియాడారు. ముఖ్యంగా మహిళలకు వివిధ సమస్యలపై భరోసా కార్యక్రమాన్ని చేపట్టి మంచి ఫలితాలను రాబట్టినట్టు ఆయన వివరించారు. షీటీమ్, భరోసా కార్యక్రమాలపై ప్రజల్లో మరింత చైతన్యాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ చెప్పారు. షీటీమ్‌లకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి మహిళలు, బాలికలకు మూడు విభాగాలలో రన్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. పీపుల్స్ ప్లాజాలో ఎక్స్‌పోను రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రారంభిస్తారని, రన్‌ను ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, నటుడు విజయ్ బెల్లంకొండలు ప్రారంభిస్తారని డీజీపీ తెలిపారు. ఈరన్‌లో కాలేజీ, పాఠశాలల విద్యార్థులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంధ సంస్థలు, కార్పొరేట్ సంస్థలకు చెందిన మహిళలు భాగస్వామ్యులవుతున్నారని తెలిపారు. మూడు విభాగాల్లో పాల్గొనే వారందరికి పతకాలు బహూకరిస్తున్నామని వివరించారు. ఇందులో పాల్గొనే వారు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యు. ఈవెంట్ ఇన్ టుడే.కమ్ సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి రుసుము లేదని డీజీపీ తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న వారు షీటీమ్ ఎక్స్‌పోలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక స్టాల్ నుంచి టీషర్టు, క్యాప్‌లను తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. షీటీమ్, భరోసా కార్యక్రమాలు ఏ విధంగా సాగుతున్నాయి, ఏయే అంశాలపై ఈ విభాగాలు పని చేస్తున్నాయి, మహిళ భద్రత, రక్షణ కోసం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చర్యలు, మొదలైన అంశాలపై ఎక్స్‌పోలో అవగాహనను కల్పించనున్నామని షీటీమ్ ఇన్‌చార్జి, నగర క్రైమ్ విభాగం అదనపు పోలీసు కమిషనర్ స్వాతిలక్రా తెలిపారు. రన్‌లో పాల్గొనడమే గాక, ఎక్స్‌పోను కూడా సందర్శించి షీటీమ్‌లకు తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్ నుంచి ఈ పరుగు ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా రన్‌కు సంబంధించిన పతకాలు, పోస్టర్లు, టీషర్టులను డీజీపీ మహేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ వివి శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో మూఢనమ్మకాల నిరోధక చట్టం

జేవీవీ నేతలతో హోంమంత్రి నాయిని



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని రాబోయే బడ్జెట్ సమావేశాల్లో తీసుకొస్తామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం జేవీవీ నేతలు హోంమంత్రిని కలిసి ఇదే డిమాండ్‌పై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేవీవీ రూపొందించిన పోస్టర్‌ను నాయిని నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. కర్నాటక, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలోనూ ఈ తరహా చట్టాన్ని తీసుకురావాలని జేవీవీ నేతలు ఆయనను కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.ఆది నారాయణ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో వరల్డ్ ఐటీ కాంగ్రెస్ ఘనంగా నిర్వహించుకోగా, మరోపక్క చిలకానగర్‌లో దారుణ నరబలి ఘటన జరిగిందని గుర్తుచేశారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 200 కేంద్రాల్లో బుధవారం 'మూఢనమ్మ కాల నిరోధక చట్టాన్ని తీసుకురా వాలని' అనే డిమాండ్‌తో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరిం చనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నేతలు బీఎస్‌రెడ్డి, రాజా, వెంకటరమణారెడ్డి, సర్వేశ్వర్‌రావు, లక్ష్మినర్సయ్య, సి మోహన్, మాణిక్యాల రావు, జయబాబు, మల్లయ్య ఉన్నారు.

బోనాల నిధులు భోంచేశారు

అధికారపార్టీ అవినీతికి పరాకాష్ట

- సమగ్ర విచారణ జరపాలి : టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల సారంగపాణి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఆర్‌ఎస్ సర్కారు దేవుని సొమ్ము కూడా వదలడం లేదని తెలుగుదేశంపార్టీ హైదరాబాద్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల సారంగపాణి అన్నారు. రాష్ట్రంలో అవినీతికి టీఆర్‌ఎస్ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఘనంగా జరిగే బోనాల ఉత్సవాల నిర్వహణ, అమ్మవారి ఆలయాల అభివద్ధికోసం కేటాయించిన కోట్లాది రూపాయల నిధులను అధికార పార్టీ నాయకులు సగానికి పైగా మింగేసారని తెలిపారు. మంగళవారంనాడిక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం ఏ ఒక్క ఆలయాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని, కేవలం ఆపార్టీ నాయకులకు ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టడానికే నిధుల్ని విడుదల చేశారని విమర్శించారు. ఉనికిలో లేని ఆలయాల పేరుపై, బినామీ ఆలయ కమిటీలను ఏర్పాటుచేసి మూడేండ్లలో కోట్ల రూపాయలు మింగేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు కూడా టీఆర్‌ఎస్ నేతలకు సహకరించి, వాటాలు పంచేసుకున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలు చెప్పిన వారందరికీ దేవాదాయశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా చెక్కులు ఇచ్చేశారని, ఆ శాఖ పరిధిలో ఉన్న గుడి... లేని గుడి అని తేడా లేకుండా ప్రతి గుడికి ఓ కమిటీ పేరుతో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టించారని చెప్పారు. ప్రభు త్వం అమ్మవారి ఆలయాల అభివద్ధికోసం గత సంవ త్సరం రూ.10కోట్లు విడుదల చేస్తే సగంకూడా ఎక్కడా ఖర్చు పెట్టిన దాఖలాలు లేవన్నారు. చాలా వరకు రంగులువేసి చేతులు దులుపుకున్నారని, ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడనట్టు అధికార పార్టీ నాయకులే దేవుడి సొమ్ము మింగేస్తే ప్రజలు మాత్రం ఏం చేస్తారని ప్రశ్నించారు. ఎన్నడూ కన్నెత్తి చూడని గుడిని కూడా వెతికి మరీ ఉత్సవాల పేరుతో చెక్కులు తీసుకోవడం టీఆర్‌ఎస్ నాయకుల అవినీతికి పరాకాష్ట అని చెప్పారు. ఈ అవినీతి వెనుక మంత్రుల హస్తం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని, దీనిపై ప్రత్యేక కమిటీ వేసి వాస్తవాలను వెల్లడించి, అవినీతికి పాల్పడిన వారిని చట్ట పరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బోనాల సొమ్మును దుర్వినియోగం చేసి, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు తెలుగుదేశంపార్టీ పక్షాన వినతిపత్రం ఇస్తున్నామని తెలిపారు.

కడసారి..


వాట్సాప్‌లో వైరల్ అయిన ఫొటో

(మొదటిపేజీ తరువాయి)

అనుమానాలకు ప్రస్తుతానికి ఫుల్‌స్టాప్ పడింది.

విమానంలో ...

దుబాయ్ ఎయిర్‌పోర్టు నుంచి చార్టర్డ్ విమానంలో శ్రీదేవి పార్థివ దేహంతోపాటు ఆమె భర్త బోని కపూర్, ఆయన మొదటి భార్య మోనా కుమారుడు అర్జున్‌కపూర్, బోనీ సోదరుడు సంజయ్‌కపూర్ ముంబయికి చేరుకున్నారు. దుబాయ్ ఎయిర్‌పోర్టులో సాయంత్రం 6-45 గంటలకు బయలుదేరిన విమానం ముంబయి విమానాశ్రయంలో రాత్రి 9-30 గంటలకు ల్యాండైంది. తమ తల్లి పార్థివ దేహాన్ని చూడాటానికి శ్రీదేవి కుమార్తెలిద్దరు ముంబయి విమానాశ్రయానికి వెళ్లారు. శ్రీదేవిని చూడటానికి వెళ్లినవారిలో అనిల్ అంబానీ, ఆయన భార్య టీనా అంబానీ కూడా ఉన్నారు. అంబానీకి చెందిన విమానంలోనే శ్రీదేవి భౌతికకాయాన్నిముంబయికి తరలించారు.

నేడు మధ్యాహ్నం 3-30కి అంత్యక్రియలు

శ్రీదేవి అంత్యక్రియలను బుధవారం మధ్యాహ్నం 3-30 గంటలకు నిర్వహించనున్నట్టు ఆమె కుటుంబసభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మృతి వార్త తెలిసిన ఉద్వేగ సమయంలో ఎంతో సంయమనంతో వ్యవహరించిన మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. భర్త బోని కపూర్, కుమార్తెలు జాన్వి, ఖుషితోపాటు అయ్యప్పన్(శ్రీదేవి తల్లిదండ్రుల తరపు) కుటుంబసభ్యుల తరపున ఈ ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 9-30 గంటల నుంచి 12-30 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం శ్రీదేవి భౌతికకాయాన్ని ముంబయి (అంధేరి పశ్చిమ) లోఖండ్‌వాలాలోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఉంచనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అంతిమయాత్ర ప్రారంభిస్తారు. విలేపార్లే సేవాసమాజ్ హిందూ శ్మశానవాటికలో 3-30 గంటలకు అంత్యక్రియల కార్యక్రమం ప్రారంభమవుతుంది.అయితే మహానటి శ్రీదేవి మృతి వెనుక దాగిన అసలు రహస్యం మాత్రం వెలుగుచూడలేదన్న వాదన అభిమానుల్లో వ్యక్తమవుతూనే ఉన్నది.

55 ఏండ్లకే ముగిసిన జీవనయానం
అభిమానుల మనసుల్లో చిరస్మరణీయం

1963, ఆగస్టు 13న తమిళనాడులోని శివకాశిలో జన్మించిన శ్రీదేవి జీవిత ప్రయాణం 2018,ఫిబ్రవరి 24న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌లో ముగిసింది. నాలుగేండ్ల వయసులో(1967లో) తమిళ చిత్రం కందన్‌కరుణైలో వెండి తెరపై మొదటిసారి కనిపించిన శ్రీదేవి ఆరేండ్ల వయసులో(1969లో) బాలనటిగా తునైవన్ అనే తమిళ చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు. తెలుగు, తమిళ, మళయాల, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 300 చిత్రాల్లో ఆమె నటించారు. 2017లో హిందీ చిత్రం మామ్‌తో ఆమె వెండితెర ప్రయాణం ముగిసింది. హిందీ చిత్ర నిర్మాత బోనీకపూర్‌ను 1996లో వివాహమాడిన శ్రీదేవికి జాన్వి, ఖుషి.. ఇద్దరు కుమార్తెలు. సినీ జగత్తులో అతిలోక సుందరిగా, లేడీ సూపర్ స్టార్‌గా, లెజెండరీ నటిగా పేరున్న శ్రీదేవి ఆమె అభిమానుల మనసుల్లో ఎప్పటికీ ఉంటారు.

అభివృద్ధి సంపూర్ణంగా ఉండాలి

- ప్రిన్స్ ఆగాఖాన్‌కు గవర్నర్ సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అభివృద్ధి కార్యక్రమాలు సంపూర్ణంగా, సమర్థవంతంగా చేపట్టాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ అభిప్రాయపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రిన్స్ కరీం ఆగాఖాన్ తనను రాజ్‌భవన్‌లో కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగాఖాన్ అభివృద్ధి నెట్‌వర్క్(ఎకేడీఎన్) చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఆగాఖాన్ అకాడమీ బహుముఖ కార్యక్రమాలు చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా విద్య, ఆరోగ్యరక్షణ రంగాల్లో శ్రద్ధపెట్టడం మంచి పరిణామమని వ్యాఖ్యానించారు. దేశ సంస్కృతి, చరిత్రను తెలియజేసే ప్రాచీన కట్టడాలను సంరక్షించడం మంచి విషయమన్నారు. ప్రిన్స్ అగాఖాన్ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సంస్థలో రోబోట్ సోఫియా పాల్గొని మాట్లాడిన విషయాన్ని గవర్నర్‌తో ప్రస్తావించారు. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం రంగాల్లో మరింత కృషి చేస్తున్నామని గవర్నర్‌కు ప్రిన్స్‌కు వివరించారు. నానో సాంకేతిక పరిజ్ఞానం, అంకాలజీ, క్యాన్సర్ సంబంధిత వ్యాధుల చికిత్స నొప్పిలేకుండా సున్నితంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈవ్యాధులకు మూలం తీరికలేకపోవడం, ఒత్తిడితో కూడిన జీవితం, అనారోగ్య పోటీతత్వం కూడా అని ఇరువురు చర్చించుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలు చేపట్టనున్నట్టు గవర్నర్‌కు ప్రిన్స్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్ అగాఖాన్‌కు గవర్నర్ మొమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి హర్‌ప్రిత్ సింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ బి. అరవింద్‌కుమార్‌తోపాటు అగాఖాన్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసవ వేదన

నవతెలంగాణ-గూడూరు

నేలవంచకు చెందిన మూతి వజ్జయ్య, వజ్జమ్మ దంపతుల కూతురు మూతి సుమలతను గతేడాది మట్టెవాడ పంచాయతీ పరిధిలోని కొంగరి గిద్ద గ్రామానికి చెందిన బండ నరేష్‌కు ఇచ్చి పెండ్లి చేశారు. సుమలత గర్భం దాల్చడంతో నేలవంచ వచ్చింది. మంగళవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో సుమలతను భర్త నరేష్, తండ్రి వజ్జయ్యలు జోలె కట్టి మూడు కిలోమీటర్లు గుట్టపై నుంచి మోసుకొచ్చారు. మోసుకొస్తున్న క్రమంలో సుమలత పడిన కష్టాలు వర్ణనాతీతమని వారు వాపోయారు. కష్టంమీద గుట్టకిందకు తీసుకొచ్చి 108కు ఫోన్ చేశారు. మట్టెవాడ ప్రాంతానికి 108వాహనం రాగా మహబూబాబాద్ ప్రాంతీ యాస్పత్రికి తరలించారు. అక్కడ ఆ మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. నేలవంచకు రహదారి వేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

అనుమతి ఉంటుంది. ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9,63,546 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,55,635 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,911 మంది విద్యార్థులున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,294 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు 527, ప్రయివేటు విద్యాసంస్థలు 767 ఉన్నాయి. 1,294 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 1,294 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. పరీక్షల కోసం 25,395 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. డీఐఈవో కన్వీనర్‌గా జిల్లా పరీక్ష కమిటీ (డీఈసీ), కలెక్టర్ ఛైర్మెన్‌గా, ఎస్పీ, ఆర్జేడీ, డీఐఈవోలతో కలిపి జిల్లా ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ జరగకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 50 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. https://admi.tsbie.cgg.gov.in, https://tsbie.cgg.gov.in, bietelangana.cgg.gov.in వెబ్‌సైట్‌ల నుంచి విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఏమైనా సమస్యలుంటే 040-24601010, 24732369 నెంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ప్రాణం పోయినా.. ప్రయివేటుకివ్వం

నవతెలంగాణ - పెద్దపల్లి ప్రతినిధి/ ఆదిలాబాద్

రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ సంస్థలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రయివేటీకరణ చేయబోమని స్పష్టం చేశారు. గత సర్కారోళ్లు ఈ సంస్థలను దివాలా తీయించేందుకు యత్నించారని, తెలంగాణ రాష్ట్రంలో బతికించుకుంటున్నామని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు రద్దయినందున దానికి బదులు కారుణ్య నియామకాలతోనే భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అందుకు మార్చి మొదటి వారంలో మెడికల్‌బోర్డు ఏర్పాటు చేస్తామని, దానికి సంబంధించి కసరత్తు చేయాలని సీఎండీకి శ్రీధర్‌ను ఆదేశించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇది మరో అవకాశమన్నారు. గతంలో మెడికల్ బోర్డులో వైద్యులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కూడా అవినీతికి పాల్పడ్డట్టు సమాచారం ఉందని, ఇకపై దానికి తావులేదని చెప్పారు. మెడికల్ బోర్డులో సింగరేణి వైద్యులే కాకుండా గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఆస్పత్రుల వైద్యులను కూడా నియమించనున్నట్టు చెప్పారు. సింగరేణి ఉద్యోగాల కోసం ఎవరైనా లంచాలు అడిగితే చెప్పుతో కొట్టాలని సూచించారు. రిటైర్డ్‌మెంట్ కార్మికులకు గతంకంటే పింఛను ఎక్కువ చేసి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

శిథిలావస్థకు చేరిన క్వార్టర్లకు మరమ్మతులు చేయిస్తామని, నూతనంగా 150 ఎకరాల్లో పదివేల ఇండ్లను 400 కోట్లతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గత ఎన్నికల హామీలను త్వరలోనే అమలు చేస్తామని, సాంకే తికపరమైన 720 ఉద్యోగ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామ న్నారు. ఇప్పుడు శంకుస్థాపన చేసిన ఆరు భూగర్భ గనుల్లో 6500 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశమున్నదని చెప్పారు. అంతకుముందు ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చేరుకున్న సీఎం.. శ్రీరాంపూర్ పరిధిలోని సిర్కే, నాగార్జునకాలనీలోని ఇండ్లను పరిశీలించారు. ఆరు భూగర్భగనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రారంభించారు.

రామగుండం ఎత్తిపోతలకు శంకుస్థాపన

గతంలో తలాపున గోదావరి నది ఉన్నా పంటలు ఎండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందని సీఎం కేసీఆర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలో మురుమూర్ గ్రామం వద్ద రామగుండం ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే గోదావరి నది 200 కిలోమీటర్లకు పైగా 600 టీఎంసీల నీటితో ఎల్లప్పుడూ నిండుకుండలా ఉంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో 365 రోజులూ ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీరు ఉంటుందని అన్నారు. ఈ ప్రాంత రచయిత సదాశివుడు 'తలాపున పారుతుంది గోదావరి, మన చేను, చెలక ఎడారి' అని రచించారని, ఉద్యమ సమయంలో బాధతో ఈ పాట పాడుకున్నామని గుర్తు చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో పున:ప్రారంభం ద్వారా ఐదువేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో కేటాయించిన ప్రకారం రామగుండం ఎన్టీపీసీ నాలుగువేల మెగావాట్ల ప్రాజెక్టులో మొదటిదఫా 1600మెగావాట్ల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మంత్రి ఈటల రాజేందర్ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తూ నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి వచ్చే వర్షాకాలం నాటికి సాగునీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఈటల రాజందర్, జోగురామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు కె.కేశవరావు, బాల్కసుమన్, సీఎం అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్, అంతర్రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జి.వివేక్, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

దేశంలో ప్రస్తుత అశాంతికి ఆ పార్టీలే కారణం..: సీఎం

'నేటి పరిస్థితులకు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు సిగ్గుతో తలదించుకోవాలి. ఆ పార్టీలపై నేను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నాను. దేశంలో ప్రస్తుత అశాంతికి కచ్చితంగా ఆ పార్టీలే కారణం. అప్పుడు ఆ నాయకులేం చేశారు? గాడిద పండ్లు తోమారా? పంటలకు కనీస మద్దతు చెల్లిస్తే వారి తాతముల్లె పోతుందా? రైతాంగం సహనం కోల్పోతోంది. కేంద్రం పట్టింపులేనితనంపై రైతులు నిలదీయాలి' అని సీఎం కేసీఆర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్న చనాక-కోర్టా బ్యారేజీ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కరీంనగర్ రైతు సదస్సులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్నారు. పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించకుండా బీజేపీ ప్రభుత్వం రైతుల సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. పలుమార్లు ప్రధానమంత్రి మోడీని కలిసి విన్నవించినా పట్టించుకోలేదని, ఈ విషయంపై పార్టీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలిపారు. ఆదివాసీ తెగల మధ్య స్వార్థ రాజకీయ పార్టీలు గొడవలు సృష్టిస్తున్నాయన్నారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని, అనవసరంగా కొట్లాడుకోవద్దని సూచించారు.

ఆదిలాబాద్‌లో హాజరైన జనం (అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్)




సీఎం హెలికాప్టర్‌లో పొగలు

కరీంనగర్‌లో సీఎం కేసీఆర్ నివాసం నుంచి పెద్దపల్లికి బయల్దేరే సమయంలో హెలికాప్టర్‌లోని కిట్‌బ్యాగ్‌లో పొగలు రావడం కలకలం రేపింది. సరిగ్గా సీఎం ఎక్కే సమయంలో వైర్‌లెస్ సెట్ ఉన్న బ్యాగులో పొగలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ బ్యాగును బయటకు తీసుకెళ్లి దూరంగా పడేశారు. బ్యాటరీ ఓవర్ హీట్ కావడంతో బ్యాగ్ నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడినట్టు అధికారులు గుర్తించారు. అయితే ఈ ఘటనపై మంత్రి కేటీఆర్ అధికారులతో చర్చించి విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు ఆదిలాబాద్ డైట్ కాలేజీలో ఏర్పాటు చేసిన సభ వద్ద అనుమానాస్పదంగా ఓ పూలకుండీ కనిపించడంతో బాంబుస్క్వాడ్ దాన్ని బయటకు తీశారు.

ముఖ్య మంత్రి పర్యటనకు ముందే అరెస్టులు

మంచిర్యాల జిల్లాలో సీఎం పర్యటన సందర్భంగా పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. శ్రీరాంపూర్ బహిరంగ సభ నేపథ్యంలో సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐటీయూసీ, కాంగ్రెస్, జేఏసీ నాయకులను అరెస్ట్ చేసి బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లక్షెట్టిపేటలో ఎస్‌ఎఫ్‌ఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దుంపల రంజిత్‌తో పాటు జిల్లా కార్యదర్శి గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులను అరెస్ట్ చేశారు. మందమర్రి, నస్పూర్ మండలంలోనూ పలువురు సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. బెల్లంపల్లి పీఎస్‌లో కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై మాట్లా డకపోవడం బాధాకరమన్నారు. ఇకనైనా తన వైఖరిని మార్చుకుని కార్మికుల సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు.



సెన్సెక్స్ ▼ 99	నిఫ్టీ ▼ 28	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,346	10,554	64.88	రూ. 30,320	రూ. 41,600

కోడిగుడ్లు

హైదరాబాద్	358	విజయవాడ	348
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	397
వరంగల్	357	ముంబయి	406

గూగుల్‌తో జట్టుకట్టిన ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: భారత్‌లో అతి తక్కువ ధరకే ఆండ్రాయిడ్ ఆధారిత స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తెచ్చేందుకు గాను ఎయిర్‌టెల్ సంస్థ ఇంటర్‌నెట్ దిగ్గజం గూగుల్‌లు జట్టుకట్టాయి. భారత్‌లో అతి తక్కువ ధరలో ఆండ్రాయిడ్ ఓరియో('గో' ఎడిషన్) స్మార్ట్ ఫోన్‌ను అందించేందుకు గూగుల్‌తో ఎయిర్‌టెల్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఎయిర్‌టెల్ 'మేరా పెహలా స్మార్ట్‌ఫోన్' (నా తొలి స్మార్ట్‌ఫోన్)లో భాగంగా ఆండ్రాయిడ్ ఓరియో వెర్షన్‌తో పనిచేసే బేసిక్ 4జీ స్మార్ట్‌ఫోన్లను మార్చి నుంచి ఈ సంస్థలు అందుబాటులోకి తేనున్నాయి. ఇందులో భాగంగా దేశీయ మొబైల్ కంపెనీలైన లావా, మైక్రోమ్యాక్స్ తొలి సెట్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేయబోతున్నాయి. ఈ ఫోన్లలో ఎయిర్‌టెల్‌కు చెందిన మై ఎయిర్ టెల్ , ఎయిర్‌టెల్ టీవీ, వింక్ మ్యూజిక్ వంటి అప్లికేషన్లు ప్రీలోడెడ్‌గా లభిస్తాయి. 1జీబీ ర్యామ్ అంతకంటే తక్కువ సామర్థ్యంతో రూపొందించిన స్మార్ట్‌ఫోన్ల కోసం ఆండ్రాయిడ్ ఓరియో (గో ఎడిషన్)ను ప్రత్యేకంగా రూపొందించారు. దీంతో పాటు ఈ ఎడిషన్ కోసం రూపొందించిన యాప్స్ వేగంగా పనిచేస్తూ అతి తక్కువ డేటాను వినియోగిస్తాయి.

25,000 కోట్లకు ప్రీస్కూళ్ల వ్యవస్థ



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలో ప్రీస్కూల్ వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని లిటిల్ మిలేనియమ్ ఎడ్యుకేషన్ సంస్థ సీఈవో రమణ్ బజాజ్ అన్నారు. ఈ పరిశ్రమ 2020 నాటికి దాదాపు రూ.25,000 కోట్లకు చేరువయ్యే అవకాశం ఉన్నట్టుగా ఆయన వివరించారు. మొత్తం విద్యా వ్యవస్థలో ఈ విభాగం ఏడాదికి 20 శాతం వృద్ధితో ఎదుగుతోందని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 100 నగరాల్లో దాదాపు 500 స్కూళ్లను నిర్వహిస్తున్న తమ సంస్థ.. ఇక దక్షిణాదిలో విస్తృతంగా విస్తరించనున్నట్టుగా పేర్కొంది.

10వేల అవుట్‌లెట్లకు విస్తరణ: అజాఫ్రాన్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: రానున్న ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా దాదాపు 10,000 రిటైల్ అవుట్‌లెట్లకు విస్తరించాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా సేంద్రీయ సమీకృత చర్మ సంరక్షణ ఉత్పత్తుల సంస్థ అజాఫ్రాన్ ఇన్నోవేషన్స్ వెల్లడించింది. దేశంలో 20 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న అన్ని పట్టణాలు, నగరాలు, మెట్రోల్లోని అన్ని కీలక అవుట్‌లెట్లలో తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని భావిస్తున్నట్టుగా కంపెనీ వ్యాపార విభాగం అధినేత టి.ఆర్. సురేష్ తెలిపారు.

దివాలా..!



- పీఎన్‌బీ మోసంలో సరికొత్త ట్విస్ట్
- బ్యాంక్రప్టసీ బాటలో మోడీ 'ఫైర్‌స్టార్'
- అమెరికాలోని కోర్టులో పిటిషన్ దాఖలు
- లిక్విడిటీ, సప్లయి సమస్యలతో కుదేలట!
- ఆర్థికంగా చితికిపోయినట్టుగా 'సూట్'
- 665 కోట్ల విలువైన ఆస్తి-అప్పుల వెల్లడి

న్యూయార్క్/ న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) భారీ మోసానికి పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ.. చట్టాలలోని లొసుగులను ఆసరాగా చేసుకొని ఈ వివాదంలోంచి బయటపడేలా పావులు కదుపుతున్నాడు. తన వ్యూహంలో భాగంగా ఆయన పీఎన్‌బీ మోసాలకు కేంద్ర బిందువుగా నిలుస్తూ వస్తోన్న ఆయన ఫ్లాగ్‌షిప్ కంపెనీ ఫైర్‌స్టార్ డైమండ్స్ సంస్థ దివాలా తీసినట్టుగా వెల్లడించారు. తమ సంస్థ ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటోందని ఈ నేపథ్యంలో ఫైర్‌స్టార్ డైమండ్స్‌ను అధికారికంగా దివాలా సంస్థగా ప్రకటించాలంటూ మోడీ సంస్థ అమెరికాలోని దక్షిణన్యూయార్క్ జిల్లా దివాలా కోర్టును ఆశ్రయించింది. లిక్విడిటీ, సప్లయి చైన్‌లో ఎదురైన సవాళ్ల నేపథ్యంలో తాము ఆర్థికంగా చితికిపోయినట్టుగా ఫైర్‌స్టార్ సంస్థ కోర్టుకు వెల్లడించింది. దివాలా పిటిషన్‌లో భాగంగా ఫైర్‌స్టార్‌కు చెందిన ఎ.జెఫే వెడ్డింగ్ జ్యువెల్లరీ, ప్యాటసీ ఐఎన్‌సీ సంస్థలు కూడా నష్టాల్లో ఉన్నాయని సంస్థ పిటిషన్‌లో పేర్కొంది. దీంతో వాటిని కూడా దివాలాగా ప్రకటించాలని కోర్టును వేడుకున్నారు. ఈ సంస్థలకు అమెరికా, ఐరోపాతో పాటు మధ్య ప్రాచ్య దేశాలలో వజ్రాల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయి. తమ సంస్థ వద్ద దాదాపు రూ.665 కోట్లకు సమానమైన ఆస్తులు, అప్పులు ఉన్నట్టుగా దివాలా పిటిషన్ చాప్టర్ -11లో నీరవ్ పేర్కొన్నారు. పిటిషన్ నేపథ్యంలో అమెరికా కోర్టు గనుక 'ఫైర్‌స్టార్'ను దివాలా ప్రకటిస్తే పీఎన్‌బీ మోసపోయిన మొత్తాన్ని ఆ బ్యాంకు వసూలు చేసుకోవడం గగనతరం కానుంది. దివాలా తీసినట్టు ప్రకటించిన సంస్థల నుంచి న్యాయపరంగా రావాల్సిన మొత్తాన్ని వసూలు చేసుకోవడం కష్టం. దివాలాదారుపై ఇతర సంస్థలు బలవంతపు వసూళ్లకు పాల్పడకుండా చట్టాలు సదరు సంస్థకు, దాని ప్రమోటర్లకు రక్షణ కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో నీరవ్ నుంచి పీఎన్‌బీ మోసానికి సంబంధించిన నిధుల సమీకరణ కష్ట సాధ్యం కానుంది.

52 వారాల కనిష్టానికి స్టాక్..

నీరవ్ మోడీ సంస్థ దివాలా వార్తలతో పాటు వజ్రాల వ్యాపారి మోసం విలువ మరో రూ.1400 కోట్ల వరకు పెరిగినట్టుగా పీఎన్‌బీ ప్రకటించిన నేపథ్యంలో ఆ బ్యాంకు షేర్లు మంగళవారం దాదాపు 12 శాతం మేర పతనమయ్యాయి. ఉదయం రూ.107.80 గరిష్ట స్థాయి వద్ద ప్రారంభమైన ఈ స్టాక్ ట్రేడింగ్ ఆ తరువాత ఏ దశలోనూ కోలుకోకుండా రూ.96.10కి దిగజారింది. చివర్లో కొంత మేర పుంజుకొని రూ.98.35 వద్ద ముగిసింది. దీంతో మంగళవారం ఒక్కరోజే ఈ స్టాక్ దాదాపు రూ.13.55 మేర కుంగినట్టయింది. ఇది 52 వారాల కనిష్టం కావడం గమనార్హం.

రూ.13వేల కోట్లకు పెరిగిన మోసం..

వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పీఎన్‌బీ బ్యాంక్‌కు చేసిన మోసం విలువ మరింత పెరిగింది. ఈ బ్యాంక్ రికార్డుల పరిశీలన జరుగుతున్న కొద్ది మోడీ మోసాల విలువ పెరుగుతూ వస్తోంది. తాజాగా మోడీ మోసం విలువ మరో రూ.1300 కోట్ల మేర పెరిగినట్టుగా బ్యాంక్ తన తాజా ఫైలింగ్స్‌లో పేర్కొంది. దీంతో నీరవ్ మోడీ పీఎన్‌బీ మోసం విలువ మొత్తం రూ.11,400 కోట్ల నుంచి దాదాపు రూ.13,000 కోట్లకు చేరువైనట్టుగా పీఎన్‌బీ బీఎస్‌ఈ ఫైలింగ్‌లో వెల్లడించింది.

మోసగాళ్లా.. సుద్దులు చెప్పేది!

- ప్రభుత్వ బ్యాంకుల్లో ఎగవేత ఎవరి పాపం!
- ప్రయివేటుతోనే బ్యాంకులకీ దుస్థితి
- పీఎస్‌బీల్లోనే మేటి మెరుగైన విధానాలు
- వారి సేవలు ఫలితమాశించని దేశ సేవ
- ప్రయివేటీకరణే సమస్యకు పరిష్కారం కాదు: ఎస్‌బీఐ అధినేత రజనీశ్ తీవ్ర ఆవేదన



న్యూఢిల్లీ: దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) పరిపాలనా విధానాలు, ప్రమాణాలు సరిగ్గా లేవని.. వాటిని వెంటనే ప్రయివేటికరించాలని డిమాండ్ చేస్తున్న వారిపై భారతీయ స్టేట్ బ్యాంక్ ఛైర్మెన్ రజనీశ్ కుమార్ సీరియస్ అయ్యారు. ప్రభుత్వ సంస్థలు అత్యున్నత పరిపాలనా ప్రమాణాలు పాటిస్తున్నాయని.. ఇప్పుడున్న మొండి బకాయిలు, తక్కువ స్థాయి ప్రమాణాలున్న కేసులు దాదాపు ప్రైవేటు రంగంలోనే ఎక్కువగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. 'ప్రైవేటు రంగ సంస్థల్లో కార్పొరేట్ పరిపాలనా విధానాలు చాలా బాగుంటే.. ప్రస్తుతం లా ట్రైబ్యునల్ వద్ద ఉన్న కంపెనీలన్నీ ప్రైవేటువే కదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ రంగంలోని ఏ ఒక్క సంస్థ కూడా ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) కేసుల జాబితాలో లేదని ఆయన అన్నారు.

పరిశ్రమ వర్గాలపై మండిపాటు

బ్యాంకులను ప్రయివేటీకరించాలని కోరుతున్న పరిశ్రమ వర్గాల వారిపై కూడా రజనీశ్ విరుచుకుపడ్డారు. పరిశ్రమ సంఘాల్లో ముందు వరుసలో కూర్చొనే వారిలోనే చాలా మంది ఎగవేతదారులున్నారని అన్నారు. రుణ ఎగవేతదారులంతా వారి పరిశ్రమలకు సంబంధించిన సంఘాల్లో ముందు వరుసలో కూర్చొని అందరికీ హితబోధ చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక అంశాలపై జరిగే సమావేశాల్లో ఎగవేతదారులంతా ముందు వరుసలో కూర్చుంటే.. బ్యాంకర్లంతా వెనక వరుసలో కూర్చోవాల్సి రావడం పట్ల ఆయన తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. 'అద్దాల మేడల్లో ఉండేవారు అవతలి వారిపై రాళ్లు విసరొద్దు' అని ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటు పరం చేయాలని డిమాండ్ చేస్తున్న విమర్శకులకు సూచించారు.

బ్యాంకింగ్ వ్యవస్థను నిందించొద్దు

పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల మోసం నేపథ్యంలో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ రంగ సంస్థలపై విమర్శలు చేస్తున్న వారిపై రజనీశ్ ప్రతి విమర్శలు చేశారు. సమాజం మెరుగుపడేందుకు ప్రభుత్వ సంస్థలు కచ్చితమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. 'పట్టణాలకు దూరంగా, పల్లెల్లో, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో శాఖలను నడుపుతున్న ప్రైవేటు సంస్థలు ఏమైనా ఉన్నాయా' అని ఆయన ప్రశ్నించారు. పీఎన్‌బీ ఉదంతంతో మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థను నిందించడాన్ని సబబు కాదని అన్నారు.

ఒంటిపూట బడులు ఉంటాయా..?

- మౌనంవీడని విద్యాశాఖ అధికారులు
- టీచర్స్ యూనియన్స్ విజ్ఞప్తులు పక్కకేనా!



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాలల్లో ఒంటిపూట బడుల నిర్వహణ ప్రకటనపై విద్యాశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మార్చినెల ప్రారంభమ వుతున్నా, ఇప్పటికీ ఓ నిర్ణయం తీసుకోలేదు. ఎండలు తీవ్రత నేపథ్యంలో మార్చి 12లేదా 15నుంచి ఒంటిపూట బడులు పెట్టాలని ఉపాధ్యాయ సంఘాలు..పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధి కారులకు విజ్ఞ ప్తులు చేశాయి. అయినా అధికారుల్లో మాత్రం ఇప్పటికీ ఎలాంటి చలనం కనిపించడం లేదు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం 2017-18 విద్యాసంవత్సరాన్ని ఏప్రిల్ 12న ముగించి, 13 నుంచి సెలవులు ఇవ్వాల్సి ఉంది. అయితే ఒంటిపూట బడుల ప్రస్తావన దాంట్లో చేయ లేదు. పాఠశాల విద్యాశాఖ గత విద్యాసంవత్సరం కొత్త అకడమిక్ క్యాలెండర్ తయారుచేసి అబాసుపాలైంది. ఎండలు తీవ్రమైనా బడులకు మాత్రం సెలవులు ప్రకటించలేదు. ఏకంగా సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని, పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ఆదేశించిన తర్వాతగానీ వారిలో చలనం కనిపించలేదు. ఈ విద్యాసంవత్సరం ముందస్తుగానే ఒంటిపూట బడుల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని ప్రధానమైన ఉపాధ్యాయ సంఘాలన్నీ ప్రభుత్వ పెద్దలకు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కూ గత వారం నుంచి విజ్ఞప్తులు చేస్తున్నాయి. ఇప్పడే ఎండలు మొదలయ్యాయి. మార్చి రెండో వారం నుంచి ఎండల తీవ్రతతో పాటు ఉక్కపోత తీవ్రమయ్యే అవకాశముంది. చాలా పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, గదుల్లో ఫ్యాన్లు, తాగునీరు సరిగా లేదు. దీంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యే అవకాశమూ లేకపోలేదు. ఈ క్రమంలో గతంలో మాదిరిగానే పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే ఇంట్లో కంటే బడుల్లోనే విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా ఉంటుందని విద్యాశాఖ అధికారులు వాదిస్తున్నారు. దీంతో ఒంటిపూట బడుల నిర్వహణపై సందిగ్ధం నెలకొన్నది. దీనిపై విలేకరులు వివరణ కోరేందుకు ప్రయత్నించినా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ స్పందించలేదు.

బీఆర్‌ఓలకే బడ్జెట్ పరిమితం

- రూ.41,056 కోట్ల కేటాయింపులు.. వ్యయం రూ. 18, 819 కోట్లు

నాలుగేండ్లలో 47 శాతమే సబ్‌ప్లాన్ నిధుల వినియోగం



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

దళితుల అభివృద్ధి విషయంలో పాత విధానాలే కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్టు కేటాయింపులు ఘనంగా ఉన్నా వాటిని దళిత సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. తెలంగాణ రాష్ట్రంలోనూ అవే పునరావృతమవుతున్నాయి. వార్షిక బడ్జెట్‌లలో భారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ నిధుల వ్యయం మాత్రం గడప దాటడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నామ మాత్రంగా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లు (బీఆర్‌వోలు) విడుదల చేసి సర్కారు చేతులు దులుపుకుంటుందన్న దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ నాలుగేండ్లలో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు ఆయా వార్షిక బడ్జెట్‌లలోరూ.41,056 కోట్లు కేటాయించింది. కేటాయించిన మొత్తంలో 47 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేసింది. ఉప ప్రణాళిక నిధుల వ్యయంపై శ్రద్ధ చూపకపోవడంతో గత నాలుగేండ్ల బడ్జెట్‌ల్లో కేటాయించిన వేలాది కోట్లు మురిగిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రం నిధుల క్యారీఫార్వర్డ్ చేసుకునేందుకు సబ్‌ప్లాన్ చట్టాన్ని సవరించిన విషయం తెలిసిందే. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ ఉప ప్రణాళిక కోసం 38 శాఖలను కలుపుకొని ప్రభుత్వం రూ. 8,099,28 కోట్లు, 2016-17లో రూ.10,483 కోట్లు, 2017-18లో 14,375 కోట్లు కేటాయించింది. ఈ మూడు బడ్జెట్‌లలో కేటాయించిన నిధుల్లో కేవలం 48 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేసింది. ప్రధానంగా ఈ వార్షిక బడ్జెట్‌లో దళిత ప్రత్యేకాభివృద్ధి నిధి కింద కేటాయించిన రూ.14,375 కోట్లలో ఇప్పటి వరకు రూ.7,980 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మరి కొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ లోపు మిగిలిన రూ.6,395 కోట్లు దళిత సంక్షేమానికి ఖర్చు చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయి. జీఓలు విడుదల చేసి చేతులు దులుపుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో నిధులు ఖర్చు చేసినట్టుగా ప్రచారం చేసుకోవడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సబ్‌ప్లాన్ నిధుల వినియోగం లెక్కలు చూస్తుంటే దళితుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి ఏ పాటిదో అర్ధమవుతుంది.

నిధులు విడుదలపై శాఖల నిర్లక్ష్యం

ప్రభుత్వంలోని వివిధ శాఖలకు కేటాయించిన మొత్తంలో 16 శాతం నిధలను ఎస్సీ సబ్‌ప్లాన్‌కు, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు9 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. అన్ని శాఖలకు పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరిగినా ఇప్పటికీ కొన్ని శాఖలు సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయ లేదు. ప్రధానంగా ఆయుష్, ఇంజనీర్ ఇన్ చీఫ్ బిల్డింగ్, హెల్త్ మెడికల్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ(ఎయిడ్స్), లేబర్, రిజిస్టార్ ఆఫ్ హైకోర్టు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, యూత్ అడ్వాన్స్‌మెంట్ సర్వీసెస్ శాఖలు మాత్రం ఎస్సీ ఉప ప్రణాళికకు రూపాయి కూడా విడదల కాలేదు.

ఎస్టీలదీ అదే పరిస్థితి

ఎస్టీ ఉప ప్రణాళిక నిధుల వ్యయంలోను అదే ఇదే తంతు కొనసాగుతున్నది. ఈ మూడేండ్లలో ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.19,371 కోట్లు కేటాయించగా అందులో నుంచి రూ. 10,220 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. 2015-16 బడ్జెట్‌లో ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.5035 కోట్లు, 2016-17లో రూ.6171 కోట్లు, 2017-18లో రూ. 8,165 కోట్లు కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటా యించిన నిధుల్లో ఇప్పటి వరకు రూ.3,675 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

మూడేండ్లలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చు

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చులు (రూ. కోట్లలో)
2014-15	8,099	1200
2015-16	8,099	3,250
2016-17	10, 483	6389
2017-18	14,375	7,980

ప్రాజెక్టులతో నీటికష్టాలు తీరినట్టే

- పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లిజిల్లాల్లో ఎంపీ కవిత పర్యటన



నవతెలంగాణ-మంథనిటౌన్/మహదేవపూర్

గోదావరి నదిపై నిర్మిస్తున్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులతో తెలంగాణలో నెలకొన్న నీటి కష్టాలు తీరుతాయని నిజామబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేట వద్ద నిర్మిస్తున్న అన్నారం పంప్‌హౌజ్, సిరిపురం వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలో నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజీలను మిషన్ భగీరథ ఛైర్మెన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్ట మధుతో కలిసి ఆమె మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టుల పనులను పరిశీలించారు. సుందిళ్ల బ్యారేజీ వద్ద ఎంపీ కవిత మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం 25 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించిందని, గడువులోగా ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని చెప్పారు. నీటిని రివర్స్ పంపింగ్ చేసేందుకు ఎనిమిది మోటార్లకుగాను అదనంగా నాలుగు మోటార్లను ఏర్పాటు చేశామన్నారు. తద్వారా ఎత్తిపోతలకు ఇబ్బందులు తలెత్తవన్నారు. దేశంలోనే మొదటిసారిగా రోజుకు రెండు టీఎంసీల నీటిని రివర్స్ పంపింగ్ చేయనున్నట్టు తెలిపారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం గోదావరి జలాలను ప్రణాళిక ప్రకారం వినియోగంలోకి తెస్తోందని అన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణం భేష్ : సిద్ధి రాజు, కర్నాటక మీడియా అకాడమీ ఛైర్మెన్

వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం భేష్ అని కర్నాటక మీడియా అకాడమీ ఛైర్మెన్ సిద్ధి రాజు కొనియాడారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ, కాసిపేట పంప్‌హౌజ్‌లను తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిద్ధిరాజు మాట్లాడుతూ.. తెలంగాణలో ఇంత పెద్ద ప్రాజెక్టు నిర్మించడం గొప్ప విషయమన్నారు. కర్నాటకలో కృష్ణానది పరివాహక ప్రాంతం వ్యవసాయపరంగా అభివృద్ధి చెందిందన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకే జీవనాడి అని అభివర్ణించారు. గోదావరి నీటిని వినియోగించుకునేందుకే ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. వారి వెంట సీనియర్ పాత్రికేయులు పల్లె రవి, టంకశాల అశోక్, గౌరీశంకర్, సాగర్, ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో దోపిడీ పాలన

- మిషన్ భగీరథ, కాకతీయ పేరుతో ఖజానా స్వాహా
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కేసీఆర్‌ది కుటుంబ పాలన : కుంతియా
- తాండూరులో ప్రజా చైతన్య బస్సుయాత్ర



నవతెలంగాణ-తాండూరు

రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య బస్సు యాత్ర మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నో ఆకాంక్షలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కుటుంబానికే సొంతమైందని అన్నారు. సీఎంగా కొనసాగే అర్హత కేసీఆర్‌కు ఏమాత్రమూ లేదన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనుల్లో ఆరు శాతం కమీషన్లు తీసుకుని జేబులు నింపుకుంటున్నారే తప్ప ప్రజలకు చేస్తున్నదేమీ లేదని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా మాట్లాడుతూ కేసీఆర్‌కు నాలుగేండ్లుగా రైతులు గుర్తు రాలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండడం, కాంగ్రెస్ బస్సుయాత్ర ప్రారంభించడంతో రైతులపై కపట ప్రేమ చూపిస్తూ అమలుకు సాధ్యంకాని హామీలిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ చేస్తున్న మోసాలను ప్రజలకు తెలిపేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర ప్రారంభించినట్టు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మారుస్తామని ప్రకటించారు. బస్సు యాత్ర సంగారెడ్డిలోనూ కొనసాగింది. అక్కడా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో నాయకులు జానారెడ్డి, షబ్బీర్ అలీ, రేవంత్‌రెడ్డి, వి.హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈవో ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో) గ్రేడ్-2 ప్రొవిజినల్ ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. 851 ఏఈవో పోస్టులకు 1:3 నిష్పత్తి చొప్పున 2,044 మంది అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 2 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సాంకేతిక విద్యాభవన్‌లో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్లు నెంబర్లు, ఏయే తేదీల్లో హాజరుకావాలనే పూర్తి వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. 2017, నవంబర్ 22న ఏఈవో గ్రేడ్-2 పోస్టులకు రాతపరీక్ష జరిగిన విషయం తెలిసిందే.

ఈ మధ్య నేను నా భార్య ప్రమీలా రాణి దుబాయ్ చూడటానికి వెళ్లాం. అక్కడ బుర్జ్ ఖలీఫాను చూడటానికి టికెట్ బుక్ చేసుకున్నాం. ఏ సమయంలో చూడడానికి రావాలో కూడా వాళ్లే చెప్పేస్తారు. బుర్జ్ ఖలీఫాను చూసినపుడు నాకు కలిగిన భావాలు మీతో పంచుకోవాలని ప్రయత్నం. బుర్జ్ ఖలీఫా చూడడానికి పోవడమంటేనే ఓ రకమైన ఉద్విగ్నత. ఒకటి రెండు అంతస్తులు కాదు కదా 160 అంతస్తులు !! 2717 ఫీట్ల ఎత్తుతో ప్రపంచంలోనే ఎత్తైన కట్టడం. దీన్ని 2010 జనవరిలో ఆవిష్కరించారు. సామ్సంగ్ ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మించిన ఇంత పెద్ద కట్టడం ఆరు సంవత్సరాలలోనే పూర్తి చేయడం మామూలు విషయం కాదు కదా!! ఇది కట్టడానికి 150 కోట్ల అమెరికా డాలర్ల ఖర్చు... అంటే మన రూపాయల్లో దాదాపు 9450 కోట్లు !



ఎడారి అద్భుతం బుర్జ్ ఖలీఫా

ఈ ఆకాశసౌధంలో మొత్తం 900 అపార్టుమెంట్లు, 30000 గహాలు, 7.4 ఎకరాల విస్తీర్ణం కలిగిన తొమ్మిది హెూటళ్లు, దుబాయ్ మాల్, 30 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. బుర్జ్ ఖలీఫా చుట్టూ సరస్సు ఉండేలా కట్టడం విశేషం. దుబాయ్ ప్రధాన వ్యాపార కేంద్రానికి సమీపంలో ఉండే షేక్ జాయేద్ రోడ్ వెంబడి 'మొదటి కూడలి' వద్ద డౌన్‌టౌన్ దుబాయ్ పేరుతో పిలిచే కొత్త గా (490-ఎకరాల) ప్రధాన అభివద్ధి ప్రణాళికలో భాగంగా బుర్జ్ ఖలీఫా ను నిర్మించారు. దారిలో పోతుంటే ఏర్పాటు చేసిన ఫొటోల వల్ల తెలుస్తున్నది. దుబాయ్ మాల్ అని ఎంతో పేరొందిన కొన్ని వందల షాపులను చూసుకుంటూ బుర్జ్ ఖలీఫాను చూడడానికి వెళ్లాం. టికెట్ తీసుకున్న తర్వాత చాలా దూరం నడవాలి. మేం పోయినపుడు సందర్శకులు తక్కువగానే ఉన్నారు. ఈ నిర్మాణానికి ముందు నాలుగు సహస్రాబ్దాలపాటు మధ్యప్రాచ్యంలోని గిజా పిరమిడ్ ఒక్కటే ప్రపంచంలో అత్యంత ఎత్తైన మానవ నిర్మిత కట్టడంగా గుర్తింపు పొందింది. కానీ ఆ తర్వాత 1311లో ఇంగ్లండ్‌లోని లింకన్ కేథడ్రల్‌ను, గిజా పిరమిడ్ కంటే ఎత్తైన మానవ నిర్మిత కట్టడంగా తీర్చిదిద్దారు. నేడు ఈ బుర్జ్ ఖలీఫా నిర్మాణ ఫలితంగా భూమిపై అత్యంత ఎత్తైన మానవనిర్మిత కట్టడం ఉన్న ప్రదేశం మధ్యప్రాచ్య ప్రాంతంలోకి వచ్చింది.

బుర్జ్ దుబాయి కాస్త...

"బుర్జ్ దుబాయి" గా పిలిచే ఈ నిర్మాణాన్ని నేడు "బుర్జ్ ఖలీఫా" గా మారడం వెనుక గల కారణాలను అడిగినపుడు, అక్కడి నిర్వాహకులు ఆసక్తికర విషయాన్ని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన సమయం అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం ఏర్పడటం రెండూ ఒకే సమయంలో జరిగింది, ఆర్థిక సంక్షోభంతోపాటు దేశంలో మితిమీరిన భవన నిర్మాణం ఫలితంగా అధిక స్థాయిలో భవనాలు ఖాళీ కావడం, జప్తులు జరిగాయి, ఈ నేపథ్యంలో తలకుమించిన లక్ష్యాల కారణంగా దుబాయ్ అప్పుల ఊబిలో చిక్కుకుంది, దీంతో చమురు నిక్షేపాలతో సంపన్నమైన పొరుగు దేశం అబుదాబి నుంచి దుబాయ్ ప్రభుత్వం అనేక బిలియన్ల డాలర్లను రుణం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరువాత ఈ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో, కీలకమైన మద్దతు ఇచ్చిన అధ్యక్షుడు ఖలీఫా బిన్ జాయేద్ అల్ నాహ్యాన్ గౌరవార్థం ఈ టవర్‌కు "బుర్జ్ ఖలీఫా" అని పేరు మార్చినట్లు చెప్పారు.

ప్రపంచంలోనే ఎత్తైన వెలుపలి అబ్జర్వేషన్ డెక్ ఉంది . అంత ఎత్తులో ఉన్న అంతస్తులోకి లిఫ్టులో కేవలం 60 సెకన్లలో పోవడం మనకు నమ్మశక్యం కాదు. పోతున్నప్పుడు చెవులన్ని ఝుమ్మంటూ మూసుకొని పోయినట్లు ఇబ్బందులు పడ్డాం. 124 అంతస్తులోకి పోగానే అక్కడ చుట్టూ అద్దాలున్నాయి. అట్ ది టాప్ పేరుతో వెలుపలి భాగంలో నిర్మించిన అబ్జర్వేషన్ డెక్‌ను 2010 జనవరి ఐదున ప్రారంభించారు. ఈ అబ్జర్వేషన్ డెక్‌లో అభివద్ధి చేయబడిన ఆగుమెంటెడ్ రియాలిటీ పరికమైన బెహెూల్డ్ టెలిస్కోప్ ఒకటి అందుబాటులో ఉంది. దీని నుంచి బుర్జ్ ఖలీఫాకు చుట్టూ ఉండే భూభాగాన్ని వాస్తవ పరిస్థితుల్లో చూసేందుకు వీలుండడంతో పాటు, గతంలో వివిధ సమయాల్లో, వివిధ వాతావరణ పరిస్థితుల్లో తీయబడిన ఫోటోలను చూసేందుకు కూడా వీలవుతుందిక్కడ. వాటి నుండి దుబాయ్ పట్టణాన్ని చూడవచ్చు. టూరిస్టులనందరిని 124 అంతస్తు వరకే అనుమతించినా, 125 అంతస్తులోకి నడుచుకుంటూ పోవచ్చు. ఆపై అనుమతించరు. పైనుండి ఒక్కసారి దుబాయి మొత్తం చూశాం. అక్కడే కొన్ని ఫోటోలు తీసుకున్నాం. ఆ రాత్రి లైట్లతో మెరిసి పోతున్న దుబాయ్ పట్టణం చుక్కల పందిరి వేసుకున్నట్లనిపించింది. మారుతున్న ప్రపంచం అభివద్ధి నూతన బట్టలను తొడుక్కొని అందరికి చూయించడానికి ఫ్యాషన్ షో చేస్తున్నట్టుంది. చుట్టూ అద్దాలు లేకపోతే అన్న ఊహే భయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే మనం ఉన్నది ఎన్నో ప్రపంచ రికార్డులను తిరగరాసిన బుర్జ్ ఖలీఫా పైన కదా !!

రికార్డుల సొంతం ...

ప్రపంచంలోనే ఎత్తైన చోట అంటే 158 అంతస్తులో నిర్మించిన మసీదు, ప్రపంచం లోనే ఎత్తైన చోట నివసించడానికి ఇల్లు, 76 వ అంతస్తులో నిర్మించిన స్విమ్మింగ్ పూల్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చోట (144 వ అంతస్తు) లో ఉన్న నైట్ క్లబ్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వెలుపలి అబ్జర్వేషన్ డెక్ (124వ అంతస్తు), (1,483), ప్రపంచంలోనే ఎక్కడా లేని 160వ అంతస్తు, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలివేటర్లంటి ప్రపంచ రికార్డులన్నీ తిరుగరాసినవే! అలాంటి విశేషాలున్న ఒక కట్టడంపైనుండి నిలబడ్డామన్నా ఊహ మనకు ఒకింత గర్వాన్ని కలగచేస్తుంది. ఇంత ఇంజనీరింగ్ అద్భుతాన్ని సష్టించిన ఇంజనీర్ల మేధస్సును తల్చుకుంటే బాలభారతం సినిమాలో "మానవుడే మహనీయుడు" పాట గుర్తుకొచ్చింది. ఒక్కసారి రాసిన ఆరుద్రకు మనసులోనే నమస్సులు తెలుపుకున్నాను. మనిషి కన్న కలలను వాస్తవ రూపం కోసం సాంకేతికం కలబోసిన శ్రమే కదా!!

బాగా గాలులు వస్తే ఇంత ఎత్తులో ఉన్న కట్టడం ఎలా తట్టుకుంటుందన్న సాంకేతిక మైన అనుమానం నాకు మొదటినుండి వెంటాడుతూనే ఉండేది. అక్కడి వారిని అడిగితె వీచే గాలుల నుంచి ఎదురయ్యే ఒత్తిడి నివారించడం కోసం నిర్మాణ అభివద్ధి జరుగుతున్న సమయంలోనే , ఇంజనీర్లు ఈ భవన నిర్మాణాన్ని దాని అసలు నమూనా కంటే 120 డిగ్రీలు తిప్పడం జరిగిందని, అందుకే దాని ఎత్తైన ప్రాంతం వద్ద ఈ భవనం 1.5 మీటర్లు (4.9) మేర తిరిగి ఉంటుందని చెప్పారు.

అద్దాలను తూడ్చాలంటే గాలిలో వేలాడాల్సిందే!!

ఒక్కసారి 160 వ అంతస్తుపైకి చూసినపుడు చుట్టూ అద్దాలే అవుపడ్డాయి. అక్కడున్నవారిని అద్దాలను లోపలనుండైతే శుభ్రపర్చవచ్చు కానీ బయటనుండి ఎలా శుభ్రపరుస్తున్నారని అడిగినపుడు వారు చెప్పిన సమాధానం నాకైతే ఒళ్ళు గగుర్పొడిచింది. భవనంలో మొత్తం 24348 కిటికీలు ఉన్నట్లు , వాటిని బయట నుండి మాత్రమే శుభ్రపరచడానికి 36 మంది పనివారు రోజు పనిచేస్తే దాదాపు 4 నెలలు పడుతుందని చెప్పారు. లోపల నుండి శుభ్రపరిచేవారు అదనం. పైనుండే శిఖరం అంచుల్లో శుభ్రపరచడానికి ప్రత్యేక క్రేన్లను వాడుతున్నట్లు చెప్పారు. బయటనుండి శుభ్రపరిచేటప్పుడు గాలులు తట్టుకుంటూ తాళ్ల ద్వారా ఊగుతూ శుభ్రపరుస్తారట!! ఆకాశంలో పయనించే ఉపగ్రహాల్లో, అవసరాలు ముంచుకొచ్చినప్పుడు గాలిలో ఊగుతూ స్పేస్ వాక్ చేసే ఆస్ట్రోనాట్ శ్రమ ఎంత కష్టమో అందరికి తెలిసిందే. ఏ మనిషీ లేనిచోట చుట్టూ నిశ్శబ్దం రాజ్యమేలు తుంటే, విజ్ఞాన ఫలాలను ప్రజలకు అందించే తపనలో శాస్త్రజ్ఞుల త్యాగం మామూలుది కాదు. ఒకవేళ చైన్ ఊడిపోతే ఆ శూన్యంలో తిరుగుతూ ఉండాల్సిందే, కానీ చేయగలిగింది ఏమీ లేదు. ఈ శాస్త్రజ్ఞుల త్యాగాన్ని, శ్రమను తెలియచేయడానికి కనీసం చరిత్రలో గుర్తులైనా ఉన్నాయి. కానీ గాలిలో వేలాడుతూ 160 అంతుస్తుల పైభాగం నుండి అద్దాలను తుడవడం ఎంత కష్టమో కదా?! అనిపించింది.

150 అపార్టుమెంట్లూ భారతీయులివే!

మనం భారతీయులుగా ఒకింత గర్వపడే విషయం మాత్రం ఈ బుర్జ్ ఖలీఫా. దుబాయిలో స్థిరపడ్డ కేరళ వాసి 'జార్జ్ వి నెరియపరంబిల్' అనే అతను దీంట్లో 22 అపార్ట్‌మెంట్లను సొంతం చేసుకోవడం. అతని జీవితం ఎంతో మందికి ప్రేరణ కలిగిస్తూనే ఉంటుంది. కేరళలోని తిరుచూర్ దగ్గర ఓ పల్లెటూళ్లో పుట్టి వ థాగా పడేసే చింత గింజల్ని సేకరించి వాటిపైన పొట్టుని దాణాగా అమ్మినతను ఆటోమొబైల్ మెకానిక్‌గా షార్జాకు వెళ్లి ఏసీలూ, ఫ్రిజ్‌ల అమ్మకాలూ, రిపేర్ల వ్యాపారాన్ని ప్రారంభించి , నేడు గొప్ప వ్యాపారవేత్తగా 22 ఫ్లాట్‌లకు యజమానిగా మారడం ఆశ్చర్యమే !! బుర్జ్‌లో 900 అపార్ట్‌మెంట్‌లుంటే అందులో 150 వరకూ భారతీయులూ, ప్రవాస భారతీయులే కొనడం గమనార్హం.

లిఫ్ట్ వేగం ప్రపంచంలోనే ఎక్కువ ...

ఇస్లామిక్ వాస్తు పద్ధతిలో నిర్మించిన ఈ కట్టడం కింది నుండి 160 వ పై అంతస్తు లోకి చేరడానికి మొత్తం 2909 మెట్లు ఉన్నాయని ఇందులో 57 ఎలివేటర్లు, 8 ఎస్కలేటర్లున్నట్లు చెప్పారు. ఒక్కోలిఫ్టులో 12-14 మంది పడుతారని ఒక్కో సెకనుకు 59 అడుగులు ప్రయాణిస్తుందని తెలిపారు. భవనం అడుగు భాగంలో కనిపించే మూడు తమ్మెలను హైమనోకాలిస్ పుష్పం (ఈ పుష్పాలు అమెరికాలో పూస్తాయి) తీరుగా రూపొందినట్లు అక్కడి వారు చెప్పారు. తిరిగి వచ్చే టైంలోనే మనకు చెపుతారు. బుర్జ్ ఫౌంటెన్ కూడా చూసిపొమ్మని. అయితే దానికి టైమింగ్స్ ఉన్నాయి, దాని ప్రకారమే మనం పోవాలి. అప్పటికే అక్కడ గుంపులు గుంపులుగా జనం ఉన్నారు. రాత్రి సమయం గనుక బుర్జ్ ఖలీఫా మొత్తం తీరొక్క లైట్లతో డిజైన్లు వచ్చే లాగ వచ్చి పోతూ ఉంటాయి. ఆ అందాలను మనం ఎంత కష్టపడ్డా ఫొటోల్లో బంధించలేం. వీడియోల్లో కొంత దాచుకోవచ్చు. ఈలోపే ఫౌంటెన్ షో టైం కాగానే జనమంతా షో కాడికి వచ్చారు. మనం చాలాచోట్ల ఫౌంటెన్ షోలు చూసినా ఇంతపెద్దవి మేమైతే ఎక్కడా చూడలేదు. పాటపై డాన్స్ చేసినట్లు రంగు రంగుల విన్యాసాలు చేస్తూ నీళ్ల చిమ్ముతూ పైకి లేవడం చూసి తీరవలిసిందే!



-వ్యాసకర్త





ఈ శతాబ్ది అద్భుతం...

బుర్జ్ ఖలీఫా ప్రాథమికంగా దక్షిణాసియా నుంచి వలస వచ్చిన కార్మికుల ద్వారా నిర్మించబడ్డట్లు, నిర్మాణ ప్రదేశం వద్ద 7,500 మంది నైపుణ్యం కలిగిన పనివారు నిరంతరంగా పనిచేసినట్లు చెప్పారు. పరిశోధన, మానవ హక్కుల పరిశీలన నివేదిక ప్రకారం ఇక్కడ పనిచేసే కార్మికులు అత్యంత దైన్యంతో నిండిన పరిసరాల మధ్య జీవనం సాగించినట్లు, వారి వేతన చెల్లింపులు సైతం తరచూ ఆలస్యమయ్యేవని, దీనికి ప్రధాన కారణం వారి పాస్‌పోర్టులను వారి యజమానులు తీసుకొని వారి వద్ద ఉంచుకోవడంగా చెబుతారు. ఈ కట్టడం ఈ శతాబ్ద అద్భుతమనడంలో ఏ అతిశయోక్తి లేదు. ఎడారిలో మానవ విజ్ఞాన విజయానికి గర్వపడుతూ అవుపడ్డంతమేర చూస్తూ ... పెంచుకున్న ఆశలను ఆకాశంలోకి వదులుతూ. హెూటల్ కు తిరుగుముఖం పట్టాం. కారులో వస్తుంటే నాకు పాకిస్తాన్ నుండి బతకడానికొచ్చిన డ్రైవర్ కు మధ్య ఒక ఆసక్తికర సంభాషణ జరిగింది. "సార్ బతకడానికొచ్చిన వారు దీన్ని కట్టారు... బతకడానికే వచ్చిన నేను మిమ్ములను తీసుకొచ్చాను. కట్టిన వాళ్ళు... తీసుకొచ్చిన వాళ్ళు... చూడడానికొచ్చిన మీరు.. ఎవ్వరం ఈ దేశం వాళ్ళంకాము. ఆశ్యర్యంగా అందరం ఇక్కడ కలుసుకొన్నాం. .అంతా డబ్బు మహిమ సార్" అన్నాడు. నిజమే... దారిలో వస్తుంటే చెమట చుక్కలపై నడిచి వచ్చిన భావన. ఎంత మంది వలస జీవుల కన్నీటి స్వప్నమో కదా ఈ కట్టడం. దూరంగా మెరుస్తున్న బుర్జ్ ఖలీఫా ఇప్పుడు వలస జీవుల ఆకలి పాట పాడుతున్నట్టుంది!!!???

- స్ఫూర్తి
9490098694

గులాబీల రాజధాని...

తైఫ్... సౌది అరేబియా దేశంలోని అల్-సరావత్ పర్వతాల తూర్పు ప్రాంతం లో ఉంది. ఇది గొప్ప సంస్కతి కలిగిన నగరం. ఎన్నో సుందరమైన ఎత్తైన పర్వతాల మధ్య వెలసిన నగరం తైఫ్.ఇక్కడ పర్యాటకులకు హదయానందం కలిగించే ఎన్నో ప్రదేశాలున్నాయి. సాధారణంగా సౌదీయులకు ఇదో వేసవి రాజధాని. సౌది అరేబియాలోని వేసవి వేడిని తప్పించుకొని ఇక్కడి చల్లని వాతావరణ ఆనందాన్ని పొందడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కింగ్ డమ్ ఆఫ్ సౌది అరేబియా లోని వివిధ ట్రైబ్స్ (ఆదివాసీలు) పేర్లను అనుసరించి 'తైఫ్ ' అని పేరు పెట్టారు. వ్యవహారిక భాషలో 'తాయఫ్ ' అని కూడా పిలుస్తారు. సౌది అరేబియా లోని రెండవ ఎత్తైన పర్వత ప్రదేశంలో ఉన్న అల్-షఫా పర్వతం పై అల్-షఫా అనే చిన్న గ్రామం వెలిసింది. ఇక్కడి స్వచ్ఛమైన పర్వత గాలిని ఆస్వాదిస్తే కలిగే ఆనందనం వర్ణనాతీతం. ఇది సముద్రమట్టానికి 2,200 - 2,500 మీటర్ల ఎత్తులో ఉంటుంది. కాబట్టి వ్యవసాయ ఉత్పత్తి గ్రామంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ ఒంటెల పై స్వారీ చేయడం ఓ ఉత్సాహం.




సమ్మర్ సీజన్‌లో హెూటళ్లన్నీ వందశాతం బుక్ అయి పోతాయి. అందుకే తైఫ్‌లో ఓ రెండు రోజులుండి ఇక్కడి పర్యాటక దశ్యాలను చూసి ఆనందం పొందాలంటే అడ్వాన్స్‌గా హెూటల్ గాని లేదా అపార్ట్ మెంట్ గాని బుక్ చేసుకోవాలి. జెద్దా, మక్కా నగరాల నుంచి వచ్చే వాళ్ల తెల్లావారుజామున ఆరుగంటలకు బయలుదేరితే రాత్రి వరకు ఇక్కడ గడిపి, అర్ధ రాత్రికి ఇంటికి చేరుకోవచ్చు. వీకెండ్ రోజుల్లో చూడదగిన ప్రదేశాలు...

శుబ్ర ప్యాలెస్: శుబ్ర ప్యాలెస్‌ను 150 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఇది అబ్దుల్లా బెన్ ఔన్ నివాసం. కాని 1949లో కింగ్ అబ్దుల్ అజీజ్ దీన్ని రాయల్ ఫ్యామిలీ కోసం కొన్నారు. ఆ తర్వాత వేసవి గహంగా మార్చాడు. ఇందులో 155 గదులు ఉన్నాయి. ఇప్పుడది పురాతన హిజాజ్ చారిత్రాత్మక ప్రదేశం. ప్రస్తుతం మ్యూజియంగా మార్చడంతో పర్యాటకుల సందడి పెరిగింది.

టర్కిష్ ఫోర్ట్: ఇది చారిత్రాత్మక ఆకర్షణ గల ఓట్టొమన్ కాలం నాటి కట్టడం. ఆ కాలంలో ఇది సైనిక స్థావరం. ఇది రాక్ క్వారింగ్స్ దగ్గర ఉంది. 1917లో లారెన్స్ ఆఫ్ అరేబియా పోరాడారని చరిత్ర చెబుతున్నది. టర్కిష్ ఫోర్ట్‌ను కచ్చితంగా చూడవల్సిన ప్రదేశంగా చెప్పుకోవచ్చు.

అల్-హద మౌంటైన్స్: ఈ మౌంటైన్స్ ఓ ప్రత్యేక ఆకర్షణ. ఇక్కడికి వెళ్లే ముందు అంటే హై వే దగ్గర కోతులు అధిక సంఖ్యలో దర్శనమిస్తాయి. పర్యాటకులు అందించే తాజా పండ్లను కోతులు బాగా ఇష్టపడతాయి. చాలా సార్లు పండ్ల కోసం దాడులు కూడా చేస్తుంటాయి కోతులు. కొందరికిది ఆనంద మైన రిస్క్! నడుపుతూన్న కార్ల పై కోతులు రాళ్ళు రువ్వడం. కార్లు అదను తప్పి ఆక్సిడెంట్ కావడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది.

అల్-హద్‌లో కేబుల్ కార్ ద్వారా పర్యాటకులకు తైఫ్ పర్వతాల అద్భుత దశ్యాలను చూడడానికి వీలుంటుంది. ఇది సౌది అరేబియా, ప్రాచ్య దేశాలలో ఉన్న అతి పెద్ద కేబుల్ కార్.



నేషనల్ మ్యూజియం: పర్యాటకులకు కుతూహలాన్ని పెంచే మ్యూజయంగా దీన్ని చెప్పుకోవచ్చు. సౌది అరేబియాలోని పూర్వం వినియోగించిన టెక్నాలజీ, సౌది చరిత్ర గురించి నేషనల్ మ్యూజియంలో తెలుసుకోవచ్చు. ఈ మ్యూజియంలో ముఖ్యంగా ఎడారిలో 'బిదుయిన్స్' (ఎడారి లో జీవనం గడిపే తెగ) ఉపయోగించే పరికరాలు, పని ముట్లు, వారి దుస్తువులు వగైర వగైరాలు చక్కగా అమర్చబడి ఉంటాయి.

పురాతన కోట: ఈ కోట పర్యాటకులకు ఆకర్షితమైన ల్యాండ్ మార్క్. ఈ కోట ఆర్కిటెక్చర్ ప్రత్యేకంగా శత్రువుల దాడికి తట్టుకునేలా, కంట్రోల్ టవర్స్‌తో నిర్మించారు. ఇది ఇస్లామిక్ కల్చర్‌ను ఇనుముడింపజేసేలా ఉన్నది. పురాతన కోట తైఫ్ కు పశ్చిమాన ఉంటుంది. పురాతన కోటగా విరాజిల్లుతూ, ప్రత్యేక సాంకేతిక నైపుణ్యంతో, రాళ్లతో కట్టబడిన ఈ కోటలోని రాళ్ళు గాలి, తుఫానులు, శీతల గాలులను, వేసవి వేడి నుంచి కాపాడేలాగ ఈ కోటను నిర్మించారు. కోట పై అంతస్థులో ప్రత్యేక నిఘా గదులు ఉంటాయి. కోటయజమాని ఏ లాంటి గొడవలు, ఆక్రమణలు జరిగిన వాటిని గమనించడానికి, వీక్షించడానికి వీలుగా ఉండేది. కోటలోని చెక్కలతో తయారు చేసిన హస్తకళ నైపుణ్యానికి పర్యాటకులు ముగ్ధులవు తుంటారు.

అల్-మస్సార ఇంటర్నేషనల్ ఈక్విస్ట్రియన్ సెంటర్: దీన్ని1982 లో స్థాపించారు. మధ్య ప్రాచ్యం లోని అతి పెద్ద గుర్రపుస్వారీ కేంద్రం. అరేబియన్ గుర్రాలను కోనుగోలు చేసే కేంద్రాన్ని చూడొచ్చు. గుర్రాల స్వారీ కోర్సులు కూడా ఉన్నాయి. ట్రైనింగ్ పొందిన వారికి, రౌతులకు సర్టిఫికేట్లు ఇస్తారు.

షాపింగ్ సెంటర్: తైఫ్‌లో షాపింగ్ ఆసక్తికరమైంది. పాత షాపింగ్ సెంటర్ సూక్ అల్-బలద్. ఇది పాత నగరమైన తైఫ్‌కు సింహద్వారం. ఇదొక పురాతన సంప్రదాయ బజారుగా చెప్పుకోవచ్చు. ఈ బజారులో హ్యాండిక్రాఫ్ట్స్, స్థానికంగా దొరికే తేనె, సుగంధ ద్రవ్యాలు, నెయ్యి ప్రసిద్ధి చెందినవి. అలాగే వధువుల దుస్తులు ప్రత్యేక ఆకర్షణ. దాంతో పాటు వెండి, బంగారు అల్లికలతో తయారు చేసిన బుర్కాలు లభిస్తాయి. ఇక్కడ సాంప్రదాయ దుస్తులు కూడా విక్రయిస్తారు. ముఖ్యంగా యూరోపీ యులకు ఆకర్షణీయ మైన షాపింగ్ సెంటర్. తాజా పండ్లు కొనడానికి పండ్ల దుకాణం మరో ప్రత్యేక ఆకర్షణ. తైఫ్‌లో దానిమ్మ పండ్లు, ద్రాక్ష, ఖర్జూరం, పుచ్చ కాయలు, బెర్రీలు, ఫిగ్స్ ప్రసిద్ధమైన పండ్లు.

ప్రత్యేక ఆకర్షణ: వందేళ్ల నుంచే గులాబీ పువ్వుల సాగు ఉత్పత్తి లో తైఫ్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. పర్యాటకుల కోసం రోడ్ల వెంబడి బారులు తీరి కార్క్ పెట్టెలలో గులాబీ పూలను అమ్ముతుంటారు. గులాబీ అత్తరు, గులాబీ నీళ్ల ఉత్పత్తి ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. ఇక్కడి మునిసిపాలిటీ, సౌదీ కమిషన్ ఫర్ టూరిజం అండ్ అంటిక్యుటిస్ విభాగం వారు 'రోజ్ ఫెస్టివల్' ను ప్రతి సంవత్సరం జరుపుతుంటారు. దీన్ని చూడడానికి జాతీయ, అంతర్జాతీయ సందర్శకులు వస్తుం టారు. తైఫ్ లో ఉన్న చల్లని ప్రదేశాలైన అల్-హద, అల్-షఫా, అల్-గదీర్ ప్రాంతాలలో గులాబీ తోటలను సాగు చేస్తారు. దాదాపు 233 మిలియన్లు (2 కోట్ల 33 లక్షలు) గులాబీ పూలు. ఇక్కడ ఉన్న 34 ఫ్యాక్టరీలలో 19,000 సీసాల గులాబీ అత్తరును తయారు చేస్తారు. గులాబీలలో చెప్పుకోదగ్గ సీరియన్ జ్యూరీ గులాబీ సైజ్‌లో పెద్దదిగాను సుందరంగాను ఉన్నప్పటికి తైఫ్ గులాబి పూవు ముందు దిగదుడుపే!

వాతావరణం: తైఫ్ సందర్శించడానికి ఉత్తమ సమయం ఏప్రిల్ చివరి వారం నుంచి అక్టోబరు మొదటి వారం. సెప్టెంబర్ అతి తేమ గల నెల. అత్యంత శీతల నెల జనవరి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు చల్లని రోజులు. కనీస 'ఉష్ణోగ్రత 49 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 71 డిగ్రీలు'. అప్పడప్పుడు వర్షం, మంచు కురుస్తుంటాయి! ఇస్లామ్ కు పూర్వం ఆరవ శతాబ్దిలో తాయఫ్ మత సంబంధమైన కేంద్రంగా విరాజిల్లింది. ఇక్కడ 'తాయఫ్ స్త్రీ' (లేడి ఆఫ్ తాయఫ్) 'అల్లత్' అనే దేవత ఉండేది. ఈ నగరానికి 'ది గార్డెన్ ఆఫ్ హెజాజ్', 'హెజాజ్ వనం' అని కూడా స్మరించుకొంటారు. తైఫ్ విమానాశ్రం నుంచి 15 నిమిషాల ప్రయాణంలో ఇంటర్ కాంటినెంటల్ హోటల్ కు చేరుకోవచ్చు. ఇక్కడ రాజకుటుంబీకులు, పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు బస చేస్తుంటారు, ఈ హోటల్‌ను 1978 లో నిర్మించారు.

> **ఒక్కసారి పర్యటనలకు అలవాటు పడితే మనసు ఊరుకోదు. మళ్లీ మళ్లీ అటే వెళ్లాలని ఉరకలేస్తుంది.**
> **- ప్యాట్ కాన్ రే**



- అమ్జద్



మిథాలీ సారథ్యంలో..

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్

ముంబయి : దక్షిణాఫ్రికాపై వారి సొంత గడ్డపై 2-1తో వన్డే సిరీస్ సాధించుకొచ్చిన మిథాలీరాజ్.. ఇప్పుడు స్వదేశంలో కంగారూ పరీక్షకు సిద్ధమవుతోంది. వరుస అర్ధ సెంచరీలతో మెరిసిన మిథాలీరాజ్ మార్చి 12 నుంచి వడోదరలో జరగనున్న మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియాకు సారథ్యం వహించనున్నది. ఈ మేరకు ఆల్ ఇండియా ఉమెన్ సెలక్షన్ కమిటీ అమ్మాయిల జట్టును ప్రకటించింది. 'ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఆల్ ఇండియా ఉమెన్ సెలక్షన్ కమిటీ మహిళల జట్టును ఎంపిక చేసింది. తర్వాత జరుగబోయే ముక్కోణపు టీ20 సిరీస్‌ను త్వరలోనే జట్టును ప్రకటిస్తాం. ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్ (2017-2020)లో భాగంగానే ఈ సిరీస్ జరుగబోతుంది' అని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి పేర్కొన్నాడు. సఫారీ పర్యటనలో విశేషంగా ఆకట్టుకున్న ముంబయి యువ క్రీడాకారిణి జెమీమా రొడ్రిగస్ జట్టులో నిలుపుకున్నది. గాయంతో సఫారీ టూర్ మధ్యలోనే స్వదేశానికి వచ్చిన వెటరన్ పేసర్ జులన్ గోస్వామి ఆసీస్‌తో సిరీస్‌కూ దూరమైంది. మార్చి 12న తొలి వన్డే, 15న రెండో వన్డే, 18న మూడో వన్డే జరుగనున్నాయి.

భారత మహిళల వన్డే జట్టు : మిథాలీ రాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్ (వైస్ కెప్టెన్), స్మృతి మంధాన, పూనమ్ రౌత్, జెమీమా రొడ్రిగస్, వేద కృష్ణమూర్తి, మోన మెష్రం, సుష్మ వర్మ (వికెట్ కీపర్), ఎక్తా బిస్త్, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్, శిఖా పాండే, సుకన్య పరిద, పూట వాస్త్రేకర్, దీప్తి శర్మ.



కర్ణాటక తీన్‌మార్!

మూడోసారి విజయ్ హజారే ట్రోఫీ సొంతం

- ఫైనల్లో సౌరాష్ట్రపై ఘన విజయం
- రాణించిన మయాంక్, గౌతమ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

దేశవాళీ వన్డే ఫార్మాట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని కర్ణాటక సొంతం చేసుకున్నది. ఈ ఏడాది దేశవాళీ సీజన్‌లో రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టీ20ల్లో నిరాశపరిచిన కర్ణాటక వన్డే టోర్నీలో మెరిసింది. మంగళవారం జరిగిన తుది పోరులో సౌరాష్ట్రపై 41 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కర్ణాటకకు ఇది మూడో విజయ్ హజారే ట్రోఫీ కాగా.. అన్నీ గత ఐదేండ్లలోనే సాధించటం విశేషం. 2013-14లో రైల్వేస్‌పై, 2014-15లో పంజాబ్‌పై మెరుపు విజయాలతో విజయ్ హజారే విజేతగా నిలిచిన కర్ణాటక తాజాగా సౌరాష్ట్రను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్నది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (90, 79 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత ఇన్నింగ్స్‌కు తోడు రవికుమార్ సమ్రత్ (48), దేశ్‌పాండే (49)లు రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 253 పరుగులు చేసింది. ఛేదనలో సారథి చటేశ్వర్ పుజారా (94, 127 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) మెరిసినా సహచర ఆటగాళ్లలో మరెవ్వరూ రాణించలేకపోయారు. కర్ణాటక పేసర్ ప్రసిద్ కృష్ణ, స్పిన్నర్ కృష్ణప్ప గౌతమ్‌లు చెరో మూడు వికెట్లు కూల్చి సౌరాష్ట్ర పతనాన్ని శాసించారు. దీంతో 46.3 ఓవర్లలో సౌరాష్ట్ర 212 పరుగులకే కుప్పకూలింది. విజయ్ హజారే ట్రోఫీ కర్ణాటక దక్కించుకున్నది. గెలుపు ఇన్నింగ్స్ నమోదు చేసిన మయాంక్ అగర్వాల్ 'మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.



పుజారా ఆడినా.. : ఊరించే ఛేదనలో సౌరాష్ట్రకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్ వ్యాస్ (10)ను ప్రసిద్ ఆరంభంలోనే అవుట్ చేవాడు. మూడో స్థానంలో వచ్చిన ధర్మేంద్రసిన్హ్ జడేజా (1)ను బిన్నీ సాగనంపాడు. మరో ఓపెనర్ బరోత్ (30)తో కలిసి కెప్టెన్ చటేశ్వర్ పుజారా (94) ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. మూడో వికెట్‌కు 62 పరుగులు జోడించాడు. తర్వాత వచ్చిన రవీంద్ర జడేజా (15) నిరాశపరచగా.. మన్కడ్ (0), వాసవడ (0)లను కృష్ణప్ప గౌతమ్ సున్నా పరుగులకే అవుట్ చేశాడు. దీంతో 101/6తో సౌరాష్ట్ర ఓటమి అంచుల్లో నిలిచింది. చిరాగ్ జానీ (22), కమలేశ్ (20)లతో కలిసి పుజారా చేసిన పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే కుదించగల్గింది.

మయాంక్ మెరుపులు : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటకకు సౌరాష్ట్ర ఆరంభంలో చుక్కలు చూపించింది. కెప్టెన్ కరుణ్ నాయర్ (0), కెఎల్ రాహుల్ (0)లను డకౌట్ చేసి కన్నడ జట్టును ఒత్తిడిలోకి నెట్టేశారు. కానీ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (90), రవికుమార్ సమ్రత్ (48)లు మూడో వికెట్‌కు 137 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. 11 ఫోర్లు సహా మూడు సిక్సర్లు సంధించిన అగర్వాల్ వేగంగా పరుగులు పిండుకున్నాడు. తర్వాత వచ్చిన దేశ్ పాండే (49) సైతం రవికుమార్ జోడీగా రెచ్చిపోయాడు. లోయర్ ఆర్డర్‌లో శ్రేయాష్ గోపాల్ (31) మాత్రమే కాసేపు క్రీజులో నిలిచాడు. లోయర్ ఆర్డర్ వైఫల్యంతో కర్ణాటక 45.5 ఓవర్లలోనే 253 పరుగులకు కుప్పకూలింది.

కర్ణాటక ఇన్నింగ్స్ : 253 ఆలౌట్ (మయాంక్ అగర్వాల్ 90, దేశ్ పాండే 49, రవికుమార్ 48, కమలేశ్ 4/34)
సౌరాష్ట్ర ఇన్నింగ్స్ : 212 ఆలౌట్ (చటేశ్వర్ పుజారా 94, అవి బరోత్ 30, ప్రసిద్ కృష్ణ 3/37, కృష్ణప్ప గౌతమ్ 3/27)

మాథ్యూస్ అవుట్

● ముక్కోణపు టీ20 సిరీస్

కొలంబో : గాయంతో బాధపడుతున్న శ్రీలంక సీనియర్ ఆటగాడు ఎంజెలో మాథ్యూస్ మార్చి మొదటి వారంలో ఆరంభం కానున్న ముక్కోణపు టీ20 సిరీస్‌కు దూరమ్యాడు. మాథ్యూస్ లంక జట్టుకు వన్డేల్లో రెగ్యులర్ సారథే అయినా, ఈ ఏడాది జనవరి నుంచి ఒక వన్డేలో మాత్రమే సారథ్యం వహించాడు. ఇటీవల బంగ్లాదేశ్ పర్యటనలో దినేశ్ చండిమాల్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వస్తాడని భావించగా, 70వ స్వాతంత్ర్య వేడుకల ప్రత్యేక సిరీస్‌కు మాథ్యూస్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో దినేశ్ చండిమాల్ సారథ్యంలో శ్రీలంక ప్రాథమికంగా జట్టును ఎంపిక చేసింది. ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, తిశార పెరీరా, సదిర సమరవిక్రమ సహా నువాన్ ప్రదీప్, దుష్మంత చమీరాలు జట్టులో ఉన్నారు. భారత్, బంగ్లాదేశ్, శ్రీలంకలు తలపడనున్న ముక్కోణపు టీ20 సిరీస్ మార్చి 6 నుంచి ఆరంభం కానున్నది.





రాజకీయాలపై ఆసక్తి!

డర్బన్ : క్రీడాకారులు రాజకీయాల్లోకి రావటం కొత్త కాదు. ఆ మాట కొస్తే క్రికెటర్లు సైతం రాజకీయాల్లో కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు. పాక్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆ దేశ రాజకీయాల్లో క్రీయాశీల పాత్ర పోషిస్తుండగా, మన దగ్గర ఒలింపిక్ షూటర్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోర్ ఏకంగా కేంద్ర మంత్రిగానే కొనసాగుతున్నారు. ఇటీవల క్రికెట్ ఆస్ట్రేలియా, ఆటగాళ్ల అసోసియేషన్‌కు మధ్య తలెత్తిన వేతన వివాదం ప్రశాంతంగా ముగియటంలో ప్రముఖ పాత్ర పోషించాడు స్టార్ ఓపెనర్ డెవిడ్ వార్నర్. తొలి నుంచి రాజకీయాలపై ఆసక్తితో ఉన్న వార్నర్ రిటైర్మెంట్ తరువాత క్రీయాశీల రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు లేకపోలేదని సంకేతమిచ్చాడు. 'క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత, ఇంకేదైనా(రాజకీయాల్లోకి వచ్చేందుకు) చేయడానికి సంకోచించను. వివాద సమయంలో పరిష్కార సంకేతంగా ఆమోదయోగ్యమైన పాయింట్ కావాలని భావించా, అదే చేశాను' అని వార్నర్ అన్నాడు. ఆస్ట్రేలియా ప్రధాని టోనీ బ్లెయిర్ సహా ఇతర రాజకీయ నాయకులతో సన్నిహితంగా మెలిగే వార్నర్ తాజా వ్యాఖ్యలతో భవిష్యత్‌లో పొలిటికల్ ఎంట్రీకి ముందే సిగ్నల్ ఇచ్చేసినట్టు కనిపిస్తున్నాడు!.

స్పేస్ డ్రోన్స్ వచ్చేస్తున్నాయ్..

ఉపగ్రహ సేవలు మరియు మరమ్మతుల కోసం కొత్త సాంకేతికతతో డ్రోన్లు..



కాలం మారుతోంది. మారుతోన్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ కూడా ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతూనే ఉన్నది. బహిరంగ సభలు, వివాహ వేడుకల్లో వీడియోల కవరేజీ, టవర్ల పర్యవేక్షణ, కొన్ని రక్షణ విభాగాలు, ఆహార పదార్థాల డెలివరీ వగైరా వంటి పనులకు ఇప్పటి వరకు ఉపయోగిస్తూ వస్తోన్న డ్రోన్ల సర్వీసుల పరిధి శాటిలైట్ సేవల(స్పేస్ డ్రోన్స్) వరకూ విస్తరిస్తుండటం విశేషం.

- డెత్‌జోన్‌లో సైతం విజయవంతంగా డ్రోన్లను పరీక్షించిన చైనా
- శాటిలైట్ చిత్రాల కంటే క్లారిటీగా.. 20కి.మీ ఎత్తు నుండే ఫొటోలు!
- చెడిపోయిన ఉపగ్రహాలకు మరమ్మతులు చేస్తామంటున్న ఎఫెక్టివ్ స్పేస్ నిర్వాహకులు
- అంతరిక్షంలో ఉపగ్రహ వ్యర్థాలు తగ్గే అవకాశం ఉందంటున్న శాస్త్రవేత్తలు

కడవేర్గు

"ఇంగ్లాండ్ లోని గ్రిమ్స్ బై పట్టణంలో తాజాగా జరిగిన ఓ కారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి.. రోడ్డు పక్కన ఆరడుగుల గోతిలో కూరుకుపోయి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, అతన్ని కనుగొనలేకపోయారు. ఐతే, ఆ ప్రాంత పరిధిలో సైట్ ను పర్యవేక్షిస్తున్న ఓ డ్రోన్ గాయపడిన అతని శరీర ఉష్ణోగ్రతను బట్టి అతను ఎక్కడున్నాడో.. సదరు పోలీసులకు సమాచారం అందించడం.. క్షణం ఆలస్యం చెయ్యకుండా.. పోలీసులు అతన్ని ఆస్పత్రిలో చేర్చడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. 'సరైన సమయంలో బాధితుడ్ని ఆస్పత్రికి తీసుకురావడం వల్లే అతన్ని కాపాడగలిగాం' అని వైద్యులు పేర్కొనడం విశేషం". ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతున్నది. డ్రోన్ల వ్యవస్థ మూలంగా రక్షణ విభాగాల్లో కొంత ప్రమాదం లేకపోలేదన్న వాదనను పక్కనబెడితే.. ప్రమాదాలు, దొంగతనాలు తదితర అంశాల్లో పోలీసు వ్యవస్థకు డ్రోన్ల సేవలు ఎలా ఉపయోగపడుతున్నాయో రోజూ జరుగుతోన్న సంఘటనలు చూస్తే అర్థమవుతోంది.

కాగా, కొద్దిరోజుల క్రితం.. సముద్ర మట్టానికి 20 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల (65వేల అడుగుల నుంచి 3.28లక్షల అడుగులు- డ్రోన్ల పాలిట డెత్‌జోన్‌గా వ్యవహరిస్తారు) ఎత్తున ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాటరీలు ఫెయిల్ అయ్యే వాతావరణంలో సైతం తిరిగే అత్యాధునిక నిఘా డ్రోన్లను చైనా దేశం విజయవంతంగా పరీక్షించింది. ఈ పరిశోధనతో.. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఉపగ్రహాల సాయం లేకుండానే.. భూగర్భం, భూతలంకు సంబంధించిన ఫొటోలను చాలా క్లారిటీతో నేలపై ఉన్న కంట్రోల్ సెంటర్‌కు అత్యంత తక్కువ కాలంలోనే పంపే వెసులుబాటు కలగడం విశేషం. అంటే, భూమిపై తక్కువ ఎత్తులో కావలసిన సేవలకు శాటిలైట్లకు ప్రత్యామ్నాయంగా డ్రోన్లు వినియోగంలోకి రానున్నాయన్న మాట!

ఉపగ్రహాలకు చికిత్స

కోట్లాది రూపాయలతో ప్రయోగించిన శాటిలైట్స్ ఒకసారి కక్ష్యలోకి చేరిన తరువాత నిర్ణీత కాలవ్యవధి ముగియక మునుపే, కొన్ని సాంకేతిక సమస్యల మూలంగా మొరాయించడం, ఇంధనమైపోవడం వల్ల పనిచెయ్యకపోవడం వంటి ఘటనలతో నిరుపయోగంగా మారిపోతుండటం తెలిసిందే! ఐతే, తక్కువ ఖర్చుతో దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనే దిశగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఓ కంపెనీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. 'ఎఫెక్టివ్ స్పేస్' అనే సంస్థ భూ స్థిరకక్ష్యలో సాంకేతిక కారణాల వల్ల స్తబ్దుగా ఉన్న ఉపగ్రహాల మరమ్మతుకు ఇంకో రెండేండ్లలో అంటే 2020 నాటికి రెండు డ్రోన్లతో ఇంధనం, బాగుచేసే టెక్నాలజీ ప్రోగ్రాం, విడిభాగాల వంటిని పంపేందుకు పథకరచన చేస్తున్నట్టు ప్రకటించింది. కాగా, ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఎఫెక్టివ్ స్పేస్ సంస్థతో ఒక కంపెనీ ఇప్పటికే 650కోట్లతో ఒప్పందాన్ని కుదుర్చుకోవడం విశేషం. కాగా, అంతరిక్షంలో రోజురోజుకూ పేరుకుపోతున్న ఉపగ్రహ వ్యర్థాలకు ఈ కొత్త పద్ధతి బాగా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రోన్లు -ఆసక్తికర అంశాలు

- అల్ ఖైదా ముఖ్యనేత ఒసామా బిన్ లాడెన్ ను కనిపెట్టే ఉద్దేశంతో మొట్టమొదటి ఆర్మ్‌డ్ - డ్రోన్లను అమెరికా వినియోగించింది.
- ప్రపంచవ్యాప్తంగా సుమారు 24దేశాలకు డ్రోన్లను ఎగుమతి చేస్తూ.. డ్రోన్ ఎక్స్ పోర్టర్ గా ఇజ్రాయిల్ రికార్డులకెక్కింది.
- 2020 నాటికి డ్రోన్ల మార్కెట్ విలువ సుమారు 8.25 కోట్లకు చేరుతుందని అంచనా!



ఈ చెత్తేంది సారూ..

స్వచ్ఛ తెలంగాణ సచివాలయానికి వర్తించదా?

- అపరిశుభ్ర వాతావరణంలో క్యాంటీన్
- చెట్ల కిందనే వంట..వార్పు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



స్వచ్ఛ తెలంగాణ నినాదం సచివాలయానికి వర్తించదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ్ భారత్‌ను విధిగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రోడ్లు, ఇండ్ల మధ్యలో చెత్తను వేయకుండా వందలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాలనీ వాసులకు రెండు చెత్త బుట్టలను ఉచితంగా అందజేస్తున్నది. కాలనీలు అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులపైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరిస్తున్నది. కానీ నిత్యం మంత్రులు, ముఖ్యకార్యదర్శులు, ఉన్నతాధికారులు సంచరించే సచివాలయం వెనుకభాగం మొత్తం చెత్తమయంగా మారింది. రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయంలోనే చెత్త, చెదారంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటే రాష్ట్రంలో ఇక స్వచ్ఛ తెలంగాణ అమలవుతుందా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సచివాలయంలోని బ్లాకుల్లో ఉన్న చెత్తను సచివాలయం వెనుకభాగంలోనే డంప్ చేస్తున్నా దానిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

అపరిశుభ్ర వాతావరణంలోనే క్యాంటీన్

చెత్త చెదారంతో నిండిన ప్రాంతంలోనే క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న క్యాంటీన్ రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి కేటాయించిన సచివాలయం పరిధిలోకి వెళ్లింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్ని నెలల పాటు ఏపీ క్యాంటీన్ సచివాలయానికి వచ్చే సందర్శకులకు అందుబాటులో ఉండేది. తెలంగాణ ప్రజలు ఏపీ క్యాంటీన్‌కు వెళ్లడం తెలంగాణకు సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులకు నచ్చలేదు. దీంతో తెలంగాణ సచివాలయంలోనే క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేసినా క్యాంటీన్ కోసం ప్రభుత్వం భవనాన్ని నిర్మించలేదు. భోజనం కోసం ఉపయోగించిన విస్తరాకులను అక్కడే పారవేస్తుండటంతో క్యాంటీన్ పరిసర ప్రాంతమంతా చెత్త చెదారంతో నిండిపోతున్నది.

క్యాంటీన్ భవన నిర్మాణంపై నిర్లక్ష్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హడావుడిగా సుమారు రూ. 500 కోట్లతో ప్రగతిభవన్, ఐఏఎస్ అధికారుల కోసం నూతన క్వార్టర్స్, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, సచివాలయం ముఖ ద్వారం నిర్మాణాలు చేపట్టిన సర్కారు.. సచివాలయంలో అధునాతనమైన క్యాంటీన్‌ను ఏర్పాటు కోసం భవనాన్ని నిర్మించలేదు. సచివాలయానికి రోజుకు సుమారు 1500 మందికి పైగా సందర్శకులు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వీరితో పాటు సచివాలయంలో పని చేసే ఉద్యోగులు, ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ విలేకరులు, కెమెరామెన్‌లు భోజనం కోసం క్యాంటీన్‌ను ఆశ్రయిస్తుంటారు. క్యాంటీన్ వద్ద తగిన స్థలం లేకపోవడం వల్ల భోజనం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.